




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ




రేపు నల్లగొండ జిల్లా చండూరులో ఉజ్జిని నారాయణరావు భవన్ ప్రారంభోత్సవం

వ్యాసం 2లో


సంపుటి 29, సంచిక: 23 | ఆదివారం | 12-07-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## కాళేశ్వరం ప్రాజెక్టును

# ఎన్‌డిఎస్‌ఎకే అప్పగిస్తాం



> నేను రెండే రెండు డిమాండ్లు ఈటల రాజేందర్ ముందుంచుతున్నా. ఎన్‌డిఎస్‌ఎను కలిసి నీళ్లు ఎత్తిపోయాలని చెప్పండి. ఎన్‌డిఎస్‌ఎకు మేము సంపూర్ణంగా సహకరిస్తాం. సిబిఐ వద్ద మూలుగుతున్న కాళేశ్వరం కేసుపై విచారణ ముందుకు తీసుకెళ్లేలా చేయండి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, అవినీతి ఆరోపణలపై విచారణను మేం సిబిఐకి అప్పగించాం. 2025 సెప్టెంబర్ 1వ తేదీన ఈ కేసును సిబిఐకి అప్పగిస్తూ జీవో నెం.104 జారీ చేశాం. ఇప్పటికీ విచారణ ఎందుకు వేగంగా సాగడం లేదో సమాధానం చెప్పాలి.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

- కేంద్రాన్ని ఒప్పించి, వారితోనే నీటిని ఎత్తిపోయించండి : ఎంపి ఈటలకు సవాల్
- కెసిఆర్ నేతృత్వంలోని కిలాడి కమిటీ ఒత్తిడికి ప్రభుత్వం లొంగబోదు
- ఆ కమిటీకి చైర్మన్‌గా కెసిఆర్ ఉండగా, హరీశ్‌రావు, కెటిఆర్‌తో పాటు ఈటల కూడా సభ్యుడిగా చేరారు
- కాళేశ్వరం మూడు బ్యారేజీల పునరుద్ధరణ చర్యలకు కేంద్రం ఇటీవలే ప్రత్యేక సాంకేతిక పర్యవేక్షణ కమిటీ వేసింది
- కనీస పంపింగ్‌లెవల్ 93.50మీటర్లు ఉంటేనే ఎత్తిపోత సాధ్యం
- మేడిగడ్డ బ్యారేజీలో లోపాలున్నాయని 2020 మే 18నే ఎఇ డి.వి. రమణారావు లేఖ రాశారు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- హరీశ్‌రావును కెసిఆరే నమ్మలేదు... ప్రభుత్వం ఎలా నమ్ముతుంది
- పాత కమీషన్ల వసూళ్ల కోసమే మంత్రి పదవి అడుగుతున్నాడని విమర్శ
- ప్రాజెక్టుల గేట్లు మూసేస్తే బ్యారేజీలకు దెబ్బ అని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

'కాళేశ్వరం ప్రాజెక్టును ఎన్‌డిఎస్‌ఎ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ)కు అప్పగిస్తాం. నీళ్లు ఎత్తిపోయాలని ఎన్‌డిఎస్‌ఎనే కోరండి. మేమైతే నీళ్లు ఎత్తిపోయం. అలా చేస్తే భద్రాచలం మునుగుతుంది. బిఆర్‌ఎస్ కోరుతున్నట్టు కాళేశ్వరం (కన్నెపల్లి పంప్‌హౌస్) నీటిని ఎత్తిపోసే అంశం సాధ్యం కాదు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ఒక వేళ ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్‌ను బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ఒప్పిస్తే నీటిని ఎత్తిపోసేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల గేట్లను మూసివేస్తే తప్ప పంప్‌హౌస్‌ల వద్ద నీటిని ఎత్తిపోసి నీటిని నిల్వ చేస్తే బ్యారేజ్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని పునరుద్ఘాటించారు. కెసిఆర్ నేతృత్వంలోని 'కిలాడీ' కమిటీ ఒత్తిడికి ప్రభుత్వం లొంగబోదని, తాము ఎన్‌డిస్‌ఎ కమిటీ సూచనల మేరకే పని చేస్తామని సిఎం స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎంసిహెచ్‌ఆర్‌డిలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ తరువాయి 8లో



# ఉన్మాది కిరాతకం

## భార్య ఇద్దరు పిల్లలతో పాటు మరో ముగ్గురు మహిళల దారుణ హత్య

- మైనర్ బాలికను వేధిస్తున్నాడని నిందితుడిపై పోక్సో కేసు
- కక్షతో ఉన్మాదం
- రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో దారుణ విషాదం
- షాబాద్ ఎస్ఐ రమేశ్ సస్పెన్షన్



ప్రజాపక్షం/రంగారెడ్డి/షాబాద్

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ఓ సైకో కిల్లర్ తన భార్య ఇద్దరు పిల్లలతో సహా మరో ముగ్గురు మహిళలను అత్యంత కిరాతకంగా నరికి చంపిన ఘోర సంఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు గురిచేసింది.సంఘటనకు సంబంధించి స్థానికులు పోలీసుల కథనం ప్రకారం జిల్లా షాబాద్ మండలం నాగర్ కుంట గ్రామపంచాయతీ పరిధిలోని దైవాలగూడా కు చెందిన పోక్సో కేసు నిందితుడు పార్వతి రాజ్ కుమార్ (28) షాబాద్ లో నివాసం ఉంటూ..ఆ పక్కనే నివాసం ఉంటున్న మైనరు బాలిక (17)ను లైంగికంగా వేధిస్తుండడంతో బాలికతో పాటు తన తల్లి స్థానిక పోలీస్ స్టేషన్ లో మే 16 న ఫిర్యాదు చేశారు.దీంతో పోలీసులు పార్వతి రాజ్ కుమార్ పై పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసేందుకు యత్నించారు. అయితే పరారీలో తరువాయి 8లో

# రూ.7.86 కోట్ల టోకరా

## బెంగళూరు నగల వ్యాపారిని మోసగించిన -హైదరాబాదీ

ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యాపార లావాదేవీల పేరిట కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను స్వీకరించి, భారీ మొత్తాన్ని చెల్లించకుండా బిచాణ ఎత్తివేసిన నగల దుకాణం ఉదంతం తాజాగా బెంగళూరులో వెలుగు చూసింది. బెంగళూరుకు చెందిన నగల వ్యాపారికి హైదరాబాద్‌కు చెంది న నగల దుకాణ యజమాని రూ.7.86 కోట్ల టోకరా వేసి దుకాణం ఎత్తివేశారనే ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బెంగళూరు జ్యువెలరీ హౌస్ యజమాని తరువాయి 12లో

# వియత్నాంలో స్పీడ్‌బోటు బోల్తా

## ఇద్దరు తెలుగువారు సహా 15 మంది భారత టూరిస్టులు మృతి

- మరో నలుగురు ఆంధ్రా పర్యాటకులు గల్లంతు!
- బోటులో ఉన్నవారంతా మొబైల్ కంపెనీ ఉద్యోగులే
- తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ

**హనోయ్:** వియత్నాంలో స్పీడ్‌బోటు బోల్తా పడింది. విహారయాత్రకు వెళ్ళి ఈ బోటులో ప్రయాణిస్తున్న 15 మంది భారతీయ పర్యాటకులు మరణించారు. మరణించినవారిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నారు. వీరిలో ఒకరిని కడప నగరానికి చెందిన శ్రీధర్‌గా, మరొకరిని మచిలీపట్నానికి చెందిన మహిళ జయశ్రీగా గుర్తించారు. ఆమె భర్త కిషోర్ పరిస్థితి విషమంగా తరువాయి 12లో



## అత్యంత ప్రాధాన్యతతో

# భూ రీ సర్వే

- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి
- ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి యూనిఫాం అందించాలి
- జిల్లా కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్ర వ్యాప్తంగా భూ రీ సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీ సర్వే, భూ భారతి అమలు, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బిహెచ్‌కె ఇండ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో తరువాయి 8లో

## ఎన్యూమరేషన్ ఫారాలు

# తక్షణమే డిజిటలైజేషన్

తప్పులు దొర్లకుండా చేయాల్సిన బాధ్యత అధికారులదే : రాష్ట్ర సిఇఒ సుదర్శన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' ప్రక్రియను పారదర్శకంగా, అత్యంత వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా ఈ ప్రక్రియ సాగాలని ఆయన స్పష్టం చేశారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న 'సర్' ప్రక్రియను సిఈఓ సుదర్శన్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు తరువాయి 12లో

## గాయని ఎస్.జానకి

# కన్నుమూత

## గుండెపోటుతో మైసూర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచిన గానకోకిల



హైదరాబాద్/ప్రజాపక్షం


ప్రముఖ నేపథ్యగాయని ఎస్.జానకి ఇక లేరు. మైసూరులోని తన నివాసంలో గుండెపోటుతో ఆమె తుదిశ్వాస విడిచారు. ఎనభై ఎనిమిదేళ్ల జానకి వయోభారంతో పాటు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. కొద్ది నెలల క్రితం ఆమె కుమారుడు చనిపోవడంతో అప్పటి నుంచి జానకి మానసికంగా కృంగిపోయారు. ఇంట్లోనే కార్డియాక్ అరెస్ట్ రావడంతో వెంటనే కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గుండెపోటుతో తుదిశ్వాస తరువాయి 12లో







## అర్ధరాత్రి వచ్చే అతిథి!



అమెరికాలోని కాలిఫోర్నియా, అల్టాడెనా ప్రాంతంలో ఒక ఇంటి యజమానికి ఊహించని వింత అనుభవం ఎదురైంది. తన ఇంటి కింద సెల్లార్ నుండి ప్రతిరోజూ రాత్రిపూట వింత వింత శబ్దాలు వస్తుండటాన్ని ఆయన గమనించాడు. నిద్రకు భంగం కలిగిస్తున్న ఆ శబ్దాల వెనుక ఉన్న రహస్యాన్ని తెలుసుకోవడానికి పరిశీలించగా, అక్కడ ఒక భారీ నల్ల ఎలుగుబంటి నివాసం ఉంటున్నట్లు తేలింది. దాదాపు 550 పౌండ్ల (సుమారు 250 కిలోల) బరువున్న ఆ భారీ ఎలుగుబంటి, ఇంటి కింద ఉన్న ఖాళీ స్థలంలోకి పదేపదే దూరి, అక్కడ బాగా అలవాటు పడిపోయింది. పగలంతా అడవిలో తిరిగినా, రాత్రి అయ్యేసరికి ఆ ఇంటి కింద హాయిగా విశ్రాంతి తీసుకోవడం దానికి అలవాటుగా మారింది. అది అటు ఇటు కదులుతున్నప్పుడు వచ్చిన శబ్దాలే ఇంటి యజమానిని భయపెట్టాయి. చివరకు వన్యప్రాణి అధికారుల సహాయంతో ఆ భారీ ఎలుగుబంటిని అక్కడి నుండి సురక్షితంగా బయటకు పంపి, మళ్లీ అది లోపలికి రాకుండా ఇంటి కింద ఉన్న ప్రవేశ మార్గాలను మూసివేశారు. ఈ వింత 'అతిథి' ఉదంతం స్థానికంగా పెద్ద చర్చనీయాంశమైంది.

## పార్సిల్‌లో 'ఉడుత'..




థాయ్‌లాండ్‌లోని ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' కార్పొరేట్ కార్యాలయంలో ఒక వింత సంఘటన చోటుచేసుకుంది. ఆఫీసుకు డెలివరీ అయిన ఒక పార్శిల్ బాక్స్‌ను సిబ్బంది తెరిచినప్పుడు, అందులో నుండి ఊహించని విధంగా ఒక ఉడుత ఒక్కసారిగా బయటకు దూకింది. పార్శిల్ నుండి బయటపడిన ఆ ప్రాణి తీవ్ర భయంతో ఆఫీస్ అంతటా పరుగులు తీయడం ప్రారంభించింది. వర్క్‌స్పేస్‌లోని కంప్యూటర్, కుర్చీలు, ఫైళ్లపైకి ఎక్కుతూ అది చేసిన హడావుడితో ఆఫీసులో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. ప్రశాంతంగా పని చేసుకుంటున్న ఉద్యోగులు ఈ వింత అతిథిని చూసి షాక్‌కు గురయ్యారు. కొందరు భయంతో కేకలు వేయగా, మరికొందరు దానిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఈ ఆకస్మిక పరిణామంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పనికి కాసేపు బ్రేక్ పడింది. చివరకు సిబ్బంది అంతా కలిసి, సుమారు 20 నిమిషాలు కష్టపడి, ఆ ఉడుతకు ఎటువంటి గాయం కాకుండా సురక్షితంగా పట్టుకుని, ఆఫీస్ వెలుపల చెట్లలో వదిలేశారు. కొరియర్ ప్యాకేజీలో ఉడుత ఎలా వచ్చిందనేది ఎవరికీ అర్థం కాలేదు కానీ, ఈ ఘటనకు సంబంధించిన చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## జంతువుల్లోనూ సానుభూతి!



మనుషుల్లోనే సానుభూతి కరవవుతున్న కాలంలో, జంతువుల్లో అలాంటి గుణం ఉంటుందా అన్న ప్రశ్న ఉదయించకమానదు. ఈ ప్రశ్నకు కొన్ని శాస్త్రీయ పరిశోధనలు ఆసక్తికరమైన సంకేతాలను అందిస్తున్నాయి. ఒక ప్రముఖ అధ్యయనంలో శాస్త్రవేత్తలు ఒక ఎలుకను పారదర్శకమైన చిన్న పెట్టెలో బంధించి, మరో ఎలుకను బయట స్వేచ్ఛగా సంచరించేలా ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల పరిశీలన తర్వాత, బయట ఉన్న ఎలుక పెట్టె తలుపు ఎలా తెరవాలో నేర్చుకుని, లోపల చిక్కుకున్న తన సహచర ఎలుకను బయటకు విడుదల చేసింది. ఈ ప్రయోగంలో మరో విశేషం కూడా ఉంది. బయట ఉన్న ఎలుకకు చాక్లెట్ వంటి ఇష్టమైన ఆహారం అందుబాటులో ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో అది ముందుగా తన తోటి ఎలుకను విడిపించి, అనంతరం రెండూ కలిసి ఆహారాన్ని పంచుకుని తిన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ ప్రవర్తన ఎలుకల్లో సహకార భావన, సామాజిక బంధం, తోటి జీవి పరిస్థితిని గుర్తించే సామర్థ్యం ఉన్నట్లు సూచిస్తోంది. అయితే దీనిని మనుషుల సహానుభూతితో పూర్తిగా సమానంగా భావించడం సరైంది కాదని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రవర్తన వెనుక సహజ సామాజిక స్వభావం, పరస్పర సహకారం, సామూహిక జీవన లక్షణాలు వంటి అనేక కారణాలు ఉండవచ్చని వారు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా, పరిమాణంలో చిన్నవైన ఎలుకలు కూడా సంక్లిష్టమైన సామాజిక ప్రవర్తనను ప్రదర్శించగలవు.

## అంతరించిపోతున్న ఆకాశ నౌకలు



ఒకప్పుడు ఆకాశంలో గంభీరంగా తేలియాడుతూ విమానయాన రంగానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన 'బ్లింప్'లు నేడు అరుదైన దృశ్యాలుగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం కేవలం రెండు డజన్లకు పైగా, అంటే సుమారు 25 బ్లింప్‌లు మాత్రమే క్రియాశీలకంగా ఉపయోగంలో ఉన్నట్లు అంచనా. బ్లింప్ అనేది హీలియం వంటి గాలి కంటే తేలికైన వాయువుతో నింపబడిన ఒక రకమైన ఎయిర్‌షిప్. సాధారణ విమానాల మాదిరిగా రెక్కల ద్వారా కాకుండా, ఈ వాయువు కల్పించే తేలే శక్తితో గాల్లో ప్రయాణిస్తుంది. అందువల్ల ఇవి నెమ్మదిగా, స్థిరంగా ప్రయాణించగలవు. ఎక్కువసేపు గాల్లో ఉండటం వీటి ప్రధాన ప్రత్యేకత. 20వ శతాబ్దం ప్రారంభంలో బ్లింప్‌లను ప్రయాణికుల రవాణా, సైనిక నిఘా, వైమానిక చిత్రీకరణ, ప్రకటనలు వంటి అనేక అవసరాలకు వినియోగించేవారు. అయితే వేగవంతమైన విమానాల ఆవిర్భావం, నిర్వహణ వ్యయం పెరగడం, ముఖ్యంగా 1937లో జరిగిన హిండెన్‌బర్గ్ ఎయిర్‌షిప్ ప్రమాదం తర్వాత వీటి వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం బ్లింప్‌లను ప్రధానంగా క్రీడా పోటీల వైమానిక చిత్రీకరణ, పర్యాటక విహారయాత్రలు, ప్రకటనలు, శాస్త్రీయ పరిశోధనలు, పర్యావరణ పర్యవేక్షణ వంటి ప్రత్యేక రంగాల్లో ఉపయోగిస్తున్నారు.

## ఆలోచనల్లో మేటి తేనెటీగలు



చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ తేనెటీగల మెదడు అత్యంత సమర్థంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు చాలాకాలంగా గుర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని పరిశోధనలు, విశ్రాంతి సమయంలో తేనెటీగ లు పగటిపూట సేకరించిన సమాచారాన్ని మెదడులో మళ్లీ ప్రాసెస్ చేస్తున్నాయని సూచిస్తున్నాయి. అయితే దీనిని మనుషుల మాదిరిగానే అన్నింటినీ 'సింహావలోకనం' చేసుకుంటాయని చెప్పడానికి ఇప్పటి వరకు తగిన శాస్త్రీయ ఆధారాలు లేవు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, విశ్రాంతి సమయంలో తేనెటీగల నాడీ వ్యవస్థ గత అనుభవాలను పునర్వ్యవస్థీకరించడం ద్వారా జ్ఞాపకాలను బలపరుస్తుంది. దీనివల్ల పూలు ఉన్న ప్రదేశాలను గుర్తుంచుకోవడం, తేనెపట్టు నుంచి ఆహార వనరుల వరకు సరైన మార్గాన్ని గుర్తించడం, కొత్త పరిసరాలను నేర్చుకోవడం వంటి సామర్థ్యాలు మెరుగుపడతాయి. మనుషుల్లో నిద్ర సమయంలో జ్ఞాపకాలు క్రమబద్ధీకరించబడినట్లే, తేనెటీగల్లో కూడా ఇలాంటి జీవసంబంధ ప్రక్రియలు జరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. తేనెటీగలు వేలాది పూల స్థానాలను గుర్తుంచుకోవ డం, సూర్యుడి స్థానాన్ని ఆధారంగా చేసుకుని దిశను నిర్ధారించ డం, అలాగే ప్రసిద్ధ 'వాగుల్ డ్యాన్స్' ద్వారా ఇతర తేనెటీగలకు ఆహారం ఉన్న ప్రదేశాన్ని తెలియజేయడం వంటి క్లిష్టమైన పనులను సమర్థంగా నిర్వహిస్తాయి. ఇవన్నీ వాటి అసాధారణ జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యానికి నిదర్శనాలు. ఈ పరిశోధనలు చిన్న జీవుల మెదడు కూడా అత్యంత సంక్లిష్టంగా పనిచేస్తుందని తెలియజేస్తున్నాయి. అయితే తేనెటీగలు మనుషుల మాదిరిగా కలలు కంటాయనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదు. కాబట్టి వాటి ప్రవర్తనను శాస్త్రీయ ఆధారాల ప్రకారమే అర్థం చేసుకోవడం అవసరం.

**– బిఎస్ఎస్ మైత్రేయి**

# ఉన్నత విద్య కేంద్రీకరణకు తీవ్ర అభ్యంతరాలు

ఉన్నత విద్యను పూర్తిగా తమ అధీనంలో ఉంచుకోవటానికి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లుకు పలు అత్యున్నత స్థాయి విద్యాసంస్థలనుంచి, పలు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత స్వాగతించదగింది. ఈ బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం ఆదేశించిన ఫెడరల్ వ్యవస్థకు వ్యతిరేకం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికే వ్యతిరేకం. దాని లక్ష్యం యూనిటరీ వ్యవస్థ – అనగా అధ్యక్ష తరహా పాలన. అప్పుడు రాష్ట్రాలు నామమాత్రావశిష్టమవుతాయి. అన్ని అధికారాలు అధ్యక్షుని చేతిలోనే ఉంటాయి. రాజ్యాంగాన్ని మార్చే శక్తిని ప్రజలు ఇవ్వని కారణాన, రాజ్యాంగంలోని వెసులుబాట్లను ఉపయోగించుకుని అధికారాలను కేంద్రీకరిస్తూ చట్టాలు చేస్తున్నది. జిఎస్‌టి వ్యవస్థను ప్రవేశపెట్టి – అదేదో రెండవ స్వాతంత్ర్య సాధన అన్నంత బిల్డప్ ఇచ్చి – స్వాతంత్ర్యం సిద్ధించిన అర్ధరాత్రిని సంకేతంగా తీసుకుని ఆ చట్టాన్ని పార్లమెంటు భవన్ నుంచి అర్ధరాత్రి అమలులోకి తెచ్చింది. ఆ చట్టం రాష్ట్రాల ఆర్థిక సార్వభౌమత్వాన్ని గుంజుకుంది. జాతీయ విద్యావిధానమంటూ ఒక తిరోగమన విధానాన్ని దేశంపై రుద్దింది. జాతీయ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ)ని నెలకొల్పి 'ఒకే దేశం–ఒకే పరీక్ష' అంటూ వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్షలను దానికి అప్పగించింది. పరీక్ష పేపర్ల లీకుతో ఆ నిర్వహణ ఎంత భ్రష్టుపట్టిందో చూస్తున్నాం. అంతకుముందు రాష్ట్రాలు తమ స్వంత ఎంసెట్ పరీక్ష ద్వారా ఎంబిబిఎస్, ఇంజినీరింగ్, బి.ఫార్మసీ తదితర సీట్లు భర్తీ చేసుకునేవి. ప్రాంతీయ భాషలో కూడా పరీక్ష ఉండేది గనుక మాతృభాషలో చదువుకున్న గ్రామీణ విద్యార్థులకు సైతం ప్రవేశపరీక్షలో న్యాయం జరిగేది. అటువంటి కేంద్రీకరణ పరంపరలో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త బిల్లు ''వికసిత్ భారత్ శిక్షా అధిస్థాన్ (విబిఎస్ఎ) బిల్లు,' 2025. ఈ బిల్లు ప్రస్తుతం బిజెపి ఎంపి డి.పురంధేశ్వరి చైర్మన్‌గా జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్, అఖిల భారత సాంకేతిక విద్య కౌన్సిల్, ఉపాధ్యాయ విద్య జాతీయ కౌన్సిల్ చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో ఒకేఒక అత్యున్నత సంస్థ (విబిఎస్ఎ) ఏర్పాటుకు ఈ బిల్లు ఉద్దేశించింది. రెగ్యులేటరీ, అక్రిడిటేషన్, స్టాండర్డ్స్ : కౌన్సిళ్లు ఈ బిల్లు కిందకు వస్తాయి. ఈ నూతన నియంత్రణ వ్యవస్థ నుంచి తమను మినహాయిస్తున్నట్లు స్పష్టంగా బిల్లులో చేర్చాలని ఐఐటిలు, ఐఐఎంలు వంటి జాతీయ ప్రాముఖ్యతగల సంస్థలు(ఐఎన్ఐలు), వాటితోపాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (ఐఐఎస్ఇఆర్‌లు)కోరాయి. ఐఎన్ఎస్‌లు, ప్రఖ్యాతిగాంచిన సంస్థల స్వయం ప్రతిపత్తి రక్షణను క్లాజు 49 వాగ్దానం చేస్తున్నదనే ప్రభుత్వ వాదనతో ఆ సంస్థలు సంతృప్తిపడలేదు.

ఆంధ్రప్రదేశ్, మేఘాలయ, మధ్రప్రదేశ్ వంటి ఎన్‌డిఎ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బిల్లులోని కేంద్రీకరణ నిబంధనలను గట్టిగా వ్యతిరేకించినట్లు జెపిసికి ఆ ప్రభుత్వాలు సమర్పించిన మెమొరాండంలు తెలియజేస్తున్నాయి. కాన్పూర్, హైదరాబాద్, సంబాల్‌పూర్ ఐఐటిలు, ఐఐఎస్ఇఆర్–మొహాలీ బిల్లు పరిధినుంచి పూర్తి మినహాయింపు కోరాయి. పరిశోధన, పాఠ్యప్రణాళిక, అకడమిక్ కార్యకలాపాలకు సంబంధించి సంపూర్ణమైన వ్యవస్థాగత స్వయంప్రతిపత్తి అవసరాన్ని అనేక ఇతర ఐఐటిలు, ఐఐఎంలు, ఐఐఎస్ఇఆర్‌లు వక్కాణించాయి. ఐఐటిలు, ఐఐఎంలు, ఐఐఎస్ఇఆర్‌లను నెలకొల్పిన చట్టాలకన్నా ప్రతిపాదిత బిల్లులోని నిబంధనలు ప్రాధాన్యం పొందుతున్నాయని ధనబాద్ ఐఐటి, కోల్‌కతా ఐఐఎస్ఇఆర్, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ ఎత్తి చూపాయట. లా, మెడిసిన్‌లను బిల్లు పరిధిలో చేర్చకపోవటాన్ని ఐఐటి–బొంబాయి ప్రశ్నించిందట! బిల్లులోని పెనాల్టీ స్వరూపాన్ని అనేక సంస్థలు విమర్శించాయట.

ఈ అధికార కేంద్రీకరణ బిల్లును రానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశంలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ బిల్లును ''చాలా చెడ్డ విద్యా చట్టం''గా అభివర్ణించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ ఈ విబిఎస్ఎ బిల్లును గట్టిగా వ్యతిరేకించాల్సిందిగా ఎన్‌డిఎ ప్రభుత్వాలకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు రాష్ట్రాల ప్రయోజనాలకు హాని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గట్టిగా అభిప్రాయపడినట్లు తెలుస్తున్నది. ఉన్నత విద్య విషయంలో సమన్వయం, ప్రమాణాల నిర్ణయం వరకే ఎంట్రీ 66 కింద పార్లమెంటరీ అధికారం పరిమితం చేయబడిందని గుర్తు చేసిన రమేశ్ ఈ బిల్లు ఆ అధికారాన్ని అతిక్రమిస్తున్నదన్నారు.

ఈ బిల్లు ఫలితం గా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్, అఖిల భారత సాంకేతిక విద్య కౌన్సిల్ ప్రస్తుతం కలిగిఉన్న గ్రాంట్‌ల పంపిణీ అధికారం కేంద్ర విద్యామంత్రిత్వశాఖ కిందకు వెళుతుందని, దీనితో ఉన్నత విద్యా సంస్థలపై కేంద్ర కంట్రోలు పెరుగుతుందన్నారు. ఉన్నతవిద్య నియంత్రణ వ్యవస్థలో కీలక మార్పులు తలపెట్టిన ఈ బిల్లుపై విద్యావేత్తలతో, సంస్థలతో మరింత విస్తృత చర్చ జరగాలి. ఉన్నత విద్యాసంస్థల మాటకు విలువ ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాన్ని గుంజుకునే ప్రయత్నాలకు రాజకీయాలతో నిమిత్తం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు గట్టిగా వ్యతిరేకించి ఈ తిరోగమన బిల్లు ను కేంద్రం ఉపసంహరించుకునేటట్లు చేయాలి. ●

# నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు శిఖరం 'ఉజ్జిని'

**రేపు నారాయణరావు 10వ వర్ధంతి. చింతపల్లిలో సిపిఐ కార్యాలయానికి నామకరణం సందర్భంగా ఈ చిరువ్యాసం ప్రచురిస్తున్నాం – సం॥**

ఉజ్జిని నారాయణరావు మన నుండి దూరమై నేటికి పది సంవత్సరాలు అవుతుంది. వారు స్వయంగా చింతపల్లి మండల కేంద్రంలో వెయ్యి గజాల స్థలం సేకరించి అందులో కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు కోసం నాలుగు గదులతో శాశ్వతంగా ఆఫీసు నిర్మాణం చేసినారు.. ఆ ఆఫీసును ఆధునీకరించి 'కామ్రేడ్ నారాయణ రావు భవన్' గా నామకరణం చేయాలని దేవరకొండ నియోజకవర్గ కమిటీ నిర్ణయించింది.. ఆ మేరకు నేడు వారి 10వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆ భవన్‌కు కామ్రేడ్ నారాయణరావు భవన్‌గా నామకరణం చేయనున్నారు. ఈ సందర్భంగా 'ఉజ్జిని నారాయణరావు ఉద్యమ ప్రస్థానం' పేరుతో వారితో ఐదు దశాబ్దాలుగా ఉద్యమ అనుబంధం ఉన్న ఉజ్జిని రత్నాకర్ రావు రూపొందించిన పుస్తకాన్ని మండల కేంద్రంలో సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించనున్నారు.

ఉజ్జిని నారాయణరావు ఉద్యమమే ఊపిరిగా.. పోరాటమే బాటగా.. కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా చేతబట్టి ఆరు దశాబ్దాలపాటు పేద ప్రజల కోసం కష్టజీవుల కోసం నిరంతరం ఉద్యమాలు నడిపిన నాయకుడు ఉజ్జిని.

ఆయన జీవితకాలమంతా అట్టడుగు ప్రజల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేశారు. సైద్ధాంతిక నిబద్ధత గల ఉజ్జిని నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం నుంచి తొలిసారిగా 1967లో సిపిఐ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో సైకిల్ మోటార్‌తోనే ప్రచారం చేశారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ చీలిక తో ఓడిపోయినప్పటికీ తిరిగి 1972లోకూడా పోటీచేసి ఓటమి ఎదురైనప్పటికీ నిరంతరం ప్రజల్లోనే కొనసాగారు. ఆ తర్వాత 1985,1989, 1994లో వరుసగా మునుగోడు నియోజకవర్గం నుంచి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. నిజాం రాచరిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న జాగిర్దారి, వతందారి, భూస్వామ్య, దొరల దౌర్జన్యాలను ఎదిరించాలని కమ్యూనిస్టు పార్టీ(ఆంధ్ర మహాసభ) పిలుపుతో దేవరకొండ తాలూకాలో నారాయణరావు గారు తన సహచరులైన పల్లా పర్వత రెడ్డి, బొడ్డుపల్లి రామశర్మ, పైగిడి మద్రి మల్లప్ప తదితరులతో కలిసి 1950లో కమ్యూనిస్టు పార్టీ చేరారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ దళాలు రహస్యంగా దేవరకొండ ప్రాంతానికి రావడంతో వారితో సంబంధాలు ఏర్పాటు చేసుకొని దళాలకు అన్ని విధాలుగా.. షెల్టర్స్ సహకారం అందిస్తూ అడవి బాట పట్టారు. భూస్వామ్య వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగించారు.

సాయుధ పోరాట విరమణతో 1952లో జరిగిన మొదటి ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ(పిడిఎఫ్) అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేశారు. ఆనాటి పాత దేవరకొండ తాలూకాలోని పెద్దమునగల్, దేవరకొండ, చిన్న కొండూరు నియోజకవర్గాలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకున్నారు.

1953లో సిపిఐ దేవరకొండ తాలూకా నిర్మాణ మహాసభ జరిపి దానికి కార్యదర్శిగా ఎన్నికై 1968 వరకు, తిరిగి 1972 నుండి 1982 వరకు తాలూకా కార్యదర్శిగా పనిచేశారు.

**భూ పోరాటాలు :** కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో దున్నేవానికి భూమి నినాదంతో ప్రభుత్వ బంచరాయి భూములు, భూస్వాముల కింద అక్రమంగా ఉన్న భూములు, చెట్లు లేని అడవి బంజరు భూములను గుర్తించి దేవరకొండ తాలూకాలో వివిధ గ్రామాలలో 10,000 ఎకరాల భూములను భూమిలేని పేదలతో ఆక్రమింపజేసి వారికి





పట్టాలు వచ్చేంతవరకు ఉద్యమాలు నడిపించారు. ఇందులో ప్రస్తుత చింతపల్లి మండలంలోని పోలేపల్లి రాంనగర్ భూస్వామి శీలం అల్వాల్ రెడ్డి స్వాధీనం లో ఉన్న 600 ఎకరాల భూములను పంచారు. శివన్నగూడెం, కుదాబక్షి పల్లి గ్రామాల్లోని భూస్వాముల భూములపై పోరాటం చేసి భూముల ను ఇప్పించారు. శివన్నగూడెం, సగంపేట, మెల్లవాయి, మధులాపురం తదితర గ్రామాలలో దేవాలయ భూములు భూస్వాముల చేతుల్లో ఉండేవి. అట్టి భూములను భూమిలేని పేదలకు ఇవ్వాలని దేవాలయ భూముల పోరాటాన్ని నడిపించి వందలాదిమంది పేదలకు ఇప్పించటంలో నారాయణరావు కృషి మరువలేనిది. ఎక్కడ ప్రభుత్వ భూములు, సీలింగు భూములు, అటవీ, దేవాదాయ భూములు, చెరువు శిఖం భూములు ఉన్నా భూస్వాముల నుండి బయటకుతీసి అవి పేదలకు చెందాలని పోరాటాలకు నడుంబిగించిన భూ పోరాట యోధుడు ఉజ్జిని. ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పెంచిన అదనపు భూమి శిస్తులకు వ్యతిరేకంగా సత్యాగ్రహాలు చేపట్టాలని కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపుతో దేవరకొండ తహసిల్దార్ కార్యాలయం ముందు 60 రోజులు పాటు రోజు 4–5 గ్రామాలనుంచి రైతులను సమీకరించి సత్యాగ్రహం చేపడుతూ శిస్తు తగ్గించుకోవడంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. రక్షిత కౌలుదారుల సాగులో ఉన్న భూములను వారికి పట్టాలు ఇప్పించడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

ఆనాడు గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం ఆసరా చేసుకుని అతి తక్కువ వేతనాలు కూల్లు ఇస్తుండేది. గ్రామాల్లో కూలి సంఘాలను ఏర్పాటు చేసి కూలి రేట్లు పెంచడంలోనూ జీతగాళ్ల( పాలేర్లకు) జీతాలు పెంచడంలోనూ ఉద్యమాలు నడిపించారు. చాలా గ్రామాలలో ఆబ్కారి విధానం (కల్లు సారాయి దుకాణాల వేలం) ఉండేది. ఈ అరాజు విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర గీతపని వారల సంఘం అధ్యక్షులు బి.ధర్మబిక్షం సహకారంతో తాలూకాలో గీత కార్మికులను సంఘటన పరిచి సంఘాలు పెట్టి 'గీసే వానికి చెట్టు', విధానం కొరకు గీత పనివారల సంఘాలు ఏర్పాటు చేసి తాలూకాలో వేలములను బహిష్కరించి వేలం లేని విధంగా కార్మికులకు ఇప్పించారు.

కరువు పీడిత ప్రాంతంగా ఉన్న దేవరకొండ తాలూకాకు కృష్ణా జలాలు అందించాలని..అందుకు ఎస్ఎల్బిసి (శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం) చేపట్టాలని, కమ్యూనిస్టు పార్టీ ద్వారా అనేక సందర్భాల్లో ఉద్యమాలు చేపట్టడం జరిగింది. మునుగోడు నియోజకవర్గం శాసనసభ్యులుగా ఫ్లోరిన్ పీడిత గ్రామాలకు శాశ్వత రక్షిత మంచి పథకం చేపట్టాలని ఉద్యమించి కృష్ణా జలాలను 90% గ్రామాలకు ఇప్పించడం జరిగింది.

ఇప్పటి రాజకీయాల్లో ధన బలం, అధికార ప్రదర్శన, ఆధిపత్యం పెరిగింది. విలువలకు తిలోదాకాలు ఇచ్చి పార్టీ కండువా మార్చడం సాధారణమైంది. ఓటర్లను ప్రలోభపెట్టే ధోరణి విస్తరించింది. పదవిని సంపాదన మార్గంగా వినియోగించే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితులకు ఉజ్జిని జీవితం పూర్తిగా వ్యతిరేకం.

**నిరంతరం ప్రజలలో ఉండేవారు :**

జనబలం అసలైన బలమనినమ్మేవారు.. ప్రజలలో ఉండేవారు. ప్రజల మధ్యలో ఉండటం తిరగడం నాయకత్వానికి మూలమని చాటారు. పారదర్శకత ప్రజా విశ్వాసాన్ని పెంచుతుందని వివరించారు. నిబద్ధతతో సేవచేస్తే గౌరవం స్వయంగా వస్తుందని నిరూపించారు. ప్రజా ప్రతినిధి అంటే అధికార ప్రదర్శన కాదు. సేవా భావం కావాలి. నైతిక విలువలు రాజకీయాలకు ప్రామాణికం కావాలి. ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఉండాలి. ఈ మార్గాన్ని చూపిన ఆదర్శ నాయకుడు ఉజ్జిని నారాయణరావు.

శాసనసభ్యుడిగా ఉన్నప్పటికీ మొదటి టర్మ్ పూర్తిగా బస్సులోనే తిరిగేవారు. రెండవ టర్మ్ లో జీపులో అంగరక్షకులు లేకుండా తిరిగేవారు. ఆ తర్వాత మూడవ టర్మ్ లో ఎంబాసిడర్ కార్ వాడారు.

సిపిఐ లో ఆరు దశాబ్దాల పాటు నల్లగొండ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులుగా, దేవాదాయ భూముల సాగుదార్ల రైతు సంఘం అధ్యక్షులుగా, ప్రజాప్రతినిధులుగా పనిచేసి తన 90వ ఏట వృద్ధాప్యంతో 2016 జులై 13 కన్నుమూశారు. వారు మన నుండి దూరమై 10సంవత్సరాలు అవుతున్న దేవరకొండ తాలూకా ప్రజలు..మునుగోడు నియోజకవర్గ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నారు. ప్రజల కోసం బతికిన వారు ఎల్లకాలం జీవిస్తారనే సత్యానికి ఉజ్జిని జీవితం నిలువెత్తు నిదర్శనం.

**ఉజ్జిని రత్నాకర్ రావు**

# సంపద పెరిగినా... దేశం స్థాయి మారలేదు!

**డా॥ జ్ఞాన్ పారక్**

ప్రపంచంలో నామమాత్ర స్థూల దేశీయోత్పత్తి పరంగా భారత్ 4.18 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో నాలుగో అతిపెద్ద దేశం అని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే దేశపు ఆర్థిక వ్యవస్థ ఎంత అనే దానికంటే, ఆ దేశ ప్రజల సగటు ఆదాయం ఎంత అనే అంశం మీదనే అభివృద్ధిని అంచనా వేయాలి. ఈ నేపథ్యంలో వరల్డ్ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన దేశాల ఆదాయ వర్గీకరణ భారత్ ఆర్థిక పురోగతిపై మరో కోణాన్ని చూపిస్తోంది. 2025 ప్రపంచ బ్యాంక్ గణాంకాల ఆధారంగా విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, భారత్ ఇంకా దిగువ మధ్య ఆదాయ దేశంగానే ఉంది. 2025లో భారత్ తలసరి స్థూల జాతీయ ఆదాయం 2,760 అమెరికన్ డాలర్లుగా మాత్రమే నమోదైంది. భారత్ 2007లో తక్కువ ఆదాయ దేశాల జాబితా నుంచి దిగువ మధ్య ఆదాయ దేశాల జాబితాలోకి చేరింది. ఆ తర్వాత దాదాపు 19 సంవత్సరాలుగా ఎలాంటి ఎదుగూబొదుగూ లేకుండా కొనసాగుతూ వస్తోంది. అంటే ఇన్నేళ్లుగా ఆర్థికాభివద్ధి జరిగినా ఎగువ మధ్య ఆదాయ దేశంగా మారే స్థాయికి భారత్ చేరుకోలేకపోయింది. 2025 నాటికి వరల్డ్ బ్యాంక్ మొత్తం 218 దేశాలను నాలుగు ఆదాయ వర్గాలుగా విభజించింది. వీటిల్లో 25 దేశాలు తక్కువ ఆదాయ దేశాలు, 47 దేశాలు దిగువ మధ్య ఆదాయ దేశాలు, 59 దేశాలు ఎగువ మధ్య ఆదాయ దేశాలు, 87 దేశాలు అధిక ఆదాయ దేశాలు. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచినా, వ్యక్తిగత ఆదాయం పరంగా ఇంకా దిగువ మధ్య ఆదాయ దేశాల జాబితాలోనే ఉండటం గమనార్హం. ఈ ఏడాది వరల్డ్ బ్యాంక్ వర్గీకరణలో ఏ దేశం దిగువ ఆదాయ వర్గంలో లేదు. జోర్డాన్, మైక్రోనేషియా, ఫిలిప్పీన్స్, శ్రీలంక, వియత్నాం దేశాలు దిగువ మధ్య ఆదాయ దేశాల నుంచి ఎగువ మధ్య ఆదాయ దేశాలుగా ఎదిగాయి. అలాగే టోగో తక్కువ ఆదాయ దేశాల జాబితా నుంచి దిగువ మధ్య ఆదాయ దేశాల జాబితాలోకి చేరింది. అయితే భారత్ మాత్రం ఈసారి కూడా తన ఆదాయ వర్గాన్ని మెరుగుపరచుకోలేకపోయింది. దక్షిణాసియా దేశాల్లో శ్రీలంక ప్రత్యేక గుర్తింపు పొందింది. 2022లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో ఆ దేశం దివాలా తీసే స్థాయికి చేరినా, కేవలం మూడేళ్లలోనే ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుచుకుంది.

2025లో శ్రీలంక వాస్తవ జిడిపి 5 శాతం వద్ధి నమోదు చేసింది. పరిశ్రమలు, ఆర్థిక సేవలు, పర్యాటక రంగాల్లో పుంజుకోవడం వల్ల ఆ దేశం ఎగువ మధ్య ఆదాయ దేశంగా గుర్తింపు పొందింది. ఈ మార్పు శ్రీలంక ఆర్థిక పునరుద్ధరణకు నిదర్శనంగా నిలిచింది. 2026 జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన 2027 ఆర్థిక సంవత్సరానికి వరల్డ్ బ్యాంక్ ఆదాయ పరిమితుల ప్రకారం, 1,175 డాలర్ల కంటే తక్కువ తలసరి ఆదాయం ఉన్న దేశాలు తక్కువ ఆదాయ దేశాలుగా, 1,176 నుంచి 4,635 డాలర్ల వరకు ఉన్న దేశాలు దిగువ మధ్య ఆదాయ దేశాలుగా, 4,636 నుంచి 14,375 డాలర్ల వరకు ఉన్న దేశాలు ఎగువ మధ్య ఆదాయ దేశాలుగా, 14,375 డాలర్లకు పైగా ఉన్న దేశాలు అధిక ఆదాయ దేశాలుగా వర్గీకరించారు. ఇవి గత ఏడాది అమల్లో ఉన్న పరిమితుల కంటే ఎక్కువ.

2025–26లో తక్కువ ఆదాయ దేశాల పరిమితి 1,135 డాలర్లు కాగా, దిగువ మధ్య ఆదాయ దేశాల పరిమితి 1,136 నుంచి 4,495 డాలర్ల వరకు ఉండేది. ఎగువ మధ్య ఆదాయ దేశాల పరిమితి 4,496 నుంచి 13,935 డాలర్ల వరకు, అధిక ఆదాయ దేశాల పరిమితి 13,935 డాలర్లకు పైగా ఉండేది. వరల్డ్ బ్యాంక్ ప్రతి ఏడాది జూలై 1న, అంతకుముందు క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించిన తలసరి స్థూల జాతీయ ఆదాయం ఆధారంగా దేశాలను వర్గీకరిస్తుంది. ఒకసారి వర్గీకరణ ప్రకటించాక తదుపరి ఏడాది జులై 1 వరకు అదే అమల్లో ఉంటుంది. మధ్యలో గణాంకాలు సవరించినా ఆ ఏడాదికి వర్గీకరణను మార్చరు. దేశాల ఆదాయాన్ని లెక్కించేందు కు వరల్డ్ బ్యాంక్ అట్లాస్ పద్ధతిని ఉపయోగిస్తుంది. ఇందులో స్థానిక కరెన్సీని అమెరికన్ డాలర్లలోకి మార్చి, మారకపు విలువల్లో వచ్చే హెచ్చు తగ్గుల ప్రభావాన్ని తగ్గించేలా తలసరి స్థూల జాతీయ ఆదాయాన్ని లెక్కిస్తారు. ఈ ఏడాది విడుదల చేసిన వర్గీకరణలో మొత్తం 218 దేశాలు ఉన్నాయి. ఈ జాబితా 2027 జూన్ చివరి వరకు ప్రపంచవ్యాప్తంగా ప్రామాణిక సూచికగా ఉపయోగించబడుతుంది. ఈ ఆదాయ వర్గీకరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే ఏ దేశాలకు రాయితీ రుణాలు, అభివృద్ధి సహాయం అందించాలనే విషయాన్ని నిర్ణయించడం లో ఇది కీలకంగా ఉపయోగపడుతుంది. అలాగే ప్రభుత్వాలు, పరిశోధకులు, అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ దేశాల ఆర్థిక పురోగతిని పోల్చి చూడటానికి ఈ వర్గీకరణను ఉపయోగిస్తాయి. స్థూల జాతీయ ఆదాయం అంచనాలను ఆయా దేశాల అధికారిక గణాంకాల ఆధారంగా వరల్డ్ బ్యాంక్ ఆర్థికవేత్తలు సిద్ధం చేస్తారు.

జనాభా అంచనాల కోసం ఐక్యరాజ్య సమితి విడుదల చేసే ప్రపంచ జనాభా విభాగంతో పాటు ఇతర విశ్వసనీయ వనరులను ఉపయోగిస్తారు. ప్రతి ఏడాది అందుబాటులో ఉన్న తాజా సమాచారం తో వర్గీకరణను రూపొందించినప్పటికీ, ఒక్క సూచికతోనే దేశ అభివృద్ధిని అంచనా వేయలేమని వరల్డ్ బ్యాంక్ పేర్కొంటోంది. 1987 నుంచి ప్రపంచ ఆదాయ వర్గీకరణలో మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పట్లో ప్రపంచ దేశాల్లో 30 శాతం దేశాలు తక్కువ ఆదాయ వర్గంలో ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 11 శాతానికి తగ్గింది. వరల్డ్ బ్యాంక్ పరిశీలించే దేశాల సంఖ్య కూడా 163 నుంచి 218కు పెరిగింది. నాలుగు దశాబ్దాలుగా వేలాది ఆర్థిక గణాంకాలను విశ్లేషిస్తూ రూపొందిస్తున్న ఈ ఆదాయ వర్గీకరణ ప్రపంచ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవడానికి విశ్వసనీయమైన ప్రమాణంగా గుర్తింపు పొందింది. మొత్తంగా చూస్తే, ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారత్, వ్యక్తిగత ఆదాయం విషయంలో దిగువ మధ్య ఆదాయ దేశంగానే కొనసాగుతోంది.

ఆర్థిక వ్యవస్థ పరిమాణం ప్రతి పౌరుడి ఆదాయంలో ప్రతిబింబించినప్పుడే దేశం ఎగువ మధ్య ఆదాయ దేశంగా ఎదుగుతుందని వరల్డ్ బ్యాంక్ తాజా నివేదిక స్పష్టం చేస్తోంది.

# కోదాడలో అత్యాధునిక ఆర్‌టిసి బస్‌స్టేషన్, డిపో

- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన
- ఐదున్నర ఎకరాల్లో కార్పొరేట్‌స్థాయి నిర్మాణం
- కోదాడను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ/హుజూర్‌నగర్ :** కోదాడ పట్టణంలో రూ.16.92 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ డిపో, ఆధునిక బస్‌స్టేషన్ నిర్మాణ పనులకు శనివారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కోదాడలో కార్పోరేట్ స్థాయిలో అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన మోడల్ బస్‌స్టేషన్, డిపోను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతిరోజు సుమారు 30 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక బస్‌స్టేషన్, డిపో నిర్మాణానికి రూ.17 కోట్లకు చేరువైన నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. సుమారు ఐదున్నర ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక హంగులతో కూడిన మోడల్ బస్ స్టేషన్, డిపోను నిర్మిస్తున్నామని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన కోదాడకు వచ్చే ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆదర్శవంతమైన బస్సు స్టేషన్‌ను అందుబాటులో తీసుకువస్తామని చెప్పారు. కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి అధిక నిధులను తీసుకొచ్చి కోదాడను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కోదాడ పట్టణంలో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందుటకు రూ.26 కోట్లతో 100 పడకల హాస్పిటల్ సిటిస్కాన్ మీషన్, నాగార్జున సాగర్ కాలువలో లైనింగ్ పనులు, లిఫ్ట్ ఇరిగేషన్ రెడ్లకుంట, శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు గత ప్రభుత్వంలో పడబడినవి పూర్తిగా నిరుపయోగంగా ఉండి పోయి, కొన్ని వేల ఎకరాలకు సాగునీరు తీసుకువస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, కెవిఎన్ ప్రసాద్, బషీర్, కందుల కోటేశ్వరరావు, మేకల వెంకట్రావ్, పార సీతయ్య, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, వైస్ చైర్మన్ దేవరం మల్లీశ్వరి పాల్గొన్నారు.

**ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సులు నడపాలన్నదే లక్ష్యం రోడ్డు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని రాష్ట్ర రోడ్డు రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో 3.52 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న బస్‌స్టేషన్ నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రూ.3.52 కోట్లతో బస్ స్టేషన్ నిర్మాణం చేసుకోవడం సంతోషంగా ఉందని, తెలంగాణ వ్యాప్తంగా 10,173 ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని, 35 లక్షల మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేస్తున్నారన్నారు. మహిళ సంఘాలకు 600 బస్సులను అందించి మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కడుపు నింపేందుకు సన్న బియ్యంతో పాటు, మహిళలకు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, పెరిక కార్పోరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కవిత, పట్టణ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎమిరేట్స్ ఎంఆర్‌ఒ ఆపరేషన్స్ కొనసాగించండి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ ఎ380 సర్వీసులను ప్రారంభించడానికి ఎమిరేట్స్ విమానయాన సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ఎమిరేట్స్ విమానయాన సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ సంస్థ (ఇండియా నేపాల్) వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ సర్హన్ శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్– ఎమిరేట్స్ ఎ380 సర్వీసులను ప్రారంభించడంతో పాటు సంస్థ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలోని వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాలలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వాటి ప్రాధాన్యతను వివరిస్తూ, తెలంగాణలో ఎమిరేట్స్ ఎంఆర్‌ఒ ఆపరేషన్స్ కొనసాగించాలని కోరారు. విమాన సర్వీసులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్ విషయంలో కూడా ఎమిరేట్స్ ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ సర్వీసులను ప్రారంభించడానికి మహమ్మద్ సర్హన్ సానుకూలతను వ్యక్తం చేశారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో స్పాన్సర్‌షిప్ అందించడంపై ఆయన సానుకూలంగా స్పందించారు.

# ఉత్తమ కమ్యూనిస్టులుగా జీవితం గడిపిన దొడ్డ సోదరులు ఆదర్శప్రాయులు

- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** తమ యావత్ జీవితాన్ని ఆదర్శ జీవితంగా గడిపిన దొడ్డ నర్సయ్య, దొడ్డ నారాయణరావు ఆదర్శప్రాయులని వారి ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో జరిగిన స్వాతంత్ర సమరయోధుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా సిపిఐ కార్యదర్శి మాజీ ఎంపిపి దొడ్డ నారాయణరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై వారు మాట్లాడుతూ దొడ్డ సోదరుల త్యాగం నిబద్ధత వల్ల చిలుకూరు గ్రామానికి ప్రతిష్ట పెరిగిందని, వయసు పెరిగినప్పటికీ అన్ని ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారని, ఇవాళ్ల ప్రపంచ యావత్తు కమ్యూనిస్టు పార్టీ వైపు చూస్తున్నదని ఇటీవల కాలంలో శ్రీలంకలో అధికారంలోకి వచ్చిందని అనేక దేశాలలో ముఖ్యంగా ప్రపంచంలోని 160 దేశాలలో ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అది ట్రంప్ కూడా కమ్యూనిస్టులు అంటే భయపడుతున్నాడని, ఇటీవల కాలంలో అమెరికా నగరంలో మేయర్ పదవిని కూడా కమ్యూనిస్టులే గెలుచుకున్నారని వారు ఈ సందర్భంగా ఉదాహరించారు. దొడ్డ నారాయణరావు ఒక ఆదర్శ నాయకుడిగా మచ్చలేని ప్రజా నాయకుడిగా పని చేశారని రాజకీయాలకు అతీతంగా కృషి చేసే వారని, ప్రజా ఉద్యమాలలో కీలకపాత్ర పోషించారని ఏ పార్టీ నాయకులైనా నారాయణరావు గౌరవించారన్నారు. ఈ దేశంలో ఈ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ కృషి గొప్పదని ప్రజా వ్యతిరేక విదానాలను ప్రజల వద్దకు తీసుకుని పోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకొని అమలు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉన్నదని వారు అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు స్వాగత ఉపన్యాసం చేయగా సిపిఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ సభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, సాహెబ్‌అలీ, బద్దం కృష్ణారెడ్డి, నంద్యాల రామిరెడ్డి, దేవరం మల్లీశ్వరి, బత్తినేని హనుమంతరావు, డిసిసిబి మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, బూర వెంకటేశ్వర్లు, చేపూరి కొండలు, దొడ్డ నారాయణరావు కుమారులు దొడ్డ రమేష్‌బాబు, దొడ్డ శ్రీధర్, ఝాన్సీ, డాక్టర్ అందె సత్యం, డాక్టర్ జాస్తి సుబ్బారావు, రావెళ్ల సీతరామయ్య, సిపిఐ సర్పంచులు మండవ జయమ్మ, గుగులోత్ లలిత, కడియాల పద్మ, వాడకొప్పుల ఉమా పోతురాజు సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ కాటంరాజు, చిలువేరు ఆంజనేయులు, దొడ్డ నారాయణరావు కుటుంబసభ్యులు, పార్టీ ప్రజా సంఘాల నాయకులు కొండా కోటయ్య, దొడ్డ వెంకటయ్య, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకయ్య పాల్గొన్నారు.

# నీటిని ఎత్తిపట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కన్నెపల్లి పంప్‌హౌజ్ వద్ద లక్ష క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నప్పటికీ, వాటిని ఎత్తిపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహారిస్తోందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. ఈ పంప్‌హౌజ్‌ల ద్వారా నీటిని ఎత్తిపోయవచ్చని రిటైర్డ్ ఉద్యోగులు ప్రభుత్వానికి సూచించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి తన పాలన పట్ల పూర్తి విశ్వాసం ఉంటే శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని,లేదా కనీసం స్థానిక సంస్థలు, పార్టీ ఫిరాయించిన పది మంది ఎంఎల్‌ఎలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకైనా సిద్ధమవ్వాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియ సమావేశంలో శాసనమండలిలో ప్రధానప్రతిపక్ష నేత ఎస్.మదుసూధనాచారి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, టి.రాజయ్య, మాజీ ఎంపి నామా నాగేశ్వర్‌రావు, గంగ్ర వెంకటరమణారెడ్డి తదితరులతో కలిసి కెటిఆర్ మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కన్నెపల్లి పంప్‌హౌజ్ వద్ద నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. ఒక వేళ ప్రభుత్వం స్పందిచకపోతే ఈ విషయంలో బిఆర్‌ఎస్ తరపున ఒక కార్యచరణ తీసుకోనున్నట్టు వెల్లడించారు. కాళేశ్వరంలో మేడిగడ్డతో సంబంధం లేకుండా మొత్తం గోదావరి పరివాహక ప్రాంతంలోని రైతులకు, ప్రజలకు నీళ్లు అందించే అవకాశం ఉన్నప్పటికీ సిఎం తన మూర్ఖత్వంతో తెలివితక్కువతనంతో గత ప్రభుత్వం పైన ద్వేషంతో పంటలను, ప్రజలను ఎండబెడుతున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో వర్షం కూడా పడకపోవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారని, గోదావరి బేసిన్ లో ఉన్న రిజర్వాయర్ల స్టోరేజీ కూడా సగానికి పైగా ఖాళీగా ఉన్నాయన్నారు. మరోవైపు కన్నెపల్లి వద్ద లక్షల క్యూసెక్కుల నీరు కిందికి పారుతుందని, అక్టోబర్ వరకు కూడా సుమారు ఒక లక్ష క్యూసెక్కుల నీరు కిందికి వృధాగా పోయే అవకాశాలు ఉన్నాయని, ఈ నీటిని ప్రతిరోజూ 2 టిఎంసిల చొప్పున వంద రోజుల పాటు ఎత్తిపోస్తే గోదావరి బేసిన్ లోని మిడ్ మానేరు, లోయర్ మానేరు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, అనంతగిరి, మల్కపేట, బస్వపూర్ రిజర్వాయర్లు అన్నీ నిండుతాయని వివరించారు. ఈ విషయాన్ని ఇటీవల తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్లు స్పష్టంగా ముఖ్యమంత్రికి వివరిస్తూ ఒక లేఖ రాశారని కెటిఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తమపైన కోపం, ద్వేషం ఉండవచ్చని, కానీ తెలంగాణ ప్రజలపైన, రైతులపైన అక్కసు పెట్టుకోకుండా కిందికి పారుతున్న నీటిని ఎత్తిపోస్తే అందరికీ మంచి జరుగుతుందని సిఎంకు సూచించారు. ఇప్పటికే అన్నారం, సుందిళ్ల విషయంలో కూడా గ్రౌటింగ్ పూర్తయిందని, అక్కడ సురక్షితంగా నీటిని నిల్వ చేసి వాడుకోవచ్చనే విషయాన్ని ప్రభుత్వంలోని ఇంజనీర్లే స్పష్టం చేస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సొంత ముఖ్యమంత్రి తన రాష్ట్ర ప్రాజెక్టుల గురించి దరిద్రంగా మాట్లాడుతున్నారన్నారు. మేడిగడ్డకు సంబంధమే లేని, ఎక్కడో సుదూరాన ఉన్న భద్రాచలం రాముడితో పాటు 44 ఊర్లు నిండిపోతాయని, మునిగిపోతాయని సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కన్నెపల్లి దగ్గర పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రాజకీయ ద్వేషంతో కళ్ళు మూసుకుపోయిన రేవంత్ రెడ్డికి బుర్ర తక్కువనా? లేదా నీటిని ఎత్తిపోయాలని చెబుత్ను తమకు బుర్ర తక్కువనా అని కెటిఆర్ ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్తే ఉదయం కాంగ్రెస్‌తో, రాత్రి బిజెపితో ఉంటారని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి చేసుకున్న సొంత సర్వేలోనే బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని తేలిందని, దేవునిపైన ప్రమాణం చేసి సర్వే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల గుర్తింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రస్తుత రాజకీయ అనుబంధాలు పక్కనబెట్టి నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని టిజెఎసి నేతలు అమరవీరుల సాక్షిగా ఏకగ్రీవంగా ప్రకటించారు. తమ సూచనలను రాతపూర్వకంగా కమిటీకి అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నిర్వహించిన ముఖాముఖి సంప్రదింపుల సమావేశంలో ఉద్యమ కాలంలో తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చిన టిజెఎసి స్టీరింగ్ కమిటీ సభ్యులు, అనుబంధ జెఎసిల ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పెద్దఎత్తున హాజరై ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు పూర్తి మద్దతు ప్రకటించారు. సమావేశానికి ప్రొఫెసర్ ఎం. కోదండరామ్‌తో పాటు టిజిఓ, టిఎన్‌జిఓ, ఆర్‌టిసి జెఎసి, ఎలక్ట్రిసిటీ జెఎసి, అడ్వకేట్ జెఎసి, డాక్టర్స్ జెఎసి, ఇంజనీర్స్ జెఎసి, ఉపాధ్యాయ సంఘాలు, తెలంగాణ మాల మహానాడు, తెలంగాణ వికాస సమితి ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే ఉద్యమ కాలంలో కలిసి పనిచేసిన టిఆర్‌ఎస్, బిజెపి, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యమకారులకు అధికారిక ప్రశంసా పత్రాలు ఇవ్వాలని, ఇండ్లు లేని నిరుపేద ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల నివాస స్థలాలు కేటాయించాలని, వృద్ధాప్య పెన్షన్లు, ఉచిత కార్పొరేట్ వైద్యం, ప్రత్యేక హెల్త్ కార్డులు, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా లభించిన ఈ ఏకగ్రీవ మద్దతు వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి ఉద్యమకారుడిని పారదర్శకంగా గుర్తించడం సులభమవుతుందని అన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న డిజిటల్ స్క్రీనింగ్ ఆధారంగా తుది నివేదిక సిద్ధం చేసి సిఎం రేవంత్ రెడ్డికి అందజేస్తామని వెల్లడించారు.

# వైభవంగా యాదాద్రి నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

- ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి కొండా సురేఖ, విప్ బీర్ల అయిలయ్య, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి
- దేవస్థాన చైర్మన్‌గా మన్నె సత్యానారాయణరెడ్డి బాధ్యతలు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు పాలక మండలిప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ నూతన కమిటీ బాధ్యతలను స్వీకరించింది. ఈ వేడుకకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ప్రత్యేకంగా విచ్చేసి నూతన పాలక మండలికి తమ శుభాకాంక్షలు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన మన్నె సత్యనారాయణరెడ్డి ఈ సందర్భంగా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. వారితో పాటు నామినేటెడ్ సభ్యులుగా కొణిదెల సురేఖ, జి.వినోద్ వెంకటస్వామి, చిలప్పగారి విజయ రాజం, విజయేందర్ తుల్ల, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కంతమనేని, ఎం.రాఘవేంద్ర రావు, డి.లక్ష్మి నారాయణ నాయక్‌లు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, యాదాద్రి క్షేత్రాన్ని దేశంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. భక్తులకు నాణ్యమైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం నూతన పాలక మండలికి అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యాదాద్రి క్షేత్రం తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక వైభవానికి నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. దేశ విదేశాల నుండి వచ్చే లక్షలాది మంది భక్తులకు మరింత మెరుగైన వసతులు, పారదర్శకమైన పరిపాలన, సత్వర సేవలు అందించేలా నూతన పాలక మండలి సమిష్టిగా, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా భక్తుల క్యూ లైన్లు, తాగునీరు, పరిశుభ్రత, వసతి, అన్నదాన సేవలు, పార్కింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ మహోత్సవంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఈఓ), ఆలయ ప్రధాన అర్చకులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# యువతకు నెహ్రూ,గాంధీ భావజాలమే దిక్సూచి

- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ, ఫాసిస్టు శక్తులను ఎదుర్కొనే చైతన్యాన్ని యువతలో పెంపొందించాలని, నెహ్రూగాంధీ భావజాలాన్ని ప్రతి యువకుడు ఆదర్శంగా తీసుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. యువతకు భారతదేశ ఆలోచన (ఐడియా ఆఫ్ ఇండియా), పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలు, కాంగ్రెస్ సిద్ధాంతాలను విస్తృతంగా చేరవేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జవహర్ బాల్ మంచ్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల 'మిరాయి' జాతీయ శిక్షణ శిబిరాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ బాల్ మంచ్ కార్యకలాపాలకు తన పూర్తి మద్దతు ప్రకటించిన ఆయన, తెలంగాణలో నిర్వహించనున్న తదుపరి జాతీయ బాలల శిబిరానికి కూడా కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జవహర్ బాల్ మంచ్ జాతీయ అధ్యక్షుడు జి.వి. హరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర చైర్మన్ అడ్వకేట్ మామిడి రిషికేశ్ రెడ్డి సమన్వయం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి జాతీయ సమన్వయకర్తలు, రాష్ట్ర చైర్మన్లు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. యువ నాయకుల్లో నాయకత్వ లక్షణాలు, సంస్థాగత నైపుణ్యాలు, సేవాభావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ రెండు రోజుల 'మిరాయి' జాతీయ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# సోషలిజమే శాంతికి పునాది

- సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ శాంతి, సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు సోషలిజమే ప్రత్యామ్నాయమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద శక్తులు యుద్ధాలను ప్రోత్సహిస్తూ, కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశాలపై ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో సోషలిస్టు భావజాలమే ప్రజల మధ్య ఐక్యత, సౌభ్రాతృత్వం, శాంతిని నెలకొల్పగలదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థి, యువజనుల రాజకీయ శిక్షణ తరగతులను బాలచంద్ర కాంగో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి, ప్రజాస్వామ్యం, లౌకికత, సామాజిక న్యాయం, శాస్త్రీయ సోషలిజం విలువలను కాపాడే బాధ్యత యువతపై ఉందన్నారు. ఇందు కోసం శాంతిని కోరుకునే ప్రతి యువకుడు, ప్రతి విద్యార్థి శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతాన్ని అధ్యయనం చేసి ప్రజా ఉద్యమాల్లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారీ విధానం అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, దోపిడీని మరింత పెంచుతోందని, ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకున్న సోషలిస్టు సమాజ నిర్మాణమే దీనికి ప్రత్యామ్నాయమని అభిప్రాయపడ్డారు. యువత సిద్ధాంతాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసే కమ్యూనిస్టు కార్యకర్తలుగా ఎదగాలని సూచించారు. పార్టీ జాతీయ సమితి ఏర్పాటు చేస్తున్న శిక్షణా కార్యక్రమాలలో మార్క్సిజం–లెనినిజం, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి అంశాలపై లోతైన అవగాహన కల్పిస్తాయని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని సిద్ధాంతపరంగా బలమైన నాయకత్వంగా ఎదిగి ప్రజల కోసం నిరంతరం పనిచేయాలని యువతకు ఆయన సూచించారు. దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను యువత మరింత బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో సిపిఐ సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీల్ రాజాంవాలే, ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు రోషన్ కుమార్ సిన్హా, ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, కార్యనిర్వహక అధ్యక్షులు నేర్లకంటి శ్రీకాంత్, ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్య ప్రసాద్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేరాలపై డిజిపి ఉక్కుపాదం

- జిల్లాల క్షేత్రస్థాయి వరుస పర్యటనలు
- క్రైమ్ రివ్యూలతో పోలీసింగ్‌కు కొత్త పదును



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చేందుకు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ప్రతి జిల్లాలో పోలీసు అధికారులతో నేరుగా సమావేశమై క్రైమ్ రివ్యూ నిర్వహిస్తూ, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల ధోరణి, దర్యాప్తు పురోగతి, కోర్టుల్లో కేసుల స్థితిగతులపై సమగ్రంగా సమీక్షిస్తున్నారు. ఇటీవల ఖమ్మం జిల్లా మణుగూరులో నిర్వహించిన క్రైమ్ రివ్యూ సమావేశం ఈ కొత్త కార్యాచరణకు నాంది పలికింది. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇదే తరహా సమీక్షలు జరగనున్నాయి. డిజిపి లక్ష్యం కేవలం నమోదయ్యే నేరాల సంఖ్యను తగ్గించడం మాత్రమే కాదు. నేరం జరిగిన వెంటనే సమర్థవంతమైన దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, వేగంగా చార్జ్‌షీట్లు దాఖలు చేయడం, చివరకు నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడేలా కేసులను పటిష్ఠంగా సిద్ధం చేయడం పైనా ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం పోలీసు శాఖ ముందు సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆర్థిక మోసాలు వంటి కొత్త సవాళ్లు ఉన్నాయి. వీటిని ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాల వినియోగాన్ని పెంచాలని డిజిపి అధికారులకు సూచిస్తున్నారు. క్రైమ్ రివ్యూ సమావేశాల్లో పెండింగ్ కేసులు, హత్యలు, దోపిడీలు, చోరీలు, సైబర్ మోసాలు, మహిళలపై దాడుల కేసులు, పిఓసిఎస్‌ఓ కేసులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, బెయిల్‌పై విడుదలైన నేరస్థులపై నిఘా వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ పనితీరు, కేసుల విచారణలో జాప్యానికి గల కారణాలు, వాటి పరిష్కార మార్గాలపై కూడా సమీక్ష జరుగుతోంది. నిందితులకు శిక్షలు పడే శాతాన్ని పెంచాలంటే దర్యాప్తులో నాణ్యత ఎంతో కీలకమని డిజిపి స్పష్టం చేస్తున్నారు. చిన్నచిన్న సాంకేతిక లోపాల వల్ల కోర్టుల్లో కేసులు బలహీనపడకుండా ప్రతి చార్జ్‌షీట్ పకడ్బందీగా ఉండాలని సూచిస్తున్నారు. విచారణాధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం పెంచాలని ఆదేశిస్తున్నారు.



## పరిశ్రమలను కూల్చివేస్తామంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి పారిశ్రామికవాడలో ప్రభుత్వ అనుమతులతో నిర్మించుకున్న పరిశ్రమలను కూల్చివేస్తామంటూ కొంతమంది ఆక్రమదారులు బెదిరిస్తున్న టిఎస్ఐఐసి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేస్2లో 1989లో ప్రభుత్వం పారిశ్రామిక అవసరాలకు స్థలాలు కేటాయించింది. చాగంటి శశిధర్, శ్రీనివాస్‌లకు 1989లో అప్పటి ఏపిఐఐసి సంస్థ ప్లాట్ నంబర్ 125ఏ, ప్లాట్ నంబర్ 125బి కేటాయించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారిశ్రామిక వాడలోని పరిశ్రమలకు రక్షణగా పరిశ్రమలకు ఆనుకుని ఆరు మీటర్లు గ్రీన్ బెల్ట్ ఏరియా కేటాయిస్తుంది. ఇటీవల కొంతమంది వ్యక్తులు వచ్చి తమ పరిశ్రమ పక్కనే ఉన్న గ్రీన్ బెల్ట్ ఏరియాలోని ప్రహరీ గోడను కూల్చివేశారు. ఈ విషయమై చర్లపల్లి ఐలా అధికారులకు తెలియజేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అదే అదునుగా భావించిన ఆక్రమదారులు ప్రైవేట్ సర్వే చేసుకుని తమకు ప్రభుత్వ కేటాయించిన పరిశ్రమలలో తమ ప్లాట్లు ఉన్నాయని కూల్చివేసి స్వాధీనం చేసుకుంటామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇకనైనా టిఎస్ఐఐసి అధికారులు స్పందించి సర్వే చేయించి తమ స్థలాలను రక్షించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నాం. ఐలా అధికారులు స్పందించకుంటే పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు,సిఎం రేవంత్‌రెడ్డి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ తప్పనిసరి

### డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట మనీకరణ్



**ప్రజాపక్షం/దుండిగల్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026లో భాగంగా ఇంటింటికీ పంపిణీ చేసిన ఓటర్ల ఎన్యుమినేషన్ ఫామ్‌లను సకాలంలో సబ్మిట్ చేయాలని దుండిగల్ డిప్యూటీ కమిషనర్ వెంకట మణికరణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ 2026 ప్రక్రియలో భాగంగా, బూత్ లెవల్ ఆఫీసర్లు ఇప్పటికే ఇంటింటికీ తిరిగి ఓటర్లకు ఎన్యుమినేషన్ ఫామ్‌లను పంపిణీ చేయడం జరిగిందనీ, ఓటర్లు తమకు అందిన ఎన్యుమినేషన్ ఫామ్‌ను నింపి, తదుపరి రెండు మూడు రోజుల్లోనే తమ సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్‌కు అందజేయాలనీ, సరైన వివరాలతో నింపి సమర్పించిన ఎన్యుమినేషన్ ఫామ్‌లు మాత్రమే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో చేర్చబడతాయనీ, గడువులోగా ఫామ్‌లు సమర్పించని వారి పేర్లు జాబితాలో చేర్చబడతాయని దుండిగల్ సర్కిల్ పరిధిలోని ఓటర్లందరూ ఈ ప్రక్రియను బాధ్యతగా స్వీకరించి, తమకు అందిన ఫామ్‌ను త్వరితగతిన తమ ప్రాంతపు బిఎల్ఒలకు అందజేసి, మీ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకట మణికరణ్ తెలిపారు. మీ ప్రాంతపు బిఎల్ఓ వివరాల కోసం లేదా ఏవైనా సందేహాల కోసం అధికారిక వెబ్‌సైట్ (https://voters.eci.gov.in/) ను సందర్శించగలరని తెలిపారు.



## 50మందికి డయాబెటిస్ డిటెక్షన్ కిట్ల పంపిణీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320హెచ్ గ్లోబల్ కాజెస్ విభాగం ఆధ్వర్యంలో కుషాయిగూడ లయన్స్ భవనంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న లయన్స్ క్లబ్‌లకు 50 డయాబిటిస్ డిటెక్షన్ కిట్లు పంపిణీ చేశారు. ప్రతి క్లబ్ తమ పరిధిలో మధుమేహ నిర్ధారణ పరీక్షలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ లయన్ అశోక్‌కుమార్ స్టైన్ హాజరై ప్రసగించారు. ఇందులో గౌరవ అధిథులుగా ఎంజేఎఫ్ ప్రథమ వైస్ జిల్లా గవర్నర్ లయన్ డి లింగారెడ్డి, లయన్ మనోహర్‌రెడ్డి, ఎమ్‌జేఎఫ్ సలహాదారులు, లయన్స్ ట్రస్ట్ హస్పిటల్ చైర్మన్ లయన్ కొత్త రామారావు, ఎన్. దేవి సుష్మ, కొత్తపల్లి రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసి బస్సులు




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం టిఎస్ఆర్టీసీ కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో పూరి, కోల్హాపురి యాత్రలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నామని డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 25న శనివారం ఆరు రోజుల పూరి యాత్రలో అన్నవరం, సింహాచలం, వైజాగ్ అరసవెల్లి శ్రీకూర్మం, కోణార్క్, విజయవాడ ద్వారకా తిరుమల క్షేత్రాల దర్శనం ఉంటుదని, దీనికి గాను ఒక్కొక్కరికి రూ. 6500 చార్జి ఉంటుందన్నారు. ఈ నెల 18న శనివారం మూడు రోజుల కొల్హాపూర్ యాత్రలో గాపూర్, తుల్జాపూర్, కొల్హాపూర్, పండరీపూర్ క్షేత్రాల దర్శనాలకు గాను ప్రతి ఒక్కరికి రూ. 3500 ఉంటుందన్నారు. ఆసక్తి కల ప్రయాణీకులు 9603549388 ద్వారా సంప్రదించవచ్చన్నారు.



## కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని మారుతీ ఎన్‌క్లేవ్‌లోని రోడ్ నంబర్ 1 నుండి 13 వరకు జిహెచ్‌ఎంసి ఫ్రీడమ్ పార్కు నుండి పోచమ్మ దేవాలయం వరకు రోడ్లు,వైష్ణవి ఎన్‌క్లేవ్ అంతర్గత రోడ్లు అభివృద్ధి పనులకు 2.30 కోట్లు మంజూరు కాగా కాలనీవాసులతో కలసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి పనులను పరిశీలించారు.ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని,ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడ ద్వారా రాకపోకలు సులభరం చేయడమే తన సంకల్పమని అన్నారు.అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సంఘటిత పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలి

### ఎఐటియుసి 4వ మహాసభలో వక్తల పిలుపు




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** కార్మికుల హక్కులను కాలరాచే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 4 లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించాలని ఎఐటియుసి 4వ మహాసభలో వక్తలు డిమాండ్ చేసారు. శనివారం యాప్రాల్‌లో జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు స్వామి అధ్యక్షతన ఎఐటియుసి 4వ మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసూఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, రాష్ట్ర ఇన్‌చార్జి బోస్, జిల్లా గౌరవ అధ్యక్షులు రవిచంద్రన్, శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్‌లు పాల్గొన్నారు.






ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకొన్న కార్మిక హక్కులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే లక్ష్యంతో అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులకు తీరని అన్యాయం, నష్టాలు జరుగుతాయన్నారు. కార్మిక హక్కులను నిర్వీర్యం చేసి ప్రశ్నించే వారిని వివిధ రూపాలలో మోడీ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని మార్చివేసి పూర్వపు సనాతన ధర్మం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తూ వారికి సైతం ఇదే కనీస వేతనం చెల్లించాలన్నారు. కార్మికులందరూ సంఘటిత పోరుతో బిజెపి ప్రభుత్వాన్ని కట్టడి చేయటం ద్వారా గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎఐటియుసి శ్రేణులందరూ ప్రజలను చైతన్యం చేయాలని, భవిష్యత్ పోరాటలకు సిద్ధం చేయాలన్నారు. మహాసభ ప్రారంభానికి ముందు యాప్రాల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులర్పించారు. బాబూజినగర్ కమిటీ హాలు వరకు నిర్వహించిన ఎఐటియుసి శ్రేణుల ఎర్రజెండా ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.యాదయ్య గౌడ్, అమరావతి బాబు, లొట్టి ఈశ్వర్, బి.యాదగిరి, ఎస్‌కె అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాతా,శిశు సంక్షేమంపై అవగాహన కల్పిస్తాం

### డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఆనంద్




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఆరోగ్యకరమైన మాతా శిశు సంక్షేమం కోసం గర్భధారణల మధ్య సరైన వ్యవధి ఆవశ్యకత ఎంతైనా ఉందని డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన కుటుంబ వ్యవస్థ ద్వారా కుటుంబాల ఆరోగ్యం, ఆర్థికస్థితి సమపాళ్లలో ఉంటే సమాజాభివృద్ధి మెరుగవుతుందన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా ఈ నెల 18 వరకు జిల్లాలో ఆరోగ్యకరమైన మాతా శిశు సంక్షేమం నేపథ్యంలో అనాలోచిత గర్భధారణలు, సరైన వ్యవధి అంశంపై ప్రాధాన్యత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పెరుగుతున్న జనాభా వనరులపై ఒత్తిడిని పెంచి ఆహారం, తాగు నీరు, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక అవసరాలపై ప్రభావం చూపుతుందని, కుటుంబ నియంత్రణ, గర్భ నిరోధక సాధనాల వినియోగం, మాతా శిశు ఆరోగ్య సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖలో విశిష్ట సేవలందించిన ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లను అందచేసి సత్కరించారు. వైద్యారోగ్య శాఖకు చెందిన వైద్యులు లావణ్య, గీత, శ్రీదేవి, నాగరాజు, పవన్‌రెడ్డి, కౌశిక్, డెమో వసంతరెడ్డి, ఉషారాణి, విజయ్‌కుమార్ , పిహెచ్‌సి, యుపిహెచ్‌సి వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాలు**

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భంగా జిల్లాలో ఆరోగ్య, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు సమన్వయంతో పని చేస్తూ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఆనంద్ సూచించారు. ఒక సంవత్సరం నుండి 19 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు అందచేయనున్నామని తెలిపారు. ఈ మందులను ఒకటి నుండి రెండేళ్ల వయస్సున్న పిల్లలకు అర మాత్రను పొడి చేసి నీటితో ఇవ్వాలని, ఆపై మూడేళ్ల వరకు ఒక పూర్తి మాత్రను పొడి చేసి నీటితో ఇవ్వాలన్నారు.




## జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించాలి

### మహిళా సమాఖ్య సంఘాల సమితి జిల్లా అధ్యక్షురాలు హైమవతి

**ప్రజాపక్షం/ఉప్పల్:** ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని మేడ్చల్ జిల్లా మహిళా సమాఖ్య సంఘాల సమితి జిల్లా అధ్యక్షురాలు హైమవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈసిఐఎల్‌లోని జిల్లా కార్యాలయంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుండి వెలువడుతున్న దుర్వాసన, కాలుష్యం రోజురోజుకి దూర ప్రాంతాలకు సైతం విస్తరిస్తుండటం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్యకు చెందిన గిరిజ, మాధవి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బడా బాబులకు కొమ్ముగాస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

### అరెస్టయిన అఖిలపక్ష నాయకులను పరామర్శించిన ఎంపి ఈటల



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** బడా కాంట్రాక్టర్ల మెప్పు పొందడం కోసమే సామాన్య పేద ప్రజలకు పెను సవాలుగా మారిన డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించడం లేదని, డంపింగ్‌యార్డును ఎత్తివేసి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు జల, వాయు కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జవహర్‌నగర్‌లో అఖిలపక్ష పార్టీల నాయకులు డంపింగ్‌యార్డును ఎత్తివేయాలంటూ పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. దీంతో స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి కొంతమంది నాయకులను శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం బిజెపి నాయకుల ద్వార తెలుసుకున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసి నాయకులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి నుంచి ప్రతిరోజు సుమారు 2 కోట్ల మంది ప్రజలకు సంబంధించిన చెత్త సుమారు 10 వేల మెట్రిక్ టన్నులను జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చెత్త డంపింగ్ యార్డు జవహర్‌నగర్ అని అన్నారు. దీంతో చుట్టు పక్కల ఉన్న జవహర్‌నగర్, బాలాజీ నగర్, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, శామీర్‌పేట ప్రాంతాల్లో సుమారు 30 కిలోమీటర్ల మేర నీటి కాలుష్యంతో పాటు తీవ్ర దుర్వాసన వస్తుందని చెప్పారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం అఖిల పక్ష పార్టీలతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారని, సమస్యను పరిష్కరిస్తానని చెప్పి రెండు నెలలు గడస్తున్నా ఎలాంటి పరిష్కారం చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. పదివేల మెట్రిక్ టన్నుల చెత్తలో సుమారు 3500 మెట్రిక్ టన్నుల చెత్తతోనే విద్యుత్ తయారవుతుందని మిగతా చెత్త వృధాగా పోతుందని ప్రభుత్వం లెక్కలు చెప్పిందన్నారు.

ఈ సమస్య పరిష్కారానికి అఖిల పక్ష నాయకులు, జెఎసి నాయకులు శాంతియుతంగా ధర్నాలు చేస్తుంటే వారిని అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసనలు చేపట్టే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని ఈ హక్కును గతంలో మాజీ సిఎం కెసిఆర్ కాలరాశారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. అరెస్టులు, కేసులు పరిష్కారం కాదని నగరంలో సేకరించిన చెత్తను నాలుగైదు ప్రాంతాల్లో డంప్ చేయాలని సూచించారు.

అరెస్టలతో ఉద్యమాలను ఆపలేరని డంపింగ్ యార్డును ఎత్తివేయడానికి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, అరెస్ట్ అయిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బాల్‌రాజ్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## క్రిస్టియన్ చర్చి ఫాస్టర్‌ను తొలగించాలి

### శ్రీను సుందర్‌రావు

**ప్రజాపక్షం/వికారాబాద్:** 2019 నుండి అడిట్ జరుపకుండా కోట్లాది రూపాయలను దిగమింగేందుకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని రికవరి, ఆడిట్ చేయాలని సూచించారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ని మెథడిస్ట్ క్రిస్టియన్ చర్చి అవరణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ ఆసుపత్రిని తన సొంతఅస్తిగా భావించటం సరికాదని అన్నారు. రోడ్డు ఓవర్ బ్రిడ్జి పనులలో ఇండ్లు కోల్పోయిన వారికి తమ సంస్థకు చెందిన స్థలంలో ఇండ్లు స్థలాలకు తాము ఒప్పుకోమని స్పష్టం చేశారు. మెథడిస్ట్ క్రిస్టియన్ సంస్థకు చెందిన ఆస్తులను సంరక్షించుకోవడటమే తమ ధ్యేయం అని స్పష్టం చేశారు. ఆడిట్ చేసి డబ్బులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రీతం జయశంకర్, చంద్రశేఖర్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు సవరణలో జాప్యం వద్దు

### బిఎల్‌ఒలకు అదనపు కలెక్టర్ హెచ్చరిక



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రకియలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడం బూత్ స్థాయి అధికారుల బాధ్యత అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్, ఘట్‌కేసర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను కీసర రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటరెడ్డితో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఫారా ల స్వీకరణ డిజిటల్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రతి ఒక్కరికీ అవసరమైన సహకారం అందించాలని బూత్ స్థాయి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, సహాయ ఎన్నికల నమోదు అధికారులు బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

### కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/కుల్కచర్ల :** ఎస్ఐఆర్ డిజిటిలైజేషన్ ప్రక్రియను 20లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కుల్కచర్ల మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను కలెక్టర్ అకస్మికంగా తనఖీ చేశారు. మండలంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు స్వీకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను గడువులోపు తప్పనిసరిగా అన్‌లైన్‌లో అప్లోడ్ చేసి డిజిటలైజేషన్ ప్రక్రియనుఎటువంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని అయన సూచించారు.అలాగే ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు వెంటనే తమ సంబంధింత బిఎల్‌ఒలను సంప్రదించి ఫారాలను సమర్పించాలని కోరారు. ఫారాలు సమర్పించన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉన్నందున ,అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసారిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని బిఎల్‌ఒలకు సమార్పించాలని సూచించారు. అనంతరం బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించి హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి చదువుపై ఆరా తీశారు.



## అక్రమ అరెస్టులతో డంపింగ్ యార్డు ఉద్యమాన్ని ఆపలేరు : పోరాట కమిటీ

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** దమ్మాయిగూడ జెఎసి చేపట్టిన చెత్త లారీల బంద్ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేయడం, అర్ధరాత్రి వేళ ప్రజా ఉద్యమకారులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ అక్రమ అరెస్టులను నిరసిస్తూ కీసర సర్కిల్, బాలాజీనగర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ముందు కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డు శాశ్వత తొలగింపునకు పరిష్కారం చూపుతామని గత మే నెలలో సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ గత రెండు నెలలుగా కాలయాపన చేస్తూ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ఒకవైపు శాంతియుతంగా నిరసనలు చేసుకోవచ్చని చెబుతూనే, మరోవైపు అర్ధరాత్రి నాయకులను బలవంతంగా బొల్లారం, అమీర్ పేట, శామీర్ పేట పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి అద్దం పడుతోందన్నారు. రాంకీ నిర్వాహకులు, ప్రభుత్వం కలిసి చుట్టుపక్కల నాలుగు మండలాల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వివిధ పార్టీలు, సంఘాల నాయకులతో పాటు సుమారు 200మందిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి, శాస్త్రవేత్తల సూచనల ప్రకారం యుద్ధప్రాతిపదికన డంపింగ్ యార్డును తరలించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో ఆర్.నర్సింహ్మా గౌడ్, టి.శివన్నారాయణ (సిపిఎం), టి.శంకర్ (సిపిఐ), జయ (పిడిఎమ్), శివబాబు (ఇఫ్టూ), చంద్రన్న ప్రసాద్ (టీయూజేఏసీ) సహా పలువురు వివిధ పార్టీల, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నాయకులు బొల్లారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అరెస్టయిన వారిని పరామర్శించారు.



## పల్లా రాజేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాల సందడి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పోచారం డివిజన్‌లో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు వెంకటేశ్వర ఆలయం వద్ద అన్నదానం, క్రీడా పోటీలు అనాథ పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ, నీలిమ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీవంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా బోయపల్లి కొండల్ రెడ్డి మాట్లాడుతూ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ నీలిమ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బెజ్జంకి హరిప్రసాద్, చింతల రాజశేఖర్, సామల బుచ్చిరెడ్డి, సూర్య యువజన సంఘం సభ్యులు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్ ఏర్పాటు చేయాలి: యువ నాయకుడు మధుకృష్ణ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటి ప్రజలకు అత్యవసర వేళల్లో అందుబాటులో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్మాపూర్ గ్రామ యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మూడుచింతలపల్లి మున్సిపల్ ప్రజలకు ప్రభుత్వ అంబులెన్స్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మధుకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో జగ్గంగూడ జరిగిన ఓ ప్రమాదంలో ఓ యువకుడు అంబులెన్స్ లేక ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యవసర వైద్య సదుపాయం కోసం ఎంసిపల్లి వాసులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రమాదాలు, గుండెపోటు, గర్భిణిలు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ ఆలస్యం వలన ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, దాతలు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి శామీర్‌పేట ఎస్‌హెచ్‌ఓ సహకారంతో మూడుచింతలపల్లికి ఒక అంబులెన్స్‌ను అందించాలని మధుకృష్ణ కోరారు. ప్రభుత్వం 108 లేదా అత్యవసర అంబులెన్స్‌ను మంజూరు చేసి ప్రజలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## యాసిడ్ తాగినా 108 వేగంతో తప్పిన ప్రాణాపాయం



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించి అత్యవసర చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన ఘట్‌కేసర్ సర్కిల్ 6వ డివిజన్ కొండాపూర్ గ్రామంలో జరిగింది. కొండాపూర్‌కు చెందిన పల్లపు మల్లేష్(36) భార్యతో జరిగిన గొడవ కారణంగా మనస్తాపంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో యాసిడ్ తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పొరుగువారు 108కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న కీసర 108 అత్యవసర వైద్య సిబ్బంది చిత్రం రవి వాహన చోదకుడు రవితేజ వెంటనే ఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లోనే ప్రాథమిక చికిత్స అందించి ఆక్సిజన్ ద్రవాలు అందిస్తూ మెరుగైనా వైద్యంకోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## జనాభా నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కండి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** జనాభా నియంత్రణలో ప్రజలందరు భాగస్వాములు అయ్యేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు కోరారు. శనివారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి ఆదేశాల మేరకు హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంఎల్‌హెచ్‌పి వైద్యాధికారి డాక్టర్ ముస్తకిన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జనాభాను నియంత్రించేందుకు ప్రజలందరు కలిసి ముందుకు రావాన్నారు. కాన్పుల మధ్య దూరం తల్లి బిడ్డలకు ఎంతో శ్రేయస్కారమని, అధిక జనాభా అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని వివరించారు.ఆరోగ్య రక్షణ పద్ధతులు పాటించి ఆనందమైన జీవితం సాగించు, ఒక్కరు ముద్దు ఇద్దరు హద్దు, కుటుంబ క్షేమం ఆరోగ్య కేంద్రాలకు లక్ష్యం అని పేర్కొన్నారు. ఆర్థిక స్థోమతను పెంచుకోవడంతోపాటు కుటుంబ వ్యవస్థలను బలోపేతం చేసుకునేందుకు కృషి చేయాలని సూచిచారు. ఉద్యోగాలు, ఆహారం లభించక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా విద్యలో ఎదుగలేన వెనుకబడిపోతున్నారని వివరించారు. పెరుగుతున్న జనాభాను అరికట్టడంతో ప్రజలంత సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కార్తీక్, జగదీశ్వర్, సత్యనారాయణ, దినేష్, సంధ్య, ప్రవీణ, హెల్త్ సూపర్ వైజ ర్ శ్రీరామ, ల్యాబ్ టెక్నిషియన్ అశోక్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలను విధిగా బిఎల్ఒలకు సమర్పించాలి



**ప్రజాపక్షం/కేశంపేట:** ఎన్యూమరేషన్ ఫారాలను విధిగా బిఎల్ఒ, బిఎల్ఎలకు సమర్పించేందుకు ప్రజలందరు కృషి చేయాలని తహాశీల్దార్ రాజేందర్‌రెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో ఎస్ఐఆర్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, సమర్థవంతంగా వినియోగించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరు ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవాలని, అనివార్య కారణాల వల్ల తొలగిపోతే తక్షణమే చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ఓటర్లు ఏమాత్రం నిర్లక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఓటరు జాబితా తప్పులు లేకుండా రూపొంధించేందుకు అర్హులైన ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఎన్యూమరేషన్ ఫారాలను అంధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లెమోని సువర్ణ నరసింహులు, ఉప సర్పంచ్ రమేష్ నాయక్, జీపిఓ విజయలక్ష్మి, అంగన్‌వాడి టీచర్ సుగుణ, చిర్ర శ్రీను, మోటే శ్రీకాంత్, అవ రాఘవేందర్, చిర్ర ప్రభాకర్, శివ, శ్రీరామ్, మంగళి శేఖర్, శంకర్‌నాయక్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## మోకిలా, మోకిలా తండా గ్రామాలలో ‘సర్’ ప్రక్రియ పరిశీలించిన ఎంపిడిఒ



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** శంకర్ పల్లి మండలంలోని మోకిలా, మోకిలా తండా గ్రామాలలో ఎస్ ఐ ఆర్ జరుగుతున్న తీరు పరీక్షించే క్రమంలో ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ శనివారం బిఎల్ఓ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఓటర్లు తమ పేర్లను సర్ ఫారాలలో సక్రమంగా రాయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోకిల సర్పంచ్ శేఖర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌండ్ర సత్యం, మోకిలా పిఎసిఎస్ చైర్మన్ గోపాల్, ఏపీ ఓ నాగభూషణం, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం బాధ్యత



**ప్రజాపక్షం/మియాపూర్ :** పేదల ఆకలితీర్చడం అత్యున్నత సేవ అనే మాటకు హోప్ ఫౌండేషన్ అక్షరాలా రూపం ఇస్తోందని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ అన్నారు. శనివారం చందానగర్ హుడా కా లనీలో హోప్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద 192వ వారం అన్నదానం నిర్వహించడం జరిగిందన్నారు. వేలాది మంది అన్నదార్తులకు రుచికరమైన భోజనం వడ్డించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు, వచ్చినవారందరికి కుల, మత, ప్రాంత వివక్ష లేకుండా భో జనం వడ్డించడం జరుగుతుందన్నారు. ఆకలితో ఉన్న వాడికి అన్నం పెట్టడం మనిషి బాధ్యత అన్నారు. ఆ బాధ్యతను హోప్ ఫౌండేషన్ ద్వారా నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో మూడు నాగుపాము పిల్లలు

పట్టుకుని సురక్షిత ప్రాంతానికి తరలింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఒక్కసారిగా కలకలం రేగింది. స్టేషన్ ప్రాంగణంలోకి మూడు నాగుపాము పిల్లలు ప్రవేశించడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే వారు వన్యప్రాణి సంరక్షణ నిపుణులకు సమాచారం అందించగా, వారు అక్కడికి చేరుకుని ఆ పాము పిల్లలను సురక్షితంగా పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మూడు విషపూరితమైన పాము పిల్లలను గమనించిన సిబ్బంది, సమీపంలోని పొదలు లేదా చిత్తడి నేలల నుంచి ఇవి వచ్చి ఉంటాయని భావించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ‘ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ’ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న నిపుణుల బృందం ఆ మూడు నాగుపాము పిల్లలను చాకచక్యంగా బంధించింది. పట్టుకున్న పాములను నిపుణులు సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు. సకాలంలో స్పందించి పాములను పట్టుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. నగరం వేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఇలాంటి మానవవన్యప్రాణి సంఘర్షణలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో పాములు, ఇతర జీవులు జనావాసాల్లోకి రావడం సాధారణంగా కనిపిస్తోంది.

# ‘మూసీ’ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

ఆ తర్వాతే మూసీని సుందరీకరించాలి ● టిఆర్ఎల్‌డి రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టే ముందు నిర్వాసితులకు పునరావాస కల్పన, నష్టపరిహారం చెల్లించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ (టిఆర్ఎల్‌డి) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మూసీ ప్రాజెక్టు, దానికి సంబంధించిన అంశాలపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. టిఆర్ఎల్‌డి అధ్యక్షులు కపిలవాయి దిలీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపి ఈటల రాజేందర్, ఎంఎల్‌సి తకెళ్లపల్లి రవీందర్, ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. దత్తాత్రేయ మాట్లాడుతూ మూసీ సుందరీకరణ చేపట్టడం మంచి నిర్ణయమన్నారు. మూసీ చుట్టూ ఏర్పడిన ఆక్రమణల తొలగింపులో ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించాలన్నారు. ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, మేధావులతో ఓ కమిటి వేసి వారి సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ మూసీ పునరుజ్జీవనానికి ఎవరూ వ్యతిరేకులు కాదన్నారు. మూసీ బాధితుల సమస్యలకు పరిష్కారం చూపిన తర్వాతే ప్రభుత్వం మూసీ, హైడ్రా అంశాల్లో ముందుకు సాగాలన్నారు. కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ నిర్వాసితుల పునరావాసం, సరైన నష్ట పరిహారం, ప్రజా సంఘాల సందేహాల నివృత్తి అనంతరమే మూసీ ప్రాజెక్టును చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టుకు ప్రజాభిప్రాయ సేకరణ జరపాలన్నారు. మూసీ బాధితులకు సమీపంలో ఇండ్లు కట్టించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి తకెళ్లపల్లి రవీందర్, ట్రైకార్ మాజీ చైర్మన్ బెల్లయ్య నాయక్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి, మాజీ ఎంఎల్‌ఎ వర్ధాల శ్రీరాములు, మాజీ ఎంబిసి చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మన్నారం నాగరాజు, టిఆర్ఎల్‌డి ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

## ముమ్మరంగా హైడ్రా పూడికతీత



● హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో వర్షాల నేపథ్యంలో మురుగు, వరద నీరు సాఫీగా సాగిపోయేలా హైడ్రా ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో ముందుకు సాగుతోంది. నగరవ్యాప్తంగా ఉన్న నాలాలు, వరద కాలువలను పునరుద్ధరించేందుకు గత నెల 22వ తేదీ నుంచి పెద్దఎత్తున పూడికతీత పనులను చేపట్టింది. హైడ్రా మాన్సూన్ రెస్పాన్స్ టీమ్స్‌తో పాటు డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌లు నిరంతరాయంగా క్షేత్రస్థాయిలో శ్రమిస్తుండటంతో, నాలాల నుంచి ట్రక్కుల కొద్దీ పూడిక బయటపడుతోంది. గత 20 రోజుల్లోనే రికార్డు స్థాయిలో మొత్తం 1,570 ట్రక్కుల పూడికను అధికారులు తొలగించారు. గతంలో పూడిక పేరుకుపోయి, మురుగు నీరు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లిన నాలాలు, హైడ్రా ప్రత్యేక చర్యలతో ఇప్పుడు క్లీన్‌గా మారుతున్నాయి. మ్యాన్‌హోల్స్, కల్వర్టుల వద్ద వరద ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను, పూడికను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. దీనివల్ల నగరంలోని అనేక కాలనీల్లో మురుగునీరు ఎక్కడా ఆగకుండా సాఫీగా సాగుతోంది. వర్షం పడినా మురుగునీరు రోడ్లపైకి పోటెత్తే పరిస్థితులు చాలావరకు తగ్గాయని అధికారులు అంటున్నారు.

**కాలువల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు : కమిషనర్ రంగనాథ్**

‘ఇళ్లలో వాడి పారేసే ప్లాస్టిక్, పనికిరాని వస్తువులను వరద, మురుగు కాలువల్లో పడేయడం వల్లే ప్రవాహానికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీనివల్ల వర్షపు నీరు రోడ్లపైకి, కాలనీల్లోకి చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నగర ప్రజలెవరూ నాలాల్లో చెత్త వేయవద్దు. ఇంటింటికీ వచ్చే ‘స్వచ్ఛ ఆటోల’ను మాత్రమే వినియోగించుకోవాలి. లేదా నిర్దేశిత చెత్త కుండిల్లోనే వ్యర్థాలను వేయాలి.’ అని రంగనాథ్ అన్నారు.



# అధిక లాభాల పేరుతో రూ.6.11 కోట్ల చీటింగ్

ఐదుగురిపై కేసు

**ప్రజాపక్షం /హైదరాబాద్:** అధిక లాభాల పేరుతో పెట్టుబడులు పెట్టించి రూ.6.11 కోట్లకు పైగా మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురిపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సిసిఎస్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్మన్‌ఘాట్‌కు చెందిన కాంట్రాక్టర్ నేనావత్ చైతన్య కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉమేష్ నేనావత్, పెండ్లిమడుగు శివ ప్రసాద్ రెడ్డి, అజిత్, దశరథ్ నేనావత్, అరువ శివ కుమార్లపై కేసు నమోదైంది. 5 శాతం నెలవారీ లాభాల హామీతో పెట్టుబడులు పెట్టించుకుని బిచారణ ఎత్తివేశారు. ఫిర్యాదుదారుడి కథనం ప్రకారం.. 2022 లో క్రికెట్ ఆడే సమయంలో పరిచయమైన ఉమేష్ నేనావత్, 2023 ఫిబ్రవరిలో తన వ్యాపారంలో పెట్టుబడి పెడితే నెలకు 5 శాతం లాభం ఇస్తానని హామీ ఇచ్చాడు. మొదట రూ.2 లక్షలు నగదు రూపంలో పెట్టుబడిగా తీసుకుని కొంతకాలం ప్రతి నెలా లాభాల పేరుతో చెల్లింపులు చేసి నమ్మకం కల్పించాడు. తర్వాత మరోసారి రూ.3 లక్షలు పెట్టుబడిగా తీసుకుని వాటిపైనా కొన్ని నెలలు లాభాలు చెల్లించడంతో ఫిర్యాదుదారుడు పూర్తిగా విశ్వసించి మరిన్ని పెట్టుబడులు పెట్టినట్లు పేర్కొన్నారు.

**రూ.6.11 కోట్లకు పైగా బదిలీలు..**

అనంతరం ఉమేష్ నేనావత్ తన స్టాక్ మార్కెట్, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో భారీ లాభాలు వస్తున్నాయని చెబుతూ విడతల వారీగా పెట్టుబడులు పెట్టించాలని ప్రోత్సహించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారుడు తన కెనరా బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు ఖాతాల నుంచి మొత్తం రూ.6,11,93,000ను ఉమేష్ సూచించిన బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు తెలిపారు.

**బంధుమిత్రుల నుంచీ కోట్ల రూపాయల సేకరణ**

ఉమేష్ హామీలను నమ్మి తన స్నేహితులు, బంధువులను కూడా పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించినట్లు ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. వారిలో ఒకరైన ప్రీతమ్ రెడ్డి ఒక్కరే రూ.1.52 కోట్లను తన ఖాతాకు బదిలీ చేయగా, వాటిని ఉమేష్ ఖాతాలకు పంపినట్లు తెలిపారు. ఇదే విధంగా మరికొందరి నుంచి కూడా భారీ మొత్తాలు సేకరించి పెట్టుబడులుగా అందజేసినట్లు ఆరోపించారు.

**నకిలీ ట్రేడింగ్ స్క్రీన్‌షాట్లతో నమ్మకం..**

ఉమేష్ తన వ్యాపార భాగస్వామిగా శివ ప్రసాద్ రెడ్డిని పరిచయం చేశాడని, అతను ఫోన్, వాట్సాప్ ద్వారా వ్యాపారం లాభదాయకంగా నడుస్తోందని చెబుతూ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు సంబంధించిన నకిలీ స్క్రీన్‌షాట్లను పంపించి మరింత పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అజిత్, అరువ శివ కుమార్‌లు కూడా తప్పుడు సమాచారం అందిస్తూ మోసానికి సహకరించారని, ఉమేష్ తండ్రి దశరథ్ నేనావత్ మోసపూరితంగా సేకరించిన నగదును స్వీకరించి కుటుంబానికి అక్రమ లాభం చేకూరేలా వ్యవహరించాడని ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ పి.గోపాల్‌రావు దర్యాప్తు చేపట్టారు.

## పరామర్శించేందుకు వెళ్తున్న బిఆర్ఎస్ నేతలు అరెస్టు



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలంలో హత్యకు గురైన కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న బిఆర్ఎస్ నేతలను శనివారం పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో పాటు నాయకులను మార్గమధ్యంలోనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని శంకర్ పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తు చర్యగా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో తెలంగాణ ఫోక్సో కేసులకు అడ్డగా మారిందని విమర్శించారు. అరెస్టు చేయవలసింది మమ్మల్ని కాదని ఆరుగురుని నిర్దాక్షణంగా హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేయాలని సూచించారు. నేరం జరిగే 55 రోజులైనా ఇంత వరకు పోలీసులు నిందితుని అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. పోలీసులు అంతా రేవంత్ రెడ్డి వారి సోదరులను కాపాడుకోవడంలో బిజీగా ఉన్నారని తెలిపారు. బాధ్యత కుటుంబాలను పరామర్శించి న్యాయం కోసం షాబాద్ పోదామని బయలుదేరితే చేవెళ్లలో పోలీసులు నన్ను, కొడంగల్ మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేసి శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో బంధించారని, మాజీ మంత్రులు సబితా రెడ్డి, సత్యవతి రాథోడ్‌లను కూడా అరెస్టు చేసి ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించారని చెప్పారు. షాబాద్ పోలీసుల అలసత్వం వల్లనే ఈ ఆరు హత్యలు జరిగాయని ఆరోపించారు. బిఆర్ఎస్ నేతలను అరెస్టు చేసి శంకర్ పల్లి పోలీస్ స్టేషన్కు తరలించారని సమాచారం తెలుసుకున్న మండల మండల బిఆర్ఎస్ నేతలు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సంఘీభావం తెలిపారు. మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జి. గోవర్ధన్ రెడ్డి, గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డి.వెంకట్ రెడ్డి. శంకర్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, మాజీ ఎంపిపి డి.గోవర్ధన్ రెడ్డి, శంకర్ పల్లి మాజీ సర్పంచ్ బి.శ్రీధర్, నాయకులు వాసుదేవ్ కన్నా, పలు గ్రామాలకు సర్పంచులు, నాయకులు ఉన్నారు.

## ప్రమాదరహిత విద్యుత్ వ్యవస్థే లక్ష్యం..


భద్రతపై రాజీ లేదు: టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి. పాటిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యుత్ రంగంలో ‘జీరో ఫేటల్ యాక్సిడెంట్స్ – జీరో నీర్ మిస్ ఇన్సిడెంట్స్‘ లక్ష్యంతో ప్రతి ఉద్యోగిలో భద్రతా సంస్కృతి పెంపొందించాలని టిజిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లో శనివారం నిర్వహించిన‘సురక్ష–2026 సేఫ్టీ ఎక్స్‌పో వర్క్‌షాప్‘ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పనుల్లో నిర్లక్ష్యం, అతివిశ్వాసానికి తావు ఉండకూడదని, పని ప్రారంభించే ముందు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడిందో లేదో, రివర్స్ ఫీడింగ్, ఇన్వర్టర్లు, యుపిఎస్‌లు, జనరేటర్ల ద్వారా విద్యుత్ ప్రవాహం లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని సూచించారు. ఉద్యోగుల ప్రాణ భద్రతకు అవసరమైన అన్ని రకాల భద్రతా పరికరాలు, శిక్షణ, ఆధునిక సాంకేతికతను సంస్థ అందిస్తుందని తెలిపారు. సేఫ్టీ ఎక్స్‌పోలో దేశవ్యాప్తంగా 18కు పైగా ప్రముఖ సంస్థలు వ్యక్తిగత భద్రతా పరికరాలు, ఇన్సులేటెడ్ టూల్స్, ఎర్తింగ్ పరికరాలు, ఫాల్ ప్రొటెక్షన్ సిస్టమ్స్, హై వోల్టేజ్ భద్రతా ఉత్పత్తులు తదితర ఆధునిక సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించాయి. కార్యక్రమంలో టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, 21 సర్కిళ్లకు చెందిన చీఫ్ ఇంజినీర్లు, ఫోర్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, ఆర్టిజన్లు తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ కంటే మూసీ సుందరీకరణే ముఖ్యమా?

రూ.7 వేల కోట్ల ఫీజుల బకాయిలు వెంటనే విడుదల చేయాలి: గవర్నర్‌కు బిసి జెఎసి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కంటే మూసీ సుందరీకరణకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఫీజుల బకాయిలు చెల్లించేందుకు నిధులు లేవని చెప్పే ప్రభుత్వం, మూసీ సుందరీకరణ తొలి దశకు రూ.7,345 కోట్లు కేటాయించడం విద్యార్థుల పట్ల వివక్షకు నిదర్శనమని విమర్శించారు. లోక్ భవన్‌లో శనివారం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలోని బిసి ప్రతినిధుల బృందం కలిసి ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై వినతిపత్రం అందజేసింది. ఈ సమావేశంలో పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని, గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.7 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్‌ను కోరారు. అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ 2008లో పేద బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. తమ వినతిపై గవర్నర్ సానుకూలంగా స్పందించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారని, విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గవర్నర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి నేతలు గొడుగు మహేష్ యాదవ్, బి. మనీ మంజరి, జాజుల లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డుకోవడం అత్యంత దుర్మార్గం

బిఆర్ఎస్ శాసనసభాపక్షఉపనేత,మాజీమంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బాధికుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీమంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఆమెతోపాటు మాజీ ఎంఎల్‌ఎ పద్మాదేవేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకుని చేవెళ్ల పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు దారుణ హత్యకు గురయ్యారు. దీంతో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుంటే అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. రాష్ట్రంలో పరిపాలనను గాలికి వదిలేసి,ప్రజప్రాణాలు,భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఈ విషాద ఘటనకు పూర్తి బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఎంఎల్‌ఎ కాలే యాదయ్య రాకతో ఉద్రిక్తత

సర్దిచెప్పే ప్రయత్నం చేసిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో ఆరుగురిని హత్య చేసిన నిందితుడిని అప్పగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. బాధిత కుటుంబ సభ్యులు,గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న స్థానిక ఎంఎల్‌ఎ కాలే యాదయ్యను ఆందోళనకారులు అడ్డుకున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని,బాధితులను ఆదుకోవాలని ఆయనతో వాగ్వాదానికి దిగారు.పోలీసుల వైఖరిని ఖండిస్తూ స్థానికులు నినాదాలు చేశారు.దీంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి షాబాద్ పిఎస్ వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. షాబాద్‌లో బాధితులను కలిసి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సంఘీభావం తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిఐ,ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మృతుల బంధువులు షాద్‌నగర్ నుండి చేవెళ్ల మీదిగా కంది రహదారిపై బైఠాయించడంతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల కొద్ది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు.

## వందకోట్లతో అభివృద్ధిని పరుగు పెట్టిస్తున్న ఘనత కాంగ్రెస్‌దే

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వందకోట్ల నిధులతో అభివృద్ధిని పరుగులు పెట్టించడం జరుగుతుందని, రహదారులు, హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తున్నామని స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండిఎ నుండి సుమారు రూ.100కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. నందిగామ మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారి నుండి నర్సప్పగూడ వరకు డబుల్‌లైన్ బిటి రోడ్డు నిర్మించేందుకు రూ.7.30కోట్లు, మండల కేంద్రంలో తహశీల్దార్ ఆఫీస్ నిర్మించేందుకు రూ.2.25కోట్ల చొప్పున హెచ్ఎండిఎ నిధుల నుండి మంజూరైనట్లు వివరించారు. త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాలు సైతం కొనసాగుతున్నాయని, వాటి విలువ సుమారు రూ.10కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్ నుండి మండల కేంద్రం వరకు డబుల్‌లైన్ బిటి రోడ్డు నిర్మాణానికి రూ.7.50కోట్లు మంజూరు కావడంతోపాటు మండల పరిషత్, ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, గ్రంథాలయ భవనాలకు సైతం నిధులు మంజూరైనట్లు వివరించారు. ఉమ్మడి కొందుర్గు మండలంలో రూ.15కోట్లతో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు.

**ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు బోగస్ ఓట్లు**

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా బోగస్ ఓట్లు మారిపోయాయని, వాటిని నియంత్రించేందుకే ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. స్వచ్ఛమైన ఓటర్ జాబితాలను తయారు చేసేందుకు అధికారులు, పాలకులు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నామని, బోగస్ ఓట్లను పూర్తిగా నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందని వివరించారు. అధికారులు, నాయకులు పూర్తి స్థాయిలో సహకరించి బోగస్ ఓట్లను తొలగించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్పించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీల అధ్యక్షుడు కుమార్ గౌడ్, చంద్రశేఖర్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉప సర్పంచులు అశోక్, శివశంకర్, నేతలు మాణిక్యం, అన్వర్‌లు పాల్గొన్నారు.

## విద్యాజ్యోతి భారత్ మాంటిస్సోరి పాఠశాలలు




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** మహిళా సాధికారత.. పిల్లలకు స్ఫూర్తి అందించేలా గ్రామీణ విద్యాజ్యోతి భారత్ మాంటిస్సోరి పాఠశాలలు తెలంగాణ వ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు ఆల్ ఇండియా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ డైరెక్టర్ షిజు అగస్టిన్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఏఐపీఎస్ఏ ఆధ్వర్యంలో మాంటిస్సోరి పాఠశాలలు తెలంగాణ 'మిషన్ 500 మండలాల ప్రారంభోత్సవం' కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... 'పాఠశాలల రూపాంతరీకరణ' నిరుద్యోగ మహిళలకు సొంతంగా స్టార్ట్ అప్‌కు మూడు లక్షల వరకు ఆర్థిక సాయం అసోసియేషన్ ద్వారా అందిస్తున్నాం. ఉత్తమమైన విద్యను తెలంగాణ వ్యాప్తంగా 500 మండలాల్లో 500 (జీబీజేబీ) అనేక గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నెట్ అవసరం లేకుండానే నాణ్యమైన డిజిటల్ విద్యను అందించే ఒక విద్యా సంస్థని, ఇది శాటిలైట్ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి, మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు సైతం అభ్యసన అవకాశాలను అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథి గౌరవ అధ్యక్షుడు వై.శేఖర్‌రావు, ముఖ్య అతిథులు వి.ప్రభాకర్, ఎస్.యాదగిరి, ప్రధాన కార్యదర్శి, శివరామ్ కృష్ణ, శ్రీనివాస్ పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ఓటరు ప్రక్రియలో పాల్గొనాలి



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న సర్ ప్రక్రియలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు బీరెల్లి మనోజ్ యాదవ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును భద్రపరచుకోవాలనే సంకల్పంతో కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియను నిర్వహిస్తుందన్నారు. మీ ఓటు... మీ హక్కు... మీ భవిష్యత్తు అని, ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా సర్ నమోదు పూర్తి చేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన కోరారు. సర్ ప్రక్రియలో భాగంగా అంబర్‌పేట్ నియోజకవర్గంలోని పటేల్‌నగర్ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సర్ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## యువకుడు అదృశ్యం

**ప్రజాపక్షం/కాచిగూడ:** ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ రాజశేఖర్ కథనం ప్రకారం... నింబోలీఅడ్డకు చెందిన అర్జున్ పాటిల్ (22) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎలాంటి సమాచారం తెలియలేదు. దీంతో ఆయన సోదరుడు అనికేత్ పాటిల్ కాచిగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్



**ప్రజాపక్షం/నల్లకుంట:** సర్ ప్రక్రియలో భాగంగా నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లోని బూత్ నంబర్ 234 పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. హెల్ప్ డెస్క్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి ఎన్యుమరేషన్ ఫాములలో వివరాలు రాయడానికి ఓటర్లకు సహకరిస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెపి మురళీకృష్ణ, తండు లాలయ్య, సన్నిత్ కుమార్ పాల్గొన్నారు.

## ఒకే సంతానం కలిగిన దంపతులకు సన్మానం



**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని ఒకే సంతానం కలిగి తాత్కాలిక పద్ధతులు పాటిస్తున్న దంపతులు ఆలకుంట అనిత, నవీన్‌లకు శనివారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీధర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ సరస్వతి, అడిషనల్ డిఎంహెచ్ఓ( ఎయిడ్స్, లెప్రసి), ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సాయిబాబా, డాక్టర్ శ్రీకాళ, డాక్టర్ ఆశ్రిత రెడ్డి, జిల్లా మాస్‌మీడియా అధికారి జక్కుల రాములు, కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఐ సీతయ్య బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/చార్మినార్:** అత్తాపూర్ సిఐగా ఏరుకొండ సీతయ్య బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన హైద్రాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్, ఫలక్‌నుమా, చిక్కడపల్లి, సైఫాబాద్ తదితర ప్రాంతాలలో ఆయన విధులు నిర్వహించారు.

## సిఎస్‌ను కలిసిన ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** విద్యార్థుల డిమాండ్లను ఆమోదించాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజూను కలిసి ఎంపీ ఆర్.కృష్ణయ్య వినతి పత్రం అందించారు. ఈ మేరకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే ఆమోదించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆ సందర్భంగా ఆయన కోరారు. సిఎస్‌ను కలిసిన వారిలో బీసీ సంఘాల ప్రతినిధులు నీలం వెంకటేష్, జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీష్, అనంతయ్య, రాజేందర్, మోది రాందేవ్, బీంరాజ్, జి.కృష్ణయాదవ్ ఉన్నారు.

# ఇంటికి రక్ష ఇంజెక్షన్ బోర్

ట్యాంకర్లపై ఆధారపడం తగ్గించాలి
నీటి సంరక్షణ ప్రతి అపార్ట్‌మెంట్ బాధ్యత
కురిసిన ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలి
జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** ప్రతి ఇంటికి.. ప్రతి కుటుంబానికి.. ప్రతి అపార్ట్‌మెంట్‌కూ... నీటి కొరత నుంచి రక్షించుకోవాలంటే తప్పనిసరిగా వర్షపు నీటి సంరక్షణను మీ బాధ్యతగా స్వీకరించాలని... జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి క్యూర్ పరిధిలోని ప్రజలను పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గచ్చిబౌలి జేనాపేట్ వీవర్స్‌హిల్స్‌లోని వీవర్స్ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పునర్నిర్మించిన మూడు ఇంకుడు గుంతలను, మరో ఇంకుడు గుంతను డ్రిల్లింగ్ చేసి ఇంజెక్షన్ బోర్‌గా మార్చిన రీచార్జ్ వ్యవస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ... పెరుగుతున్న వినియోగానికి అనుగుణంగా భూగర్భజల అవసరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి బాధ్యతగా స్వీకరించాలన్నారు. వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను కేవలం భవన నిర్మాణ అనుమతులు లేదంటే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందడం కోసమే నామమాత్రంగా ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రతి భవనం పైకప్పుపై కురిసే వర్షపు నీటి ప్రతి చుక్కను అదే ప్రాంగణంలో భూమిలోకి ఇంకేలా శాస్త్రీయంగా రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పిట్లు తప్పనిసరిగా నిర్మించాలని సూచించారు. ప్రభుత్వం, జలమండలి చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే నగరానికి శాశ్వత నీటి భద్రత సాధ్యమవుతుందని ఎండీ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. బోరుబావులను రీఛార్జ్ పిట్లుగా మార్చడం ద్వారా ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితిని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. సక్రమంగా ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థల ద్వారా భూగర్భ జలాలు పునరుద్ధరించవచ్చని, బోర్లలో నీటి లభ్యత మెరుగుపడి కనీసం కొన్ని నెలలపాటు ట్యాంకర్ అవసరం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి సైబరాబాద్ రీజినల్ ఈడీ సంతోష్, డైరెక్టర్ (ఆపరేషన్స్) నారాయణ, జీఎం హరిశంకర్, ఇంకుడుగుంతల ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ, అపార్టుమెంటు అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

## యాప్రాల్ జంక్షన్ ప్రమాదాల చెక్

ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ✲ ట్రాన్స్‌మిషన్ టవర్ తరలింపుపై కసరత్తు
✲ 53 ఆస్తులపై ప్రభావం..✲ టీడీఆర్‌తో భూసేకరణ
✲ ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యాప్రాల్ జంక్షన్‌ను ప్రమాదరహితంగా మార్చేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) చర్యలు వేగవంతం చేసింది. ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టడంతో పాటు తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జంక్షన్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రమాదాలకు కారణమవుతున్న ట్రాన్స్‌మిషన్ టవర్‌ను సమీప పార్కు ప్రాంతానికి తరలించే అవకాశాలపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి శనివారం యాప్రాల్‌లోని చంద్రగిరి కాలనీ, యాప్రాల్ జంక్షన్ ప్రాంతాలను అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు, రాంకీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. జంక్షన్ సమీపంలోని ట్రాన్స్‌మిషన్ టవర్ కారణంగా వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కమిషనర్, ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుతో ట్రాఫిక్‌ను సులభతరం చేయాలని, ట్రాన్స్‌మిషన్ టవర్‌ను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించే ప్రతిపాదనను సాంకేతికంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. టవర్ తరలింపునకు అవసరమైన భూమి లభ్యతను పరిశీలించి, అవసరమైతే ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) విధానంలో భూసేకరణ చేపట్టాలని సూచించారు. జంక్షన్ అభివృద్ధి పనుల నేపథ్యంలో మొత్తం 53 ఆస్తులు ప్రభావితమవుతాయని అధికారులు తెలిపారు. అలాగే 57 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు చెట్లను స్థాన మార్పు చేయాల్సి ఉంటుందని వివరించారు. మొత్తం 6,833.72 చదరపు గజాల భూమి భూసేకరణ పరిధిలోకి వస్తుందని కమిషనర్‌కు నివేదించారు. భూసేకరణ ప్రక్రియను నిబంధనల మేరకు త్వరితగతిన పూర్తి చేసి, అభివృద్ధి పనులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా భద్రతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంలో చీఫ్ సిటీప్లానర్ బి.ప్రదీప్ కుమార్, సిటీప్లానర్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్‌లలో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రజలకు మరింత సులభతరం చేయడంతో పాటు, ఓటర్లకు అవసరమైన మార్గనిర్దేశం అందించేందుకు 60ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండు ప్రత్యేక ఎస్ఐఆర్ సహాయ కేంద్రాలు (హెల్ప్‌డెస్క్‌లను) ఏర్పాటు చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్, బషీర్‌బాగ్ ప్రెస్ క్లబర్‌లో ఈ హెల్ప్‌లైన్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఓటర్లకు పౌర స్నేహపూర్వక సేవలు అందించే లక్ష్యంతో హెల్ప్‌డెస్క్‌లలో తగిన సీటింగ్ సౌకర్యాలు, ఓటరు సహాయ కౌంటర్లు, అవసరమైన దరఖాస్తు ఫారాలు ఏర్పాటు చేశారు. శిక్షణ పొందిన సిబ్బంది ఓటర్ల గణన ఫారాలు నింపడం, ఎస్ఐఆర్ మార్గదర్శకాలపై అవగాహన కల్పించడం, ఓటరు వివరాల ధృవీకరణ, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సందేహాల నివృత్తి వంటి సేవలను అందిస్తున్నారు. అలాగే అవసరమైన పత్రాలు, దరఖాస్తు ఫారాలు సమర్పించే విధానంపై కూడా పౌరులకు సూచనలు ఇస్తున్నారు. ప్రతి అర్హతగల ఓటరుకు ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత అందుబాటులోకి, పారదర్శకంగా, సౌకర్యవంతంగా తీసుకురావడమే ఈ చొరవ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ హెల్ప్‌డెస్క్‌ల ద్వారా సేవల వేగవంతం కావడంతో పాటు, ప్రజల భాగస్వామ్యం పెరిగి, కచ్చితమైన, నవీకరించిన ఓటర్ల జాబితాల రూపకల్పనకు దోహదపడుతుందన్నారు.

## గిరిజన బాలిక మృతిపై విచారణ జరపాలి

బిసి పీపుల్స్ ఫెడరేషన్ డిమాండ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిరిజన మైనర్ బాలిక మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొంతకాలంగా గిరిజన మైనర్ బాలికను కొంతమంది వ్యక్తులు మానసికంగా, శారీరకంగా తీవ్రంగా వేధిస్తూ వచ్చారని ఆరోపించారు. ఈ వేధింపుల తట్టుకోలేకనే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని లేదంటే దీని వెనుక హత్య కోణం ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. బాధిత కుటుంబం తమ బిడ్డను వేధిస్తున్నారని గతంలోనే సైదాబాద్ పోలీసులకు అనేకమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. పోలీసుల వైఫల్యం వల్లే నేడు ఒక గిరిజన బాలిక ప్రాణం పోయిందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్ బాలిక మృతికి కారణమైన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గత 45 రోజులుగా సి ంగరేణి కాలనీలో బీసీ పీపుల్స్ ఫెడరేషన్, వివిధ మహిళా స ంఘాలు, ప్రజా సంఘాలు కలిసి శాంతియుత పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ. కో టి ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఫెడరేషన్ సభ్యులు పుష్ప, ఇందిరా, జీవన్ పాల్గొన్నారు.

## పేర్లు నమోదు చేయించుకోవాలి



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, తమ పేర్లను ఓటర్ జాబితాలో నమోదు చేయించుకోవాలని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సర్ ఓటర్ల సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల స్థాయి నుంచి ఉద్యమం



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.పివి.రవిశేఖర్‌రెడ్డి న్యూ ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా.రవిశేఖర్ రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ, సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ జరిగినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజల సమస్యలు, పెరిగిన ధరలు, నిరుద్యోగ సమస్య తదితర అంశాలతో మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఆందోళనలు చేపట్టాలని.. ప్రజల వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించే అంశాలపై ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున ఖర్గేను డా.రవిశేఖర్‌రెడ్డి సన్మానించారు.

## కెటిఆర్, హరీశ్‌రావువి మతిలేని మాటలు

కాంగ్రెస్ నేత దేవని సతీశ్ మాదిగ



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్ల విషయంలో కెటిఆర్‌కు, హరీశ్‌రావుకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంఆర్‌పిఎస్‌వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి దేవని సతీశ్ మాదిగ విమర్శించారు. శనివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. కన్నెపల్లి హౌజ్ నుండి బాహుబలి మోటర్ల నుంచి అన్నారం ప్రాజెక్టులోకి అక్కడి నుంచి సుందిళ్ల ప్రాజెక్టులోకి నీళ్లు ఎత్తిపోద్దామని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించిందన్నారు. అయితే, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద పునాదులు గట్టిగా లేవని, వాటి కింద నీటి బుడగలు వస్తున్నాయని నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ అథారిటీ అధికారులు చెప్పారని వివరించారు. 2027 నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసుకొని ఈ మూడు బ్యారేజీల దగ్గర నీళ్లు నింపుతామని కాంగ్రెస్ ప్రభుత్వం గంటా బజాయించి చెప్తున్నా కెటిఆర్, హరీశ్‌రావు మతిలేని మాటలు విని విశ్రాంత ఇంజినీర్‌లు ఆవేశానికి లోనుకాకుండా ఆలోచించాలని ఆయన కోరారు.

## ప్రతి కులానికి యూనిక్ కోడ్ తప్పనిసరి

ప్రధాని మోదీకి బిసి సంఘాల నేతల లేఖ



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** జనగణనలోని కులగణన శాస్త్రీయంగా, వృత్తిపరమైనప్రమాణాలతో జరగాలంటే ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించాలని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్, ఆలిండియా బిఎస్‌పి కన్వీనర్ రిటైర్డ్ ఐపిఎస్ పూర్ణచందర్ రావు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలతో సంప్రదింపులు చేసి, సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులను సమగ్రంగా ప్రతిబింబించేలా ప్రశ్నావళి షెడ్యూల్‌ను మార్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'జనగణనలో కులగణన – మళ్లీ మోసపోతున్న బిసిలు'' అనే అంశంపై జరిగిన సమావేశంలో ప్రధాని మోదీకి రాసిన లేఖను వారు విడుదల చేశారు. చిరంజీవులు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు యూనిక్ కోడ్‌ల ఆధారంగా వివరాలు నమోదు చేస్తున్నప్పటికీ మిగతా కులాల విషయంలో ఓపెన్ ఎండెడ్ విధానాన్ని అనుసరించడం సరికాదన్నారు. పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ కులగణనలో కేంద్రం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. బాలగోని బాలరాజుగౌడ్ మాట్లాడుతూ బిజెపి ఎంపిలు ఈ అంశాన్ని పార్లమెంట్ లో లేవనెత్తాలని కోరారు. ఫ్రంట్ కోచైర్మన్ దుర్గయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, ఎర్రమాద వెంకన్న, చెన్న శ్రీకాంత్, సింగం నాగేశ్వర్ గౌడ్, కొండల్ గౌడ్, లింగేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భాషా బోధనలు లేకుండా చేసే కుట్ర

ప్రొఫెసర్ హరగోపాల్ ఆరోపణ



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** డిగ్రీ కళాశాలల్లో భాషా బోధనలు లేకుండా చేసేందుకు ప్రభుత్వం కుట్రపూరిత ప్రయత్నం చేస్తుందని ప్రొఫెసర్ హరగోపాల్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ మేరకు శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లాంగ్వేజ్ టీచర్ ఫోరం ఆధ్వర్యంలో సెమినార్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. యాంత్రిక జీవనంపై ఆధారపడకుండా స్థానిక సంస్కృతి, సాహిత్యంలో పట్టు ఉన్నప్పుడే విలువలతో కూడిన జీవనం ఉంటుందన్నారు. ప్రస్తుతం జీవన విధానంలో మనిషికి మనిషి, బంధుత్వాలు, బంధాలకు విలువ లేకుండా పోతున్నాయని, విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగం కల్పన ధ్యేయంగా విద్యాలయాలు శిక్షణ వైపు మళ్లిస్తున్నారని, భాషా బోధనలను నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధి సుఖవంతమైన జీవితం ఉన్నప్పటికీ, ఆదర్శవంతంగానూ, విలువలు పరంగా మనిషి ఎదగాలంటే భాషాపుగా తప్పనిసరి అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం భాష బోధన ప్రోత్సహించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరంట వెంకన్న, డాక్టర్ నందిని సిద్దారెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, కన్వీనర్ సతీష్, రాజారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంబారీ రూట్‌పై పోలీసుల పరిశీలన



**ప్రజాపక్షం/కార్వాన్:** నల్ల పోచమ్మ, మాతా మహంకాళి బోనాల ఉత్సవాల సందర్భంగా అంబారీ ఊరేగింపుపై పోలీసు ఉన్నతాధికారుల సమీక్షించారు. 104వ బోనాల ఉత్సవాల సందర్భంగా అంబారీపై అమ్మవారి ఘటం ఊరేగింపుపై డిసిపి రాఘవేంద్రరెడ్డి, అదనపు డిసిపి కృష్ణగౌడ్, ఏసిపి తిరుపతి, కుల్సుంపురా సిఐ రాములు, టప్పాచబుత్ర సిఐ బాలకృష్ణ తదితరులు ఊరేగింపు జరిగే ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులను పూజా కమిటీ అధ్యక్షుడు కట్ట లింగం, ప్రధాన కార్యదర్శి అల్లే రామ్‌కుమార్, సలహాదారులు గుడబోయిన శివరత్నం, సేనాపతి చంద్రశేఖర్, కట్ట నర్సింగ్‌రావు, గుడుమని అశోక్ కుమార్, గాండ్ల నిరంజన్‌బాబు తదితరులు శాలువాలుకప్పి సన్మానించారు.

## బిఆర్ఎస్ సమస్యలపై సమరం



**ప్రజాపక్షం/బంజారా-హిల్స్:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమరం చేస్తున్నామని ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని ప్రతాప్‌నగర్‌లో 'సమస్యలపై సమరం' కార్యక్రమంలో భా గంగా పాదయాత్ర చేపట్టి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమయపాలన లేకుండా నిటి సరఫరా, వెలగని వీధి దీపాలు తదితర సమస్యలను ప్రజలు వివరించగా.. వెంటనే ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు గణేష్, ధన్‌రాజ్, రమేష్, రాము, శ్రీకాంత్, విశాల్, వెంకటాచారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాలో అంతరాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులోని లింగంపల్లి నుంచి బంజారాహిల్స్ వరకు ఉన్న 1000 ఎంఎం డయా మెయిన్ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఈ భారీ లీకేజీలను అరికట్టేందుకు అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టారు. దీనికి కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయి. అంతరాయం ఏర్పడే ప్రాంతాలు...ఎర్రగడ్డ, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, వెంగళరావునగర్, ఎల్లారెడ్డిగూడ, సనత్‌నగర్, నిమ్స్, బంజారాహిల్స్, వెంకటగిరి, బీఎస్ మక్తా, ఎంఎస్ మక్తా, సోమాజిగూడ తదితర ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కావున వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు కోరారు.

# విరాళాల చోరీ 'మాయని మచ్చ'

## తీవ్ర అవమానకరం : నృపేంద్ర మిశ్రా




**అయోధ్య :** అయోధ్య ఆలయానికి సంబంధించిన విరాళాల చోరీ ఆరోపణలు తీవ్ర కళంకం అని, దీనివల్ల ప్రతి ఒక్కరూ అవమానభారాన్ని అనుభవిస్తున్నారని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు ఆలయ నిర్వహణ వ్యవస్థను మెరుగుపరుస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రామమందిర నిర్మాణ కమిటీ సమావేశం మొదటి రోజు కోసం మిశ్రా శుక్రవారమే అయోధ్యకు చేరుకున్నారు. 'ఇది (విరాళాల చోరీ ఆరోపణ) చాలా అవమానకరం; దీనివల్ల మేము క్షమాపణ కోరడమే కాకుండా, తీవ్ర అవమానానికి, నిరాశకు గురయ్యాము' అని కమిటీ సమావేశం రెండో రోజుకు ముందు మిశ్రా విలేకరులతో అన్నారు. 'ఇది ఇప్పుడు ఆలయ నిర్వహణకు సంబంధించిన అంశం. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూసేందుకు నిర్వహణ వ్యవస్థను కచ్చితంగా మెరుగుపరుస్తాం' అని ఆయన పేర్కొన్నారు. ఆలయ ట్రస్ట్ సిఇఒ నియామకం కోసం డిమాండ్ చేసిన వారిలో ముందున్న మిశ్రా, తగిన వ్యక్తిని సూచించేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ట్రస్ట్ ఒక మహిళా సిఇఒను నియమించే అవకాశం ఉందనే ఊహాగానాలు ఉన్నప్పటికీ, మిశ్రా దీనిపై ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. సిఇఒ నియామక కమిటీకి ఒక (రిటైర్డ్) న్యాయమూర్తి నేతృత్వం వహిస్తున్న విషయంతెలిసిందే. ఆ కమిటీ తన సిఫార్సులను ట్రస్ట్‌కు సమర్పిస్తుందని, ఆ తర్వాత ట్రస్ట్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామాలను ఆమోదించిన తర్వాత, ఆలయ నిర్వహణ వ్యవస్థను మెరుగుపరిచే చర్యలపై నిర్ణయం తీసుకోవడానికి ట్రస్ట్ ఈనెల 22న మళ్లీ సమావేశం కానుంది. అయితే ఆ సమావేశ ఎజెండా గురించి తనకు ఏమీ తెలియదని మిశ్రా చెప్పారు. శుక్రవారం తాను అయోధ్యలో జరుగుతున్న నిర్మాణ పనులను సమీక్షించానని, స్మారక చిహ్నంగా అభివృద్ధి చేస్తున్న పాత ఆలయ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఇక మిగిలింది 24 గంటలూ వెలిగే జ్యోతి ఏర్పాటు మాత్రమేనన్నారు. ప్రధాన స్మారక నిర్మాణానికి సంబంధించిన పనులు ఈనెల చివరి నాటికి పూర్తవుతుందని భావిస్తున్నామన్నారు. శుక్రవారం జరిగిన కమిటీ సమావేశానికి ఆలయ ట్రస్ట్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ కూడా హాజరయ్యారు. అయోధ్య ఆలయం అద్వితీయమైనది అని అభివర్ణించిన మిశ్రా, ఇది సుదీర్ఘ పోరాట ఫలితమని అన్నారు.

## 2030 నాటికి భారత్-న్యూజిలాండ్ దేశాలు

# వాణిజ్యాన్ని రూ.35,000 కోట్ల రెట్టింపు

### మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆక్లాండ్‌కు చేరుకున్న ప్రధాని మోదీ



**ఆక్లాండ్ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ, న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ మధ్య జరిగిన చర్చల అనంతరం శనివారం భారత్, న్యూజిలాండ్ తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యస్థాయికి ఉన్నతీకరించుకున్నాయి. అలాగే, 2030 నాటికి తమ వార్షిక ద్వైపాక్షిక వస్తు, సేవల వాణిజ్యాన్ని రూ. 35,000 కోట్లకు రెట్టింపు చేసేందుకు ఐదేళ్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. ఈ సమావేశం 10 ఒప్పందాలు సహా 18 నిర్దిష్ట ఫలితాలను అందించింది. వాటిలో రాబోయే నాలుగేళ్లలో సంబంధాలను విస్తరించడానికి ఒక రోడ్ మ్యాప్, ఇండో-పసిఫిక్ సముద్ర సహకారాన్ని పెంపొందించేందుకు ఒక ఫ్రేమ్‌వర్క్, భారత నౌకాదళం, న్యూజిలాండ్ రక్షణ దళం మధ్య పరస్పర లాజిస్టిక్స్ మద్దతు ఒప్పందం ముఖ్యమైనవి. 'మా సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యస్థాయికి పెంచాలని మేం నిర్ణయించుకున్నాం. స్పష్టమైన లక్ష్యాలు, నిర్దిష్టమైన ఫలితాలతో ప్రతీ రంగంలోనూ ముందుకు సాగుతాం' అని చర్చల అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలియజేశారు. మోదీ, లక్సన్ ఇండో-పసిఫిక్‌పై అభిప్రాయాలను పరస్పరం మార్చుకున్నారని, స్వేచ్ఛాయుత, బహిరంగ, సుసంపన్నమైన ప్రాంతం పట్ల తమ ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించారని ఒక సంయుక్త ప్రకటన పేర్కొంది. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, నియమాల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థను పరిరక్షించడం సంబంధిత ప్రాముఖ్యతను కూడా వారు నొక్కిచెప్పారు. అంతర్జాతీయ చట్టానికి ముఖ్యంగా 1982 ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టంపై కన్వెన్షన్‌కు అనుగుణంగా నౌకాయానం, విమానయానం, సముద్రాల ఇతర చట్టబద్ధమైన వినియోగాల కోసం ఇద్దరు ప్రధానమంత్రులు పిలుపునిచ్చారని ఆ ప్రకటన తెలిపింది. ఇండో పసిఫిక్‌లో సహకారాన్ని పెంపొందించడంలో దృష్టి సారించిన నేపథ్యంలో సహకారం, సమన్వయం, సమాచార మార్పిడిని బలోపేతం చేయడానికి, సముద్ర భద్రతా చర్చలను ఏర్పాటు చేయడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో చైనా పెరుగుతున్న దూకుడు నేపథ్యంలో, ఆ ప్రాంతంలో సహకారాన్ని విస్తరించడంపై ప్రధానంగా దృష్టి సారించిన తన మూడు దేశాల పర్యటనలో భాగంగా మోదీ నిన్నరాత్రి ఆక్లాండ్‌కు చేరుకున్నారు. 'ఉక్రెయిన్ విషయంలో కొనసాగుతున్న యుద్ధం అపారమైన బాధలకు, ప్రపంచవ్యాప్త పరిణామాలకు కారణం అవుతోంది' అని మోదీ, లక్సన్ చర్చల సందర్భంగా తమ ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రపంచానికి భారతదేశం ఒక కొత్త అభివృద్ధి నమూనాను అందిస్తోంది : ప్రధాని మోదీ

ప్రపంచ సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారతదేశ అభివృద్ధి వేగం అపూర్వమైనదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం న్యూజిలాండ్‌లో అన్నారు. భారతదేశం ప్రపంచానికి ఒక కొత్త అభివృద్ధి నమూనాను అందిస్తోందని పేర్కొన్నారు. ఆక్లాండ్‌లో 'కియా ఓరా మోదీ' అనే టైటిల్‌తో జరిగిన ఒక భారతీయ కమ్యూనిటీ కార్యక్రమంలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ కూడా పాల్గొన్నారు. భారత్-న్యూజిలాండ్ సంబంధాలు మధురమైన జ్ఞాపకాలు, శాశ్వతమైన స్నేహం, ఉమ్మడి విలువలు, పరస్పర నిబద్ధతపై నిర్మించబడ్డాయని అన్నారు. 'ప్రపంచ సవాళ్ల నడుమ భారతదేశం అభివృద్ధి చెందుతున్న వేగం అపూర్వమైనది. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థ' అని ప్రేక్షకుల హర్షధ్వానాలు, కరతాళ ధ్వనుల మధ్య మోదీ అన్నారు. భారతదేశం ప్రపంచానికి ఒక అభివృద్ధి మార్గాన్ని చూపిస్తోందని మోదీ తెలియజేశారు. అంతరిక్ష రంగమే భారత్-న్యూజిలాండ్ మధ్య ఆర్థిక భాగస్వామ్యానికి ఉన్న సంబంధాన్ని చాటిచెబుతోందని వివరించారు. 2026నాటికి ఇరుదేశాల క్రీడా సహకారానికి 100 సంవత్సరాలు పూర్తి అవుతాయని గుర్తుచేస్తూ, ఇరుదేశాలు తమ సంబంధాలను మరింత పెంపొందించుకోవడానికి ఆసక్తిగా ఉన్నాయని ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు.

# నేనొక సాధారణ పౌరుడిని

## 'ఆధునిక గాంధీ'ని లేదా హీరోని కాదు: సోనమ్ వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ :** తాను కేవలం ఒక 'సాధారణ పౌరుడిని' మాత్రమేనని, 'ఆధునిక గాంధీ'ని లేదా హీరోని కాదు అని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. నాయకత్వం వహించడానికి వేరొకరి కోసం ఎదురుచూడకుండా, ప్రజలు తమ సొంత జీవితాలకు తామే హీరోలుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన శనివారంతో 22వ రోజుకు చేరుకోగా, వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 14వ రోజుకు చేరింది. దీక్ష ప్రారంభించినప్పటి నుండి సోనమ్ బరువు 7.5 కిలోలు తగ్గిందని, రక్తపోటు 106/74 ఎంఎం/హెచ్‌గా నమోదైంది. సిజెపి తెలిపింది. ముందు రోజుతో పోలిస్తే తనలో శక్తి తగ్గినట్లు అనిపిస్తోందని, అయినప్పటికీ ఉద్యమం పట్ల తన నిబద్ధత కొనసాగుతుందని శుక్రవారం రాత్రి సోనమ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూనే, రెండు రకాల వ్యాఖ్యలు తనను నిరాశపరిచాయని వాంగ్‌చుక్ చెప్పారు. 'చాలా మంది నన్ను 21వ శతాబ్దపు గాంధీ లేదా ఆధునిక గాంధీ అని పిలుస్తున్నారు. మరికొందరు నన్ను హీరో అంటున్నారు. ఈ వ్యాఖ్యలు నాకు అసౌకర్యాన్ని కలిగిస్తాయి. నేను గాంధీని కాదు, హీరోని కూడా కాదు. నా బాధ్యతలను నెరవేర్చడానికి ప్రయత్నించిన ఒక సాధారణ పౌరుడిని మాత్రమే' అని ఆయన అన్నారు. హీరోల కోసం వెతకడం మానేసి, పౌరులుగా బాధ్యత తీసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. 'దయచేసి వేరొకరిలో హీరో కోసం వెతకకండి. మీ సొంత జీవితానికి మీరే హీరోగా ఉండండి. ఒక పౌరుడిగా మీ బాధ్యతలను నెరవేర్చండి' అని ఆయన అన్నారు. పరీక్షల అవకతవకల కారణంగా జరిగిన విద్యార్థుల ఆత్మహత్యల గురించి ప్రస్తావిస్తూ, నిష్క్రియంగా ఉండకుండా ఉద్యమంలో పాల్గొనాలని వాంగ్‌చుక్ ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసనకారులు లేవనెత్తిన సమస్యలను ఎంపిలు చేపట్టాలని కోరేందుకు, ఈనెల 20న పార్లమెంటుకు తలపెట్టిన పాదయాత్రలో ప్రజలు పాల్గొనాలని ఆయన తన విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు.

# కుళ్లిన, గడువు తీరిన ఆహార పదార్థాలు

## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు ఎఫ్ఎస్ఎస్ఎఐ నోటీసులు




**న్యూఢిల్లీ:** ప్రముఖ క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫారమ్ 'స్విగ్గీ ఇన్‌స్టామార్ట్' ద్వారా వినియోగదారులకు కుళ్లిన, గడువు ముగిసిన ఆహార పదార్థాలు సరఫరా అవుతున్నాయనే ఫిర్యాదులపై భారత ఆహార భద్రత. ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) తీవ్రంగా స్పందించింది. ఫుడ్ సేఫ్టీ యాక్ట్ 2006 నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు శనివారం (జులై 11న) ఏకంగా తొమ్మిది నోటీసులు జారీ చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు దీనిపై ఇన్‌స్టామార్ట్ ప్రతినిధి స్పందిస్తూ, 'ఎఫ్ఎస్ఎస్ఎఐ గుర్తించిన జాబితాను మేము పరిశీలిస్తున్నాము. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాము' అని తెలిపారు. కాగా, వినియోగదారుల నుండి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ పలు కీలక విషయాలను వెల్లడించింది. శిశువుల ఆహారానికి సంబంధించి, ఒక చిన్నారికి సంబంధించిన ఆహార ఉత్పత్తి అత్యంత పాడైపోయిన, సురక్షితం కాని స్థితిలో సరఫరా అయ్యింది. దానిని వెనక్కి పంపిన తర్వాత కూడా, మళ్లీ అదే ఉత్పత్తిని పంపిణీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అదే విధంగా నిత్యావసరాలలో, కలుషితమైన గుడ్లు, పాలు, దెబ్బతిన్న ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను ఇన్‌స్టామార్ట్ డెలివరీ చేసిందని ఫిర్యాదులు అందాయి. నకిలీ లైసెన్సుల ఫిర్యాదులు కూడా ఉన్నాయి. కొన్ని ఫుడ్ బిజినెస్ సంస్థలు తప్పుడు లేదా నకిలీ లేదా చెల్లని ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ నంబర్లతో నమోదయ్యాయని, మరికొన్ని సంస్థలు తమ అసలు పేర్లకు భిన్నమైన పేర్లతో జాబితాలో ఉన్నాయని అధికారులు గుర్తించారు. వివిధ అంశాల్లో వినియోగదారులు ఫిర్యాదు చేసినప్పటికీ ఇన్‌స్టామార్ట్ నుండి సరైన స్పందన లేదు. ఒక కేసులో ఆహార భద్రత సమస్యను పరిష్కరించకుండా కేవలం రీఫండ్ మాత్రమే ఆఫర్ చేశారు. ఈ నేపథ్యంలో, విక్రేతల ఎంపిక, నాణ్యత పర్యవేక్షణ, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలపై ఎఫ్ఎస్ఎస్ఎఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై పూర్తి వివరణ మరియు నివేదికను సమర్పించాలని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌ను ఆదేశించింది. ఒకవేళ సంతృప్తికరమైన సమాధానం ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆహార భద్రతపై కఠినంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే పలు ఎనర్జీ డ్రింక్స్, ఆల్కహాల్ తయారీ సంస్థలు, ఇతర క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫారాలకు కూడా నోటీసులు జారీ చేసింది.

# విరాళాల చోరీపై మౌనమేల?

## ప్రధాని నరేంద్రమోదీని నిలదీసిన కాంగ్రెస్

**త్రిస్సూర్ :** అయోధ్యలోని రామమందిరానికి ఇచ్చిన విరాళాల చోరీ వ్యవహారాన్ని భారతదేశంలోనే ఒక పుణ్యక్షేత్రానికి సంబంధించి జరిగిన అతిపెద్ద దోపిడీ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఆరోపించారు. ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు.

శనివారం కేరళలోని త్రిస్సూర్ గురువాయూర్ ఆలయం వెలుపల వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశంపై ప్రధాని నుంచి కాంగ్రెస్ సమాధానం కోరుతుందని చెప్పారు. 'మేము ఈ అంశాన్ని దేశవ్యాప్తంగా లేవనెత్తుతున్నాము, ఇకపై కూడా లేవనెత్తుతాము. ఈ దోపిడీ దేశంలోని కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసింది. కానీ ప్రధాని, హోంమంత్రి దీనిపై మౌనంగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్ పోలీసుల ఆధ్వర్యంలో కేవలం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) మాత్రమే ఏర్పాటు చేశారు, దీని వెనుక ఉన్న ఉద్దేశం అసలు దోషులను కాపాడటమే' అని ఆయన ఆరోపించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగే దర్యాప్తు ద్వారానే ఈ దోపిడీ వెనుక ఉన్న అసలు దోషులు బయటపడతారని ఆయన పేర్కొన్నారు. గత 2025 ఏళ్లుగా ఆలయం పేరుతో భక్తుల నుంచి విహెచ్‌పి , ఆర్ఎస్ఎస్ వంటి సంఘ్ పరివార్ సంస్థలు విరాళాలు సేకరించాయని, ఆ డబ్బు, బంగారమే ఇప్పుడు దోపిడీకి గురైందని వేణుగోపాల్ చెప్పారు. ప్రధాని పర్యవేక్షణలో నియమితులైన ఆలయ ట్రస్ట్ నిర్వాహకులకు తెలిసే ఈ పని జరిగిందని ఆయన ఆరోపించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ 'నిజమైన భక్తులు కాదని' కూడా ఆ కాంగ్రెస్ నేత ఆరోపించారు.



'హిందువుల పేరుతో దోచుకోవడం, ఓట్ల కోసం ప్రజలను విభజించడంపైనే వారికి ఆసక్తి ఉంది. ఇది కేవలం దోపిడీ మాత్రమే కాదు, భక్తుల విశ్వాసంపై జరిగిన దాడి' అని ఆయన అన్నారు. 'తమ రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను వాడుకునే' బిజెపి, ఆర్ఎస్ఎస్ లాగా కాకుండా, కాంగ్రెస్‌కు ఇది రాజకీయ అంశం కాదని ఆయన స్పష్టం చేశారు. కేరళలోని బిజెపి ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించిన వేణుగోపాల్, అసలు దోషులను కాపాడాలనే వారి ఉద్దేశాన్ని ఇది సూచిస్తోందని పేర్కొన్నారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలకు సంబంధించి కూడా ఇలాంటి దోపిడీ ఆరోపణలు వస్తున్నాయని ఆయన తెలిపారు.

# శిథిలాల తొలగింపునకు కమిటీ

## నివేదిక సమర్పించేందుకు ముగ్గురు సభ్యులతో ఏర్పాటు చేసిన కేరళ ప్రభుత్వం



**తిరువనంతపురం :** వయనాడ్ టన్నెల్ (సురంగ మార్గం), టౌన్‌షిప్ ప్రాజెక్ట్ ప్రాంతాలను సందర్శించి, అక్కడ కొండచరియలు విరిగిపడటం వల్ల పేరుకుపోయిన శిథిలాలను తొలగించడంపై నివేదిక సమర్పించేందుకు కేరళ ప్రభుత్వం ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈనెల 7న వయనాడ్‌లో సంభవించిన కొండచరియల విరిగిపడే ఘటన జరిగిన ప్రదేశం నుండి ఏడు మృతదేహాలను వెలికితీశారు. ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, శుక్రవారం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్, హోం మంత్రి రమేష్ చెన్నితాల, ప్రజా పనుల శాఖ మంత్రి పి.కె. బషీర్‌లతో జరిగిన సమావేశంలో ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ముగ్గురు సభ్యుల కమిటీలో ఎన్ఐటి కాలికట్ ప్రొఫెసర్ డాక్టర్ సంతోష్ జి. థంపి, పర్యావరణ, వాతావరణ మార్పుల డైరెక్టరేట్ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ జూడ్ ఇమ్మాన్యుయేల్, నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్ (ఎన్‌సిఇఎస్ఎస్) డైరెక్టర్ ప్రతినిధి ఉంటారని ఆ ప్రకటన పేర్కొంది. ఈ మేరకు విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఈ కమిటీ టన్నెల్, వయనాడ్ టౌన్‌షిప్ ప్రాజెక్ట్ ప్రాంతాలను సందర్శించి, ఆయా ప్రదేశాలలో పేరుకుపోయిన శిథిలాలను సురక్షితంగా తొలగించే విషయంలో జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ (డిడిఎంఎ)కి మార్గనిర్దేశం చేస్తుంది.

టన్నెల్ విషయంలో, శిథిలాలను ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి) గుర్తించిన నిర్దేశిత ప్రదేశాలకు తరలించాలి; అలాగే టౌన్‌షిప్ విషయంలో, మట్టిని వేయడానికి తగిన స్థలాన్ని ప్రాజెక్ట్ అమలు విభాగం (పిఐయు) గుర్తిస్తుంది. శిథిలాల తొలగింపు ప్రక్రియలో తగిన భద్రతా చర్యలతో కూడిన ఒక సంక్షిప్త కార్యాచరణ ప్రణాళికను కూడా కమిటీ రూపొందిస్తుందని, దీనిని పిడబ్ల్యుడి, పిఐయు కచ్చితంగా పాటించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలను సందర్శించి, వీలైనంత త్వరగా నివేదికను సమర్పించాలని ప్రభుత్వం కమిటీని ఆదేశించింది. మిటీకి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందించాలని వయనాడ్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు ఆ ప్రకటన తెలిపింది.

## డాన్ బాబా బంగళాలో సోదా

# భారీగా డబ్బు, ఆయుధాల స్వాధీనం

**ముంబై:** మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో తీవ్ర నేరాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి పేరు గడించిన డాన్ 'బాబా ఫర్జాన్' విలాసవంతమైన బంగళాపై పోలీసులు దాడి చేశారు. వివిధ గదుల్లో కుప్పలుతెప్పలుగా పడి ఉన్న నోట్ల కట్టలతో పాటు వివిధ రకాల ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. 1990 దశకంలో అల్లర్లు, దాడులు, హత్యాయత్నం, కిడ్నాప్ వంటి నేరాలతో ఆ ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన డాన్ బాబా ఫర్జాన్ అనారోగ్యంతో ఆరు నెలల కిందట మరణించాడు. కాగా, అతడి నేరాలపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు శనివారం ఉదయం ఆయన బంగ్లాపై దాడి చేశారు. ఆ సమయంలో ఫర్జాన్ రెండో భార్య షీలా గణపత్రావు సాల్వే (52) ఆ ఇంట్లో ఉన్నారు. క్రైమ్ బ్రాంచ్ పోలీసుల సోదాల్లో గదుల్లోని పెట్టెల్లో రూ. 100, రూ. 200, రూ.50, రూ. 20, రూ.10 నోట్ల కట్టలు పెద్ద మొత్తంలో బయటపడ్డాయి. ఐదు కరెన్సీ లెక్కింపు యంత్రాలతో ఆ నగదును లెక్కించారు. లెక్కల్లో చూపని రూ. 5,26,29,560 డబ్బును స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు రూ. 5,50,000 విలువైన ఆయుధాలు కూడా ఆ ఇంట్లో లభించాయి. మ్యాగజైన్లతో కూడిన రెండు పిస్టల్స్, నాలుగు రైఫిల్స్, 12 బోర్ రైఫిల్స్, రెండు ఎయిర్ గన్స్, ఒక .22 ఎంఎం రైఫిల్, ఒక కత్తి, వడు చిన్న కత్తులు, 17 రకాల ఇతర కత్తులు, 21 పదునైన ఆయుధాలు ఉన్నాయి. 12బోర్, 0.22 ఎంఎం రైఫిల్స్, ఒక పిస్టల్, ఒక రివాల్వర్ లైసెన్స్‌లు బాబా ఫర్జాన్ పేరు మీద నమోదైనట్లు ప్రాథమిక విచారణలో తేలింది. రూ.21,34,350 విలువైన బంగారు ఆభరణాలు, రూ. 8,09,248 విలువైన వెండి ఆభరణాలు, రూ.34,836 విలువైన విదేశీ కంపెనీలకు చెందిన 45 మద్యం సీసాలు కూడా ఆ ఇంట్లో లభించాయి. వీటితోపాటు ఆర్థిక పత్రాలు, బ్యాంక్ ఖాతాలు, బినామీ ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

# ఎర్ర కోటకు బాంబు బెదిరింపు

## భద్రత కట్టుదిట్టం: తనిఖీలు ముమ్మరం
## ఆకతాయి పనే: ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ బాంబు బెదిరింపుతో ఉలిక్కిపడింది. చరిత్రాత్మక కట్టడమైన ఎర్ర కోటను పేల్చేస్తామంటూ బాంబు బెదిరింపు రావడంతో దిల్లీ పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎర్ర కోటను భద్రతా వలయంగా మార్చివేసింది. రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టింది. అయితే అనుమానస్పద వస్తువులు ఏమీ లభించకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ముంబై పోలీసు కంట్రోల్ రూమ్‌కు బాంబు బెదిరింపు ఫోన్ వచ్చిందని, వారు దానిని దిల్లీ పోలీసు కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేశారని అధికార వర్గాలు వెల్లడించాయి. ముమ్మర తనిఖీల అనంతరం ఎక్కడ ఏమీ అనుమానస్పద వస్తువులు లేకపోవడంతో ఇది ఉత్తుత్తి బెదిరింపుగా అధికారులు నిర్ధారణకు వచ్చారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవం దృష్ట్యా ఇప్పటికే ఢిల్లీ పహారా నీడలో ఉన్నది. 'బాంబు బెదిరింపు రావడంతో ప్రోటోకాల్ ప్రకారం బాంబ్ స్క్వాడ్ వచ్చింది. యాంటీ సాబటేగ్ తనిఖీలు నిర్వహించింది. అణువణువు గాలించింది. ఎర్ర కోట పరిసరాలన్నీ తనిఖీ చేసింది. ఎక్కడ ఏమీ లభించకపోవడంతో ఇది ఉత్తుత్తి బెదిరింపుగా నిర్ధారించాం' అని సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. అయితే ఆ ఫోన్ ఎవరు, ఎందుకు చేశారనే కోణంలో విచారణ జరుగుతున్నదని, త్వరలోనే ఆ వ్యక్తిని పట్టుకుంటామని ఆయనన్నారు.

# అనిల్ అంబానీ రూ.వెయ్యి కోట్ల ఆస్తులు అటాచ్

**న్యూఢిల్లీ:** రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపుపై మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా రూ.1,021 కోట్లు విలువ చేసే ఆస్తులను అటాచ్ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం ఉత్తర్వులు జారీచేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధ్వర్యంలోని రిలయన్స్ పవర్ ఈక్విటీ షేర్లతో పాటు రిలయన్స్ పవర్, ససన్ పవన్ రుణ మొత్తంలో కొంత భాగాన్ని మనీలాండరింగ్ కేసులో అటాచ్ చేసేందుకు మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. రిలయన్స్ హోం ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్)పై సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఆర్‌హెచ్ఎఫ్ఎల్, ఆర్‌సీఎఫ్ఎల్ సేకరించిన రూ.15,548 కోట్ల నిధులు దారిమళ్లిన వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎనిమిది మందిపై నాలుగు చార్జిషీట్లు... మనీలాండరింగ్, ఫెమా కేసులో దర్యాప్తు కొనసాగిస్తోంది. తాజా ఉత్తర్వులతో ఇప్పటివరకు మొత్తం రూ.20,367 కోట్ల విలువ చేసే ఆస్తులను అటాచ్ చేసింది. అదనంగా రూ.77.86 కోట్ల విలువైన ఆస్తులను ఫెమా కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది.

# బిజెపి నేతకు దక్కని ఎమ్మెల్యే టికెట్.. దాటియాలో చెలరేగిన అల్లర్లు..



**ఇండోర్ :** మధ్యప్రదేశ్‌లోని దాటియా అసెంబ్లీ పరిధిలో అల్లర్లు చెలరేగాయి. దాటియా ఉపఎన్నికకు తమ పార్టీ అభ్యర్థిగా అశుతోష్ తివారిని బిజెపి అధిష్ఠానం ప్రకటించడంతో వివాదం మొదలైంది. మాజీ హోంమంత్రి నరోత్తం మిశ్రాకు టికెట్ దక్కకపోవడంతో ఆయన అనుచరులు శుక్ర, శనివారాల్లో భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. సుమారు 3 వేల మందికి పైగా కార్యకర్తలు జాతీయ రహదారి (ఎన్‌హెచ్44)పై బైఠాయించారు. దాదాపు 12 గంటల పాటు రహదారిని దిగ్బంధించి నిరసన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో శనివారం ఎస్‌పి సహా పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. అయితే, పోలీసులపై నిరసనకారులు రాళ్ల దాడికి దిగారు. ఈ దాడిలో జిల్లా ఎస్‌పి, ఇతర ఉన్నతాధికారులు సహా పలువురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. అలాగే, పోలీసు వాహనాలతో పాటు ఇతర వాహనాలనూ ఆందోళనకారులు ధ్వంసం చేశారు. దీంతో టియర్ గ్యాస్ ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. 2023 మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో దాటియా నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా అప్పటి రాష్ట్ర హోంమంత్రి నరోత్తం మిశ్రా పోటీ చేశారు. కాంగ్రెస్ తరఫున రాజేంద్ర భారతి బరిలో దిగారు. రాజేంద్ర భారతి చేతిలో 7,500కు పైగా ఓట్ల తేడాతో మిశ్రా ఓటమి పాలయ్యారు. అయితే, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓ కేసులో రాజేంద్ర భారతికి ఢిల్లీ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో ఆయన ఎమ్మెల్యే పదవికి అనర్హుడయ్యారు. ఈ మేరకు దాటియా స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఉపఎన్నికలో తనకే మరోసారి అవకాశం వస్తుందని నరోత్తం మిశ్రా భావించారు. ఇప్పటికే నామినేషన్ పత్రం కూడా సిద్ధం చేసుకున్నారు. అయితే, బిజెపి అధిష్ఠానం మాత్రం అనూహ్యంగా శుక్రవారం నాడు అశుతోష్ తివారిని అభ్యర్థిగా ప్రకటించింది. అధిష్ఠానం నిర్ణయం మిశ్రా అనుచరులను తీవ్ర ఆగ్రహానికి గురి చేసింది. దీంతో ఆయన మద్దతుదారులు, వేలాది మంది కార్యకర్తలు ఎన్‌హెచ్44పై బైఠాయించి రాకపోకలను అడ్డుకున్నారు. పోలీసులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆందోళన విరమించకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా, ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం దాటియాతో పాటు బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లోని మరో రెండు అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. దాటియా అసెంబ్లీ స్థానానికి జులై 30న పోలింగ్, ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. బిజెపి అభ్యర్థి ఎంపిక చుట్టూ నెలకొన్న వివాదం ఉపఎన్నిక ప్రచారాన్ని మరింత ఉత్కంఠ భరితంగా మార్చింది.

## రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయంలో...

# నా సహనాన్ని బలహీనతగా భావించొద్దు

- కేంద్రాన్ని ఘాటుగా హెచ్చరించిన జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా
- 20న ఢిల్లీలో 'ఎన్‌సి' నిరసనకు మద్దతు ఇవ్వాలని రాజకీయపార్టీలను కోరిన ఒమర్

**శ్రీనగర్ :** రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయంలో తన సహనాన్ని బలహీనతగా పొరపాటు పడొద్దని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం కేంద్రాన్ని హెచ్చరించారు. అలాగే 'తగిన సమయం' అనే నిర్వచనాన్ని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒమర్ అబ్దుల్లా తన గ్రాండ్‌మదర్ అక్బర్ జహాన్ రెండవ వర్ధంతి సందర్భంగా హజ్రత్‌బల్‌లోని తన తాతల సమాధి వద్ద జరిగిన ఒక భారీ కార్మికుల సదస్సులో ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'లడఖ్ ప్రజలతో చర్చలకు కేంద్రం సిద్ధంగా ఉన్నప్పుడు జమ్ముకశ్మీర్ ప్రజలతో ఎందుకు సిద్ధంగా ఉండదు' అని ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. తన గ్రాండ్ మదర్‌కు నివాళులు అర్పిస్తూ, తాను ఆమె నుంచి చాలా నేర్చుకున్నానని, కానీ సహనం కలిగి ఉండటమే అతి పెద్ద పొరమని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. 'ఆమె చూపినట్లుగా మనం సహనం పాటించాలి. కానీ సహనం అనేది బలహీనతకు మార్గం కాదు. సహనం అంటే మౌనానికి మార్గం కాదు' అని సిఎం నిర్వేదం వ్యక్తం చేశారు. హక్కుల కోసం గళం విప్పకూడదని దీని అర్థం కాదని, మా సహనాన్ని మీరు దుర్వినియోగం చేస్తారని, మమ్మల్ని బలహీనులుగా భావిస్తారని దీని అర్థంకాదని, ఈ సహనమే మా బలం, గళమని, దైవ సంకల్పం ఉంటే ఈ సహనమే మా విజయం అవుతుందని దాల్ సరస్సు వైపు చూస్తూ సదస్సును ఉద్దేశించి అబ్దుల్లా అన్నారు. ఒకటిన్నర సంవత్సారాలకు పైగా అధికారంలో ఉన్న తర్వాత కూడా జమ్ముకశ్మీర్‌లోని అధికార పార్టీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని ఎందుకు ఆలోచిస్తుందో కేంద్రం ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన ఘాటైన స్వరాన్ని వినిపించారు.



తాను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత కేంద్రం తన హామీలను నెరవేర్చడానికి కొంత సమయం కావాలని కోరుకున్నానని అబ్దుల్లా తెలియజేస్తూ, వాస్తవానికి వారు పరిస్థితిని ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నారని చెప్పారు. 'తన పార్టీ అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించడమే జమ్ముకశ్మీర్ ప్రజలకు శిక్షగా మారిందా అని ప్రశ్నించారు. పభుత్వాన్ని పనిచేయనివ్వనప్పుడు మమ్మల్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అనుమతించకుండా ఉండాల్సింది. అందువల్ల ప్రయోజనం ఏమిటి? అటువంటప్పుడు మీరు ఎన్నికలు నిర్వహించకుండా ఉండాల్సింది' అని ఆయన కేంద్రపై నిప్పులు చెరిగారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారాజమ్ముకశ్మీర్ ప్రభుత్వాన్ని నియంత్రించాలని చూస్తోంది అని ఆరోపిస్తూ 'మీరు రాజ్‌భవన్ ద్వారా ప్రజలను వేధించి, ఉద్యోగులను తొలగించి బుల్డోజర్లు నడిపినప్పుడు మమ్మల్ని ఎందుకు తీసుకొచ్చారు ?' అని ముఖ్యమంత్రి అబ్దుల్లా కేంద్రాన్ని ప్రశ్నించారు. 'జమ్ముకశ్మీర్ ప్రజల కోసం ఏదైనా సాధించాలనే తపనతో మేము ఇప్పటికీ గాడిదల్లా కష్టపడుతున్నామంటే అది ప్రజలకోసమే' అని ముఖ్యమంత్రి తన స్వరాన్ని పెంచారు. దేశవ్యాప్తంగా ఒకే రాజ్యాంగం ఉండాలనే ఉద్దేశంతో ఆర్టికల్ 370ను రద్దు చేశారు. అయితే ఇప్పుడు లడఖ్‌కు ప్రత్యేక రాయితీలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం జులై 20న జంతర్‌మంతర్ వద్ద పార్టీ తలపెట్టిన నిరసనను ప్రస్తావిస్తూ, ఢిల్లీలో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) నిరసనకు మద్దతు ఇవ్వాలని అబ్దుల్లా రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

# తండ్రి హత్యకు ప్రతీకారం: మొజ్తాబా ప్రతిజ్ఞ



**టెహ్రాన్:** తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని అమరుడైన ఇస్లామిక్ విప్లవనాయకుడు అలీ ఖమేనీ కుమారుడు–ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు ఆయన ఒక లిఖిత పూర్వక సందేశం విడుదల చేశారు. తన తండ్రి–పూర్వ దేశనేతలను హత్య చేసిన శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తాబా పేర్కొన్నారు. గురువారం సాయంత్రం (జులై 09) ఖమేనీ అంత్యక్రియలు ముగిసిన తర్వాత శనివారం ఈ ప్రకటన విడుదలైంది. "ప్రతీకారం తీర్చుకోవడం జాతి అవశ్యకత, అది తప్పకుండా జరిగితీరాలి" అని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ చేసిన సంయుక్త దాడుల్లో అలీ ఖమేనీతోపాటు మొజ్తాబా ఖమేనీ తల్లి కూడా మరణించారు. ఈ దాడుల సమయంలో అక్కడే నిద్రిస్తున్న అలీ ఖమేనీ కుమార్తె, అల్లుడు,మనుమరాలు, ఇతర ప్రముఖులు, మతనాయకులు మరణించారు. మొజ్తాబా ఖమేనీ మాత్రం కొద్దిదూరంలో ఉన్న గదిలో ఉండటంవల్ల తీవ్రమైన గాయాలతో ప్రాణాలు నిలబెట్టుకున్నారు. అప్పటి నుండి ఆయన రహస్య ప్రదేశంలో చికిత్స పొందుతున్నారు. జులై 7,8,9 తేదీలో జరిగిన అంతిమయాత్ర,అంత్యక్రియల కార్యక్రమాలలో మొజ్తాబా ఖమేనీ ఎక్కడా కనిపించలేదు. కానీ మరో ముగ్గురు కుమారులు ముందువరుసలో నిలబడి ఆయన పార్థివదేహం వద్ద ప్రార్థనలు నిర్వహించారు.

తండ్రి మరణించిన కొద్ది రోజులకే దేశ సర్వోన్నత నాయకుడుగా బాధ్యతలు చేపట్టిన మొజ్తాబా ఖమేనీ, అస్సలు నాయకుడుగా పనికిరాడని విమర్శించిన ట్రంప్ ఆ తర్వాత ఇరాన్ పాలకులపై ప్రశంసలు కురిపించడం ప్రారంభించారు. ప్రస్తుత ఇరాన్ పాలకులు గత పాలకులకంటే భిన్నమైనవారని పేర్కొన్నారు. మొజ్తాబా ఇప్పటివరకూ బాహ్య ప్రపంచానికి కనిపించలేదు. అప్పుడప్పుడు లిఖిత పూర్వక సందేశాలు విడుదల చేస్తున్నారు. ఐఆర్‌జిసి నాయకుడుగా యుద్ధాన్ని భిన్నమైన తరహాలో నడిపిస్తున్నారని మొజ్తాబా ప్రశంసలు అందుకున్నారు. భద్రతా కారణాల రీత్యా ఆయన తండ్రి అంత్యక్రియలకు హాజరు కాలేదు. ఇరాన్ ప్రజలు ఖమేనీ నాయకత్వంపట్ల సంపూర్ణ గౌరవం,చిత్తశుద్ధి ప్రకటించి నివాళులు అర్పించిన తర్వాత ప్రతీకారం తీర్చుకోవడం జాతి అవశ్యకతగా పేర్కొంటూ మొజ్తాబా లిఖిత ప్రకటన చేశారు. ఆయన నాయకత్వాన్ని కొట్టిపారేయలేమని, గతానుభవాలతో రాటుదేలి భిన్నమైన రాజకీయ నేతగా మొజ్తాబా అవతరిస్తున్నారని విశ్లేషకులు పేర్కొన్నారు.

### ఇజ్రాయెల్‌ను వదిలిపెట్టం: ఐఎస్ఎన్‌సి

భవిష్యత్తులో ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటామని వదిలిపెట్టేదిలేదని ఇరాన్ సుప్రీం నేషనల్ కౌన్సిల్ కార్యదర్శి మొహ్మద్ బఘేర్ జోల్ఘదర్ హెచ్చరించారు. అమెరికా తమపై దాడులు చేస్తోందని, రోజూ హెచ్చరికలు చేస్తోందని, దీనికి ప్రతీకారంగా భవిష్యత్తులో చేపట్టబోయే దాడులలో ఇజ్రాయెల్‌ను కూడా లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించారు. ఇరాన్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని ధ్వంసంచేసే ప్రతి దాడికీ ఎదురుదాడులు ఉంటాయని చెప్పారు. ఈ దురాక్రమణ చర్యలు, నేరాలకు బాధ్యతగా ఉన్న జియోనిస్టు పాలకుల పై తమ యోధుల నుండి ఎదురయ్యే ప్రతిస్పందన నుండి వారు తప్పించుకోలేరని హెచ్చరించారు. ఇస్లామాబాద్ ఒప్పందం పూర్తిగా విచ్ఛిన్నమవుతున్న పరిస్థితులు కనపిస్తున్న తరుణంలో ఏప్రిల్‌లో ఆగిపోయిన యుద్ధంలోకి మళ్ళీ రెండు దేశాలు వెళ్ళే ప్రమాదానికి ఆయన ప్రకటన ఒక సూచనగా కనిపిస్తోంది.

### నన్ను హత్య చేస్తే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తాం

# ప్రపంచవ్యాప్తంగా 1000 క్షిపణులు గురిపెట్టి ఉంచాం

**ఖమేనీ అంత్యక్రియల్లో నినాదాలపై ట్రంప్ తీవ్ర హెచ్చరిక**

**హోర్ముజ్‌లో దాడులు చేయబోమని లిఖిత హామీ ఇవ్వాలని డిమాండ్**

**వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి ఇరాన్‌పై 1000 క్షిపణులు గురిపెట్టి ఉంచామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్ ఇస్లామిక్ విప్లవయోధుడు,అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన అలీ ఖమేనీకి ఆరు రోజులపాటు జరిగిన అంత్యక్రియల ప్రక్రియలో లక్షలమంది ప్రజలు "ట్రంప్‌ను హతమారుస్తాం, ట్రంప్‌కు ఉరిశిక్ష విధించాలి" అంటూ నినాదాలు చేయడం, బ్యానర్లు ప్రదర్శించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "పదవిలో ఉన్న అధ్యక్షుడినైన నన్ను హత్య చేయడానికి ప్రయత్నం చేసినా, లేక ఆ ప్రయత్నంలో విజయం సాధించినాగానీ ఇరాన్‌ను సమూలంగా నాశనం చేస్తాం, ప్రపంచంలో అనేక ప్రాంతాల నుండి 1000 క్షిపణులను ఇరాన్‌పై గురిపెట్టి ఉంచాం, ఈ క్షిపణులు ఎప్పుడైనా బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నాయి, మరిన్ని క్షిపణులను వేలాదిగా ఇరాన్‌పై ప్రయోగిస్తాం,ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం" అని తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టింగ్ రాశారు. ఏడాదికాలంపాటు అమెరికా సైన్యం అక్కడే ఉండి సమర్థవంతంగా ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను సర్వనాశనం చేయడానికి, తమ సమర్థతను ప్రకటించడానికి సిద్ధంగా ఉంది" అని రాశారు. ఈ పరస్థితుల్లో ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యుల పార్థివ దేహాలకు అంత్యక్రియలు ముగిసిన మళ్ళీ కొత్త వివాదం ప్రారంభమైంది. హోర్ముజ్ జలసంధిలో శత్రుపూరిత చర్యలకు పాల్పడితే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధిలో చమురు ట్యాంకర్లపై మరోసారి దాడులు చేయబోమని ఇరాన్ లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఖమేనీ అంతిమయాత్రలో ప్రజలు ఆవేదనతో చేసిన నినాదాలు, ప్రదర్శించిన బ్యానర్లపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. జులై నాలుగోతేదీ నుండి తొమ్మిదో తేదీవరకూ ఇరాన్–ఇరాక్ దేశాలలోని పలు నగరాల్లో ఖమేనీ అంతిమయాత్ర ర్యాలీలు జరిగాయి. ఈ ప్రదర్శనలలో లక్షలమంది ప్రజలు తీవ్ర భావోద్వేగాలు ప్రదర్శించారు. అంతిమయాత్ర మార్గంలోని ప్రధాన రహదారుల్లో పలు భవంతులపై "కిల్ ట్రంప్..." అనే పెద్ద పెద్ద బ్యానర్లను వేలాడదీసి ఉంచారు. ఖమేనీకి ప్రజలు అంతిమ నివాళులు అర్పిస్తూనే నెతన్యాహూ–ట్రంప్‌లపై ప్రతీకారం తీర్చుకోవాలనే నినాదాలు ప్రపంచవ్యాప్తంగా మీడియాలో పతాకశీర్షికల్లో నిలిచాయి. ఒకవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ఇజ్రాయెల్ లోని ఒక వైమానిక స్థావరం నుండి అమెరికా తన అత్యాధునిక స్టెల్త్ ఫైటర్ జెట్‌ను ఉపసంహరించుకుందని ఇజ్రాయెల్ పత్రిక పేర్కొంది.కనీసం పది ఎఫ్–22 స్టెల్త్ ఫైటర్లు అమెరికా దిశగా ప్రయాణిస్తూ బ్రిటన్‌లోని ఆర్ఎఎఫ్ ఫెయిర్‌ఫోర్డ్‌లో దిగినట్లు సోషల్ మీడియా వీడియో దృశ్యాలు కనిపించాయి.



ట్రంప్ నిర్ణయాన్ని ప్రభావితం చేసేందుకే ఇజ్రాయెలీ ఇంటెలిజెన్స్ హెచ్చరిక

ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ కుట్రలు చేస్తోందని ఇజ్రాయెలీ ఇంటిలిజెన్స్ ఒక నివేదిక ఇచ్చిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ వార్త ప్రచురించింది. ఈ వారంలోనే ఈ సమాచారాన్ని అమెరికా అధికారులకు ఇజ్రాయెల్ ఇంటిలిజెన్స్ చేరవేసిందని పేర్కొంది. ఇలాంటి విషయాలతో సంబంధం ఉన్న ఇద్దరు అధికారులను ఉటంకిస్తూ సిఎన్ఎన్ శనివారంనాడు ఈ నివేదికపై మరింత ధృవీకరణ ఇచ్చింది. ఈ నివేదిక వెలువడిన కొద్ది గంటలకు ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ద్వారా ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చినట్లు సిఎన్ఎన్ శనివారం ప్రకటించింది.ట్రంప్ ఆదేశాల మేరకు 2020లో ఇరాన్ అగ్రశ్రేణి సైనిక జనరల్ ఖాసెమ్ సులేమానీపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో ఆయన హత్యకు గురయ్యారు. దీనికి ప్రతీకారంగా ట్రంప్‌పై హత్యాప్రయత్నాలు జరుగుతాయని అమెరికా ప్రభుత్వం చాలాకాలంగా హెచ్చరికల మధ్య ఉంది. అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు.

ఇరాన్‌పై దాడులు ఉధృతం చేయాలా? వద్దా? అని ట్రంప్ సందిగ్ధంలో ఉన్న సమయంలో ఆయన నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నమే ఈ నివేదిక అయి ఉండవచ్చునని ఇతర అమెరికన్ అధికారులు తమ తాజా సమాచారంలో పేర్కొన్నారు. ట్రంప్‌ను హత్య చేసేందుకు సాధ్యమయ్యే ప్రణాళికల గురించి గడచిన కొన్ని వారాలుగా అమెరికా నిఘా సంస్థలకు సమాచారం అందుతూనే ఉందని, ఈ పరంపరలో ఇజ్రాయెలీ నివేదిక సరికొత్తదని అధికారులు చెప్పారు. తుది ఒప్పందానికి రాకపోతే 'తమ పని పూర్తిచేస్తాం' అని ట్రంప్ హెచ్చరించిన తర్వాత గడచిన మంగళవారం సాయంత్రం హోర్ముజ్ జలసంధిలో మూడు అమెరికా చమురు ట్యాంకర్లపై ఐఆర్‌జిసి దాడులు చేశాయి. దీంతో ఇరాన్‌తో కుదిరిన ఎంఓయు రద్దయినట్లు ట్రంప్ ప్రకటించి యుద్ధ దాడులు ప్రారంభించారు.

# ఒమన్‌లో అమెరికా–ఇరాన్ సంభాషణలు

**•మస్కట్ చేరిన అబ్బాస్ అరాఘ్చీ •వాళ్ళతో చర్చలు**

**కొనసాగించండి: వాన్స్‌కు ట్రంప్ ఆదేశం •ఎంఒయు మాత్రం రద్దైనట్టే**

**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య శనివారం (జులై 11) చర్చలకు రంగం సిద్ధమైందని టాస్ వార్తా సంస్థ పేర్కొంది. వాళ్ళతో (ఇరాన్ చర్చలబృందం) సంభాషణలు కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన తరపు సంప్రదింపుకర్తలకు ఆదేశాలు ఇచ్చారు. అదే సమయంలో ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ శనివారం మస్కట్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఒమన్‌లో ఆయనకు ఘన స్వాగతం లభించింది. హోర్ముజ్ జలసంధిలో పరిణామాలు, ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష చేసేందుకు ఆయన మస్కట్ వెళ్ళినట్లు ఇరాన్ అధికారిక మీడియా తెలియజేసింది. హోర్ముజ్ జలసంధిలో పరిణామాలు, నిర్వహణకు సంబంధించిన విషయాలపై గడచిన కొన్ని నెలలుగా ఇరాన్–ఒమన్ మధ్య జరుగుతున్న చర్చల కొనసాగింపు చర్యల్లో భాగంగా అబ్బాస్ అరాఘ్చీ ఈ పర్యటనకు వెళ్ళారని ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయిా భిన్నంగా మాట్లాడారు. కాగా, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్,పశ్చిమాసియాలో ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్, విదేశాంగమంత్రి మార్కో రుబియో, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్‌లకు ట్రంప్ ఆదేశాలు ఇస్తూ, ఇరాన్‌తో చర్చలు కొనసాగించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఐతే ఎంఒయు (ఇస్లామాబాద్ ఒప్పందం) మాత్రం రద్దైపోయిందని స్పష్టం చేశారని సిబిఎస్‌ను ఉటంకిస్తూ టాస్ వార్తాసంస్థ పేర్కొంది. ఒమన్‌లో ఈ సంభాషణలు శనివారం జరుగుతాయని కూడా సిబిఎస్ పేర్కొంది. మరోవైపు బఖాయిా మాట్లాడుతూ, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చల్లో హోర్ముజ్ జలసంధి అత్యంత ప్రముఖపాత్ర వహించిందని చెప్పారు. ఈ జలసంధి తమ అధీనంలోనే ఉంటుందని మరోసారి ఉద్ఘాటించారు. ఈ జలసంధిలో నౌకల రాకపోకల నియమ నిబంధనలను ఒమన్ సహాయంతో తామే రూపొందించి నియంత్రిస్తామని చెప్పారు. ఒమన్‌లో సాధారణ నౌకాయాన ఏర్పాట్లు, సముద్ర సేవల బాధ్యతలను ఇరాన్ స్వీకరించిందని, దీనికి కట్టుబడి చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైంది. ఏప్రిల్ నెలలో ట్రంప్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించారు. జూన్ 17,18 తేదీలలో ఇరాన్–అమెరికా నాయకులు ఎంఓయు ఒప్పందంపై సంతకాలు చేసే ప్రక్రియ పూర్తిచేశారు. తర్వాత స్విట్జర్లాండ్ నగరం బర్గెన్‌స్టాక్‌లో ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో సాంకేతిక చర్చలు ప్రారంభమయ్యాయి. హోర్ముజ్‌లో ప్రత్యామ్నాయ దారుల వినియోగంపై వివాదం రేగింది. మళ్ళీ రెండు రోజులపాటు రెండు దేశాలమధ్యా దాడులు జరిగాక సమన్వయం పాటించి దోహాలో ఖతార్ మధ్యవర్తిత్వంలో పరోక్ష చర్చలు జరిపాయి. ఖమేనీ అంతిమయాత్ర సమయంలో ట్రంప్‌ను హత్య చేయాలన్న నినాదాలు ఆయనకు ఆగ్రహం రప్పించాయి. తుది ఒప్పందం చేసుకోకపోతే "మా పని పూర్తి చేస్తాం" అని హెచ్చరించారు. దాంతో దాడులు మొదలయ్యాయి. దీంతో అంకారాలో నాటో సదస్సు సమయంలో కాల్పుల విరమణ–ఎంఓయు రద్దైనట్లు ట్రంప్ ప్రకటించారు. కానీ మళ్ళీ జులై 11న ఒమన్‌లో చర్చలకు రంగం సిద్ధమైనట్లు వార్తలు వచ్చాయి.

## ఇరాన్ అణు కర్మాగారాల పునర్నిర్మాణ పనులు?

**ఉపగ్రహ చిత్రాలపై సిఎన్ఎన్ నివేదిక**

**వాషింగ్టన్:** ఇరాన్‌లో అమెరికా చేసిన దాడుల్లో ధ్వంసమైన అణుకర్మాగారాల వద్ద పునర్నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభమైనట్లు ఉపగ్రహ చిత్రాలు చెబుతున్నాయని సిఎన్ఎన్ నివేదిక పేర్కొంది. దేశ పౌర ప్రయోజనాల కోసం యురేనియం శుద్ధి,అణు కార్యక్రమం ఇరాన్ కు ఉన్న హక్కు అని ఆ దేశ నాయకులు మొదటినుండీ ఉద్ఘాటిస్తూ వస్తున్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదని ట్రంప్ పదే పదే చర్చల్లో బెదిరింపులు,హెచ్చరికలూ చేస్తున్నప్పటికీ ఆ విషయంలో ఇరాన్ తలవంచలేదు. ఇరాన్ క్షిపణి కార్యక్రమంపై రాజీ లేదని, ఈ విషయంలో ఎవరితో బేరసారాలు ఉండబోవని కూడా స్పష్టం చేసింది. ఇస్లామాబాద్ ఒప్పందం (జూన్ 17,18 సంతకాలు) ముగిసిందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ అణు కేంద్రాలవద్ద పునర్నిర్మాణ ప్రయత్నాలపై సిఎన్ఎన్ నివేదిక వెల్లడైంది. అణుబాంబులు తయారు చేయడానికి పేలుడు పదార్థాలను నిల్వచేసినట్లు భావిస్తున్న పర్చిన్‌లోని అణుకర్మాగారం ఇటీవల బంకర్ బస్టర్ బాంబు దాడులకు గురైంది. ఈ ప్రాంతంలో ఇప్పుడు మళ్ళీ పునర్నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు జూన్ నెల ఉపగ్రహ చిత్రాలు తెలియజేస్తున్నాయని సిఎన్ఎన్ పేర్కొంది. ఇనిస్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ సంస్థ సహకారంతో ఈ ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించారు.

# ఎన్‌డిఎస్‌ఎకే అప్పగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఎన్‌టిఎస్‌ఎ కమిటీ సూచనలను పాటిస్తుంటే, కెసిఆర్ తరపున మాత్రం కిలాడీల కమిటీ ఏర్పాటు చేసుకున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కిలాడీ కమిటీకి కెసిఆర్ చైర్మన్‌గా ఉండగా, హరీశ్‌రావు, కెటిఆర్‌తో పాటు ఈటల రాజేందర్ కూడా సభ్యులుగా చేరారని అన్నారు. ఈటల రాజేందర్ కిలాడీ కమిటీని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ వద్దకు తీసుకెళ్లి, ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్‌తో మాట్లాడి ఒప్పిస్తే మూడు బ్యారేజీలు అప్పగించేందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని సిఎం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డిఎస్‌ఎ సూచనల మేరకే ప్రాజెక్టు పునరుద్ధరణపై ముందుకు వెళ్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ చర్యలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే (2026 జూన్ 30న) ప్రత్యేక సాంకేతిక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్టు సిఎం వెల్లడించారు. మూడు బ్యారేజీల వద్ద నిర్మాణపరమైన సమస్యలు ఉన్నాయని, ఈ బ్యారేజీల డిజైన్, పునరుద్ధరణ ప్రతిపాదనలకు సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు విచారణలు, నిర్మాణ పనులు, నాణ్యత నియంత్రణ, ఏమైనా మార్పులు చేస్తే ఈ కమిటీకి తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు.

**ప్రవాహం వేరు..పంపింగ్ నీటిమట్టం వేరు**

నీటి ప్రవాహం ఉండటం వేరని, పంపింగ్‌కు అవసరమైన నీటి మట్టం ఉండటం వేరని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కనీస పంపింగ్ లెవల్ 93.50 మీటర్లు ఉండాలని, కానీ ప్రస్తుతం 89.90 మీటర్లే ఉన్నదని స్పష్టం చేశారు. అన్నారం, సుందిళ్లలో కూడా గేట్లు మూస్తే తప్ప చుక్క నీరు నిల్వ ఉండబోదని, కానీ ఆ బ్యారేజీలు భద్రంగా లేకపోవడంతో గేట్లు మూసివేసి నీటిని నిల్వ చేయరాదని ఎన్‌డిఎస్‌ఎ తన నివేదికలో స్పష్టం చేసిందని అన్నారు. ఈ నేపథ్యంలో 'నీళ్ల ఎత్తిపోయడం' అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. మేడిగడ్డ బెడ్ లెవల్ 88.50 మీటర్లు, క్రెస్ట్ లెవల్ 89.50 మీటర్లు, అక్కడ నుంచి దాదాపు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి (లక్ష్మి) పంప్ హౌజ్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలంటే కావాల్సిన పంపింగ్ లెవల్ 93.50 మీటర్లు ఉండాలన్నారు. మేడిగడ్డ వద్ద ప్రవాహం ఉన్నప్పటికీ నీటి మట్టం పంపింగ్ చేసే స్థాయి 93.50 మీటర్లు లేదని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద ఇదే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసినా, అక్కడ గేట్లు ఓపెన్ ఉన్నందున అవి కూడా మళ్లీ మేడిగడ్డకు రావాల్సిందేనని అన్నారు. ఎన్‌డిఎస్‌ఎ సిఫారసు మేరకు అక్కడ గేట్లు క్లోజ్ మూసేందుకు వీలు లేదని సిఎం స్పష్టం చేశారు.

మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు ఉన్నాయని 2020 సంవత్సరం మే 18న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బివి రమణారావు లేఖ రాశారని, ఆ తర్వాత 11 నెలల్లోనే మేడిగడ్డ బ్యారేజీలో ఉన్న లోపాలు బయటపడ్డాయని సిఎం వివరించారు. 2023 సంవత్సరం అక్టోబర్ 21న మేడిగడ్డ కుంగిపోయిందని, ఆ మరుసటి రోజే ఇంజనీర్లు దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ప్లానింగ్, డిజైనింగ్, ఆపరేషనల్ మెయింటెనెన్స్‌లో లోపాలు ఉన్నాయని 2023 సంవత్సరం, నవంబర్1న ఎన్‌డిఎస్‌ఎ నివేదిక సమర్పించిందన్నారు. 2021 సంవత్సరంలో డిసెంబర్ 30న 'డ్యామ్ సేఫ్టీ యాక్ట్2021' అమలులోకి వచ్చిందని, ఈ చట్టం ప్రకారం ఎక్కడైనా నిర్దేశిత డ్యామ్‌ల పర్యవేక్షణ, నిర్వహణ, తనిఖీలు చేయవచ్చని, కేంద్ర చట్టం ప్రకారమే ఎన్‌డిఎస్‌ఎ తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డను సందర్శించిందన్నారు. వివిధ పరీక్షలు, క్షేత్రస్థాయిలో నిపుణులు పరిశీలించిన అనంతరం, పది నెలల తర్వాత ఎన్‌డిఎస్‌ఎ తన తుది నివేదికను సమర్పించిందని వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కాదని ఆ నివేదికలో స్పష్టం చేసిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్ నష్టం వల్ల బ్యారేజీ నుంచి నీటి మళ్లింపునకు పనికి రాకుండా పోయిందని, అన్నారం బ్యారేజీ తీవ్రంగా దెబ్బతిన్నదని, తద్వారా నీటి మళ్లింపు సురక్షితం కాదని, సుందిళ్ల బ్యారేజీ తీవ్రంగా దెబ్బతిన్నందున నీటి మళ్లించటం సురక్షితం కాదని ఎన్‌డిఎస్‌ఎ తన నివేదికలో పొందుపర్చిన విషయాన్ని సిఎం వివరించారు. ఎగ్జిక్యూటివ్ సమ్మరీలో 17వ పాయింట్‌లో మూడు బ్యారేజీల (మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం) తీవ్ర నష్టాలను క్రోడీకరించిందని, సమగ్ర పునరుద్ధరణ డిజైన్ అవసరమని స్పష్టం చేసిందన్నారు. మొత్తం బ్యారేజీ పటిష్టత, భద్రతపై సమగ్ర అంచనా వేసి, ఇప్పుడున్న దుస్థితిని అరికట్టడానికి తక్షణ స్థిరీకరణ చర్యలను సిఫారసు చేసినట్టు సిఎం తెలిపారు. పునరుద్ధరణ డిజైన్లు,రిపేర్లు, ఇతర పనులన్నీ ఎన్‌డిఎస్‌ఎ లేదా సిడబ్ల్యుసి ఆమోదంతోనే చేపట్టాలని ఆ సిఫార్సుల్లో పేర్కొన్నట్టు చెప్పారు.

**హరీశ్‌రావు సూచనల మేరకే ఈటల మాట్లాడుతున్నారు**

గోదావరిలో పారుతున్న నీళ్లను ఎత్తిపోయాలని బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని, ఆ వాదనకు మద్దతుగా బిజెపి ఎంపి ఈటల రాజేందర్ కూడా మాట్లాడుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సాగునీటి మంత్రి లేదా ఎన్‌డిఎస్‌ఎ అధికారులతో వివరాలు తెలుసుకుని ఈటల రాజేందర్ మాట్లాడితే ఆయన గౌరవం మరింత పెరిగేదని, హరీష్ సూచనల మేరకే ఈటల మాట్లాడటం ద్వారా ఆయన గౌరవాన్ని కోల్పోయారన్నారు.

**సిబిఐ విచారణను ఏ చీకటి ఒప్పందం ఆపుతుంది?**

కాళేశ్వరం అవినీతిపై సిబిఐ విచారణ చేపట్టకుండా ఏ చీకటి ఒప్పందం ఆపుతుందని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. దీనిపైన ఈటల రాజేందర్ ఎందుకు కేంద్రానికి లేఖ రాయడంలేదని సిఎం నిలదీశారు. పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని, సిబిఐ విచారణకు తక్షణమే ఆదేశాలు తీసుకురావాలని సూచించారు. ఎన్‌డిఎస్‌ఎ పర్యవేక్షణ పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసే అంశంలో తాము రాజేందర్‌కు సంపూర్ణంగా సహకరిస్తామన్నారు.

**హరీశ్‌రావును కెసిఆర్ నమ్మలేదు..**

**ప్రభుత్వం ఎలా నమ్ముతుంది:**

హరీశ్‌రావును ఆయన మామ కెసిఆర్ నమ్మలేదని, అదనంగా కమీషన్లు వసూలు చేయడంతోనే ఒక ఏడాది పాటు హరీశ్‌రావుకు మంత్రి పదవి ఇవ్వలేదని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టులలో మామకు ఆరు, అల్లుడికి మూడు, కొడుకు ఒక్క మొత్తం పదిశాతం కమీషన్లు వసూలు చేశారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించిన పాత కమీషన్ల వసూళ్ల కోసమే హరీశ్‌రావు మూడు నెలల పాటు మంత్రి పదవి ఇవ్వాలని అడుగుతున్నారని సిఎం అన్నారు. దోపిడీదారులతో రిటైర్డ్ ఇంజనీర్లు భాగస్వాములు అయ్యారని, రిటైర్డ్ ఉద్యోగుల ముసుగులో కాంట్రాక్టర్ల వద్ద కోట్ల రూపాయాలను తీసుకున్నారని సిఎం ఆరోపించారు. రిటైర్డ్ ఇంజినీర్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి ప్రస్తుతం సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, అప్పుడు చేసిన తప్పులకు రిటైర్డ్ ఇంజినీర్లను చెర్లపల్లి జైలులో పెట్టకుండా తప్పు చేశామని సిఎం అన్నారు.

# ఉన్మాది కిరాతకం

(మొదటి పేజీ తరువాయి)

ఉంటూనే బెయిల్ కోసం అప్లై చేసుకున్నాడు. మొత్తానికి అతనికి ఈ మధ్య కాలంలోనే బెయిల్ వచ్చింది. దీంతో పగ పెంచుకున్న రాజ్ కుమార్ శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో షాబాద్ లో నివాసం ఉంటున్న మైనర్ బాలి(17) ఇంటికి వెళ్లిన రాజ్ కుమార్ బాలిక తల్లి చిట్యాల లక్ష్మీ (45), నానమ్మ చిట్యాల రుక్కమ్మ (65), తన వెంట తెచ్చుకున్న కత్తితో నరికి చంపి మైనర్ బాలిక (17) కారులో షాబాద్ మండల కేంద్రం నుండి సుమారు ఆరు కిలోమీటర్ల దూరం లో ఉన్న తన సొంత గ్రామమైన దైవాలగూడ తీసుకువెళ్లి అక్కడున్న చెరువు పక్కన అత్యాచారం చేసి బాలికను అతికిత కిరాతకంగా నరికి చంపాడు.ఆ తర్వాత తమ సొంత ఇంటికి వెళ్లిన నరరూప రాక్షసుడు రాజ్ కుమార్ భార్య పార్వతి సరిత (30), పిల్లలు పరీక్షిత్ (03), దైవిక్షిత్ (02) కత్తితో పొడిచి చంపాడు. ఈ క్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల వారికి వినపడకుండా ఉండేందుకు టీవీ సౌండ్ పెంచి పెట్టినట్లు స్థానికులు గుర్తించారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన నిందితుడు రాజ్ కుమార్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను ఆరుగురిని హత్య చేసినట్లు చెప్పి.. తాను కూడా చనిపోతున్నట్లు చెప్పినట్లు కుటుంబ సభ్యులు షాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీస్ ఉన్నత అధికారులకు సమాచారం చేరవేయడంతో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. దీంతో క్లూస్ క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్, రప్పించడంతోపాటు పోలీసులను పలు బృందాలను ఏర్పాటు చేసి నింధితుడిని పట్టుకునేందుకు రంగాల్లోకి దింపారు.

**ఘటనపై గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన**

పోక్సో కో కేసులో నిందితుడికి అరెస్ట్ బెయిల్ పై బయటకు వచ్చిన రాజ్ కుమార్ ప్రతీకారంతో ఆరుగురిని కిరాతకంగా హత్య చేసిన ఘటనపై గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ దారుణానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ శనివారం ఉదయం షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ఆందోళనకు దిగారు.బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ను ముట్టడించి ఇంతటి దారుణానికి కారణమైన షాబాద్ సిఐ,ఎస్ఐలను వెంటనే సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. పోక్సో కేసు నమోదు చేసినప్పటికీ నిందితుడి కదలికలపై పోలీసులు నిఘా పెట్టలేదని,బాధిత కుటుంబానికి ఎలాంటి భద్రత కల్పించలేదని ఆరోపించారు. బెయిల్ పై విడుదలైన తర్వాత కూడా అతడి నుంచి ప్రమాదం పొంచి ఉందన్న విషయం తెలిసినా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించలేదని మండిపడ్డారు.ఆరుగురి హత్యలకు షాబాద్ సిఐ,ఎస్ ఐల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆందోళనకారులు ఆరోపించారు.రాజ్ కుమార్ పోక్సో చట్టం కింద కేసు నమోదు అయినప్పటికీ.కేవలం 7 సంవత్సరాల లోపు శిక్ష పడే సెక్షన్లు జత చేసి కేసు నమోదు చేసిన పోలీసులపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని,బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలీసు వైఫల్యం వల్లేనే అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో షాబాద్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అదనపు పోలీసు బలగాలను మోహరించారు.అధికారులు బాధిత కుటుం సభ్యులతో,గ్రామ పెద్దలతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు.









**షాబాద్ ఎస్ఐ రమేష్ సస్పెన్షన్ :**

**జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**

షాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబాలను ఉద్దేశించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి షాబాద్ ఎస్ఐ రమేష్ ను సస్పెన్షన్ చేశామన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు తక్షణ ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి అందించడం జరుగుతుందన్నారు.ఆ తర్వాత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

**భార్యాపిల్లలను చంపడం ఆశ్చర్యంగా ఉంది – ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి**

ఆరు హత్యల కేసు రాత్రి హత్య జరిగిందని తమకు సమాచారం వచ్చిందని చెప్పారు.రెండు చోట్ల హత్యలు జరిగాయని తెలిపారు.మొదట షాబాద్ కేంద్రంలో బాధితురాలి ఇంటికి రాత్రి 11 గంటల సమయంలో నిందితుడు పార్వతి రాజ్ కు మార్ వెళ్లాడని,అక్కడ బాధితురాలి తల్లిని,నానమ్మను హత్య చేశాడని చెప్పారు.ఆ తర్వాత బాలికను నాగర్ కుంట చెరువు దగ్గరకు తీసుకెళ్లి హత్య చేశాడని సిపి తెలిపారు.ఆ తర్వాత ఇంటికి వెళ్లి తన భార్య,పిల్లలను చంపేశాడని వివరించారు.ఆ తరువాత రాజ్ కుమార్ తన తల్లి దండ్రులకు కాల్ చేసి ఆరుగురిని చంపేశానని,తాను కూడా చనిపోతున్నానని చెప్పినట్లు తెలిపాడన్నారు.తమకు సమాచారం రావడంతో ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాలను ఆస్పత్రికి తరలించామని సిపి తెలిపారు.రాజ్ కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడన్నారు.అతని కోసం పలు బృందాలుగా విడిపోయి పోలీస్ లు గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు.భార్యాపిల్లలను కూడా రాజ్ కుమార్ చంపడం తమను ఆశ్యర్యానికి గురి చేసిందని సిపి పేర్కొన్నారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ 2 లక్షల నగదు బహుమతి ఆరుగురు హత్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు పి.రాజ్‌కుమార్‌ను పట్టుకునేందుకు దారితీసే విశ్వసనీయ సమాచారం అందించిన వారికి రూ.రెండు లక్షలు నగదు బహుమతి అందజేయనున్నట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రకటించింది. సమాచారం అందించిన వ్యక్తి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, వారి భద్రతకు పూర్తి హామీ ఇవ్వబడుతుంది. నిందితుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు చేవెళ్ల పోలీస్ కంట్రోల్ రూమ్ 8712665324 నంబర్‌కు ఫోన్ కాల్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించి సమాచారం అందించవచ్చునని పోలీస్ కమిషనర్ తరఫున పత్రిక ప్రకటన విడుదల చేశారు.

# భూ రీ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చామన్నారు. రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తి స్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టినట్లు తెలిపారు. మార్చి 2027 నాటికి మూడు విడతల్లో రీ సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీ సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ. 60లు అందజేస్తామని తెలిపారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2బిహెచ్‌కె ఇండ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్దిదారులకు అందజేసి మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ సర్వేను నవంబర్ లోపు పూర్తి చేయాలన్నారు. రెండవ విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి 2027 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ హౌసింగ్ కార్పోరేషన్ ఎండి విపి గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుడిసెలను గుర్తించిన వాటిలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సెర్ప్ సిఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. జులై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జులై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డిఆర్‌డిఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో భూ రీ సర్వే చేపట్టామన్నారు. నాలుగు యంత్రాలను సిఎస్ఆర్ నిధుల ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డివో ఎస్. శ్రీనివాస్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఐదు వికెట్లతో రెచ్చిపోయిన క్రాంతి గౌడ్

170కే ఇంగ్లాండ్ ఆలౌట్..!

లార్డ్స్ లో జరగుతున్న చరిత్రాత్మక టెస్టులో భారత పేసర్ క్రాంతి గౌడ్ (3–25) నిప్పులు చెరిగింది. తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇంగ్లాండ్ నడ్డివరిచింది. స్వింగ్‌తో టాపార్డర్‌ను కూల్చిన క్రాంతి.. లంచ్ తర్వాత విజృంభించగా ఆతిథ్య జట్టు 170కే ఆలౌటైంది. అమీ జోన్స్(52), కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) మినహా ఎవరూ రాణించకపోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 115 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. సయాలీ సత్ఘరే(1–36), స్నేహ్ రాణా(1–35) రాణించారు. లార్డ్స్ టెస్టులో రెండో రోజు పట్టుబిగించిన భారత జట్టు పేసర్ క్రాంతి గౌడ్ (5–37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లాండ్‌ను పడగొట్టింది. సొంతగడ్డపై దంచేయాలనుకున్న ఇంగ్లాండ్ బ్యాటర్లను వణికించిన క్రాంతి.. మొదటి సెషన్‌లోనే కోలుకోలేని దెబ్బకొట్టింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(240), స్నేహ్ రాణా(241) రెచ్చిపోగా లంచ్ లోపే సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధ శతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) పోరాడింది. కానీ, లంచ్ తర్వాత ఆమెను సైతం గౌడ్ వెనక్కి పంపింది. లారెన్ బెల్‌ను ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో మొదటిసారి ఐదు వికెట్లు తీసింది భారత స్పీడ్‌స్టర్. చివరి బ్యాటర్ లారెన్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో 170 వద్ద ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది.



# ఇంగ్లాండ్‌దే ఐసిసి కిరీటం!




ఇంగ్లాండ్ గడ్డపై టీమిండియా పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా శనివారం సౌతాంప్టన్ వేదికగా ఏకపక్షంగా సాగిన ఆఖరి మ్యాచ్‌లోనూ టీమిండియా 56 పరుగుల తేడాతో చిత్తయ్యింది. మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఇంగ్లాండ్ భారీ విజయాన్ని అం దుకుంది. ఈ గెలుపుతో ఐసిసి టీ20 ర్యాంకింగ్స్ లో భారత్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అంతర్జాతీయ టీ20ల్లో టీమిండియాకు ఇది వరుసగా ఆరో పరాజయం. నయా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో 7 మ్యాచ్‌లు ఆడిన టీమిండియా ఒక్క విజయం సాధించలేకపోయింది. పసికూన ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన భారత్.. ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లోనూ 4–0తో దాదాపు క్లీన్ స్వీప్ అయినట్లే. తొలి టీ20 వర్షంతో రద్దవ్వడంతో ఆ అప్రతిష్టను భారత్ తప్పించుకుంది. లేకుంటే ఆ మ్యాచ్‌లో కూడా ఓడి సిరీస్‌లో 5–0తో క్లీన్ స్వీప్ అయ్యేది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 257 పరుగుల భారీ స్కోర్ చేసింది. జోస్ బట్లర్(64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్స్‌లతో 131) విధ్వంసకర శతకంతో చెలరేగగా..కెప్టెన్ హ్యారీ బ్రూక్(45 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్స్‌లతో 95 నాటౌట్) పరుగుల సునామీ సృష్టించాడు. భారత బౌలర్లలో శివమ్ దూబే(2/22) రెండు వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 201 పరుగులు చేసి ఓటమి పాలైంది. ఇషాన్ కిషన్(35 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 56), తిలక్ వర్మ(25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. ఇంగ్లండ బౌలర్లలో సామ్ కరణ్(3/36) మూడు వికెట్లు తీయగా.. ఆదిల్ రషీద్ రెండు వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్, లియామ్ డాసన్ తలో వికెట్ తీసారు. ఈ మ్యాచ్‌లో పిచ్‌ను అంచనా వేయడంలో విఫలమైన భారత్ భారీ మూల్యం చెల్లించుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోవడం టీమిండియా కొంపముంచింది. 258 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియాకు ఆశించిన శుభారంభం దక్కలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ(6) మరోసారి తీవ్రంగా నిరాశపర్చాడు. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. వైభవ్ స్థానంలో జట్టులోకి తిరిగొచ్చిన సంజూ శాంసన్(27) 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో జోరు కనబర్చాడు. కానీ అతన్ని సామ్ కరణ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో పవర్ ప్లేలో భారత్ 2 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడి 8.5 ఓవర్లలోనే జట్టు స్కోర్‌ను 100 ధాటించారు. 55 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని లియామ్ డాసన్ విడదీసాడు. శ్రేయస్ అయ్యర్(28)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు.

## ఇషాన్ మెరిసినా..

క్రీజులోకి తిలక్ వర్మ రాగా.. ఇషాన్ కిషన్ 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే అతన్ని ఆదిల్ రషీద్ క్యాచ్ ఔట్‌గా బోల్తా కొట్టించాడు. క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే గోల్డెన్ డకౌటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అతను ఇచ్చిన క్యాచ్‌ను ఎక్స్‌ట్రా కవర్స్‌లో హ్యారీ బ్రూక్ వదిలేసాడు. కానీ అతను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. 2 బౌండరీలు మాత్రమే బాది సామ్ కరణ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో సూర్యాన్ష్ షెడ్గేతో కలిసి తిలక్ వర్మ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలోనే అతను 24 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ ఆ మరుసటి బంతికే కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. సూర్యాన్ష్ క్యాచ్ ఔటవ్వగా.. అక్షర్ పటేల్(3) కూడా నిరాశపర్చాడు. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ మంగళవారం(జూలై 14) ప్రారంభం కానుంది.




# స్థిరపడిన మార్కెట్లు

## ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 77,763.91 పాయింట్లు. ముగింపు 77,569.39 పాయింట్లు. నష్టం 194.52 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,270.85 పాయింట్లు. ముగింపు 24,206.90 పాయింట్లు. నష్టం 63.95 పాయింట్లు.

## బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)

24 క్యారెట్లు: రూ. 1,44,820

22 క్యారెట్లు: రూ. 1,32,751

18 క్యారెట్లు: రూ. 1,08,620.



(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).



ఈ వారం (జులై 6–10) భారతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. చివరికి స్వల్ప నష్టాలతో బయటపడ్డాయి. అయితే ఈ గణాంకాలు కనిపించేంత ప్రతికూలంగా మార్కెట్ పరిస్థితి లేదని చెప్పవచ్చు. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించినప్పుడు ప్రపంచ మార్కెట్లలో ఒక్కసారిగా ఆందోళన నెలకొనగా, భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగే అవకాశంపై పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గు చూపడంతో భారత మార్కెట్లు కూడా భారీ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. కానీ, ఆ తరువాత పరిస్థితి కొంత స్థిరపడింది. విదేశీ మార్కెట్లలో భయాందోళనలు తగ్గడం, దేశీయ ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడిదారుల విశ్వాసం కొనసాగడం, బ్యాంకింగ్, ఐటీ వంటి రంగాల్లో కొనుగోళ్లు రావడం వల్ల సూచీలు తమ కనిష్ఠ స్థాయిల నుంచి గణనీయంగా కోలుకున్నాయి. ఇది మార్కెట్‌లో కొనుగోలు ఆసక్తి ఇంకా బలంగానే ఉందని సూచిస్తోంది. ఇలావుంటే, వచ్చే వారం మార్కెట్ దిశ ప్రధానంగా అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికా–ఇరాన్ సంబంధాల్లో మరిన్ని ఉద్రిక్తతలు ఏర్పడతాయా లేదా పరిస్థితి చల్లబడుతుందా అన్నది పెట్టుబడిదారుల భావోద్వేగాలను ప్రభావితం చేస్తుంది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరిగితే భారత మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగవచ్చు. మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ప్రవాహం కొనసాగితే మార్కెట్‌కు బలం చేకూరుతుంది. సాంకేతిక విశ్లేషణ పరంగా చూస్తే నిఫ్టీ 24,100– 24,150 స్థాయిల వద్ద మద్దతు పొందే అవకాశం ఉండగా, 24,350–24,450 స్థాయిల వద్ద ప్రతిఘటన ఎదురయ్యే అవకాశం ఉంది. సెన్సెక్స్‌కు 77,300 ప్రాంతం కీలక మద్దతుగా, 78,000 ప్రాంతం కీలక నిరోధక స్థాయిగా మారవచ్చు. మొత్తం మీద వచ్చే వారం మార్కెట్ అధిక ఒడిదుడుకులతో కూడిన పరిమిత శ్రేణిలో కదిలే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. అంతర్జాతీయ పరిస్థితుల్లో ప్రతికూల వార్తలు లేకపోతే స్వల్ప సానుకూల ధోరణి కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## భారత్‌పై అదనపు పన్ను ప్రతిపాదన!

అమెరికా ప్రతిపాదించిన 12.5 శాతం అదనపు దిగుమతి సుంకం భారత్‌ను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. ఇరు దేశాల మధ్య వాణిజ్య వివాదాలను ఏకపక్ష నిర్ణయాల ద్వారా కాకుండా, పరస్పర చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఈ ఘటనపై స్పందించిన భారత్ స్పష్టం చేసింది. యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్) నిర్వహించిన బహిరంగ విచారణలో భారత వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ బ్రిజ్ మోహన్ మిశ్రా పాల్గొని, అమెరికా దర్యాప్తు నివేదికలో అనేక లోపాలు ఉన్నాయని మండిపడ్డారు. వెట్టిచాకిరి లేదా బలవంతపు కార్మిక వ్యవస్థ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతిని నిరోధించడంలో భారత్ విఫలమైందన్న అమెరికా ఆరోపణలను ఆయన పూర్తిగా తిరస్కరించారు. బలవంతపు కార్మిక వ్యవస్థ నిర్మూలన అనేది భారత రాజ్యాంగ విధి అని, దేశం అంతర్జాతీయ చట్టాలను తూచా తప్పకుండా పాటిస్తోందని స్పష్టం చేశారు. ఎటువంటి నిర్దిష్ట ఆధారాలు లేకుండా, కేవలం అపోహలతోనే అమెరికా ఈ నివేదికను తయారు చేసిందని భారత్ వాదించింది. వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం ఫస్ట్ సెక్రటరీ శ్రేయాన్స్ గుప్తా మాట్లాడుతూ, భారత బియ్యం దిగుమతుల వల్ల అమెరికా మార్కెట్ దెబ్బతింటోందనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అమెరికాకు ఎగుమతయ్యే బియ్యం కఠినమైన నిబంధనలకు లోబడి, నమోదిత మిల్లుల నుండే వస్తుందని తెలిపారు. కాబట్టి ఈ విచారణను నిలిపివేయాలని లేదా భారతీయ బియ్యానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారతీయ పారిశ్రామిక సంస్థలైన ఫిక్కీ, సిఐఐ కూడా అమెరికా పన్ను ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ అదనపు పన్నుల వల్ల భారత ఎగుమతిదారులతో పాటు, అమెరికాలోని తయారీదారులు, వినియోగదారులపై కూడా తీవ్ర ద్రవ్యోల్బణ (ధరల పెరుగుదల) భారం పడుతుందని ఫిక్కీ హెచ్చరించింది. బలవంతపు కార్మిక వ్యవస్థ వంటి కారణాలను చూపుతూ 2026 మార్చిలో యుఎస్‌టిఆర్ దర్యాప్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా భారత్, చైనాతో సహా 54 దేశాలపై 12.5 శాతం అదనపు సుంకాలను ప్రతిపాదించింది. అయితే, ఇది ప్రాథమిక ప్రతిపాదన మాత్రమే కావడం వల్ల, తుది నిర్ణయానికి ముందు అన్ని దేశాల అభ్యంతరాలను యుఎస్‌టిఆర్ పరిశీలించాల్సి ఉంటుంది.



## రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రావడం ఖాయం

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయ ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంగారెడ్డి నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ అయినా, జనరల్‌గా ఉన్నా నిర్మల జగ్గారెడ్డే కాంగ్రెస్ అభ్యర్థిగా ఉంటారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయ ప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. తాను సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోనని మాత్రమే చెప్పానని, వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేయబోనని ఎక్కడా చెప్పలేదని ఆయన స్పష్టత ఇచ్చారు. గాంధీ భవన్‌లో శనివారం మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రావడం ఖాయమని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారన్నారు. 117 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించే లక్ష్యంతో సిఎం రేవంత్ రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. పార్టీ బలోపేతానికి సిఎం చేపడుతున్న వ్యూహాలు, నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, రేవంత్ రెడ్డి ఆలోచనలతో తమకు ఏకాభిప్రాయం ఉందని తెలిపారు.అభ్యర్థుల ఎంపిక అంశంపై స్పందిస్తూ, ఎవరికెవరికీ టికెట్లు ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర ఇంచార్జీ కలిసి తీసుకునే నిర్ణయమని స్పష్టం చేశారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం సరైన ఆలోచనే నని పేర్కొన్నారు. ఎవరి సర్వేలు వారు తమకు అనుకూలంగా నిర్వహిస్తారని, వాటిని చూసి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గతంలో కెసిఆర్ తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా పలువురు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల పనితీరు సరిగా లేదని సర్వేలు వెల్లడించాయని గుర్తు చేశారు. ప్రతిపక్షం అధికార పార్టీని విమర్శించడం రాజకీయాల్లో సహజమని, అదే రాజకీయ నీతి అని జగ్గారెడ్డి అన్నారు. ఎంఎల్‌ఎల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, అవసరమైన చోట ప్రజా ప్రతినిధులకు సూచనలు చేస్తూ పాలనను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నారని జగ్గారెడ్డి అన్నారు.

## ఎల్‌నిఓ ప్రభావం దృష్ట్యా పంటల మార్పిడిపై దృష్టి సారించాలి

రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవడంతో పాటు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు సకాలంలో రైతు భరోసా ఆర్థిక సాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు తెలంగాణ రైతాంగం తరపున రైతు కమిషన్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయనపేర్కొన్నారు.పంటల మార్పిడి అవసరాన్ని రేవంత్ రెడ్డి ముందుగానే ప్రస్తావించారని, అదే అంశంపై రైతు కమిషన్ కూడా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించిందని కోదండరెడ్డి వెల్లడించారు. వాతావరణ మార్పులు, నీటి లభ్యత, మార్కెట్ అవసరాలను దృష్టి లో ఉంచుకుని పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం కూడా సూచిస్తోందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తమ ప్రాంతాలకు అనువైన సంప్రదాయ పంటల సాగుపై మళ్లీ దృష్టి సారించాలని ఆయన సూచించారు. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే పంట నష్టాలను తగ్గించుకోవడంతో పాటు ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ సాధనకు తొలి ఉద్యమం ఎఐటియుసిదే

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ తొలి ఉద్యమానికి శ్రీకారం చుట్టింది ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ యూనియనేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. శనివారం శ్రీరాంపూర్‌లోని ఆర్‌కె 5 గనిలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ 2013లోనే సచివాలయాన్ని ముట్టడించి అరెస్టులకు గురైన ఘనత ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ దేనని గుర్తు చేశారు. ప్రస్తుతం తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్‌తో పాటు మిగిలిన అన్ని బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చామని, త్వరలో రీజినల్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగే చర్చలు విఫలమైతే ఆగస్టు నెలలో సమ్మెకు వెళ్లడం ఖాయమని వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. నాలుగు లేబర్ కోడ్ల కారణంగానే వేజ్ బోర్డు అమలు ఆలస్యమవుతోందని విమర్శించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 40 శాతం లాభాల వాటాను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయ పన్నును రద్దు చేయాలని, సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే వసూలు చేసి, కొత్త బొగ్గు ప్రాజెక్టులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ మోత్కూరి కొమురయ్య, ఏరియా మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ అడ్డు శీను, ఆర్కే5 ఫిట్ సెక్రటరీ నరసింగరావు, నాయకులు మల్లేష్, ప్రవీణ్, జిపి రావు, శంకర్రావు పాల్గొన్నారు.

## కార్మిక బద్ధ వ్యతిరేకి ప్రధాని మోదీ

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నిరంతరం కార్మికుల యొక్క హక్కులను కాలరాస్తున్న కార్మిక బద్ధ వ్యతిరేకి నరేంద్ర మోడీని సాగనంపాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్ ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన ఎఐటియుసి 11వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్వతంత్రానికి పూర్వం సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను నేటి మోదీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకవచ్చిందని మండిపడ్డారు. గుత్తా పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కార్మిక వ్యతిరేకి మోదీని వచ్చే ఎన్నికల్లో సాగనంపే వరకు మరో స్వతంత్ర పోరాటానికి కార్మికులు సన్నద్ధం కావాలని కోరారు. రాష్ట్రంలో మాటల గారడితో మాయ చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందు దొందుగానే మిగిలాయని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాజకీయ పబ్బం గడుపుతూ కార్మికులను పేద ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అంతకు ముందు ఎఐటియుసి జెండాను ఆవిష్కరించారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా దంతాల రాంబాబు, శ్యామల అశోక్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, చివ్వెంల మండల కార్యదర్శి కె. రాము, యూనియన్ నాయకులు సైదులు, దీకొండ శ్రీనివాస్, పెంద్ర కృష్ణ, వెంకన్న, సాయిబాబా, ఏఐవైఎఫ్ నాయకులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.





## సీతారామను సత్వరం పూర్తి చేయండి

ముఖ్యమంత్రికి సిపిఐ వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లా సాగు నీటికి సంబంధించి ప్రధాన జీవనాధారంగా ఉన్న సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల నూతన ఆయకట్టుకు సాగునీటిని ఇవ్వడంతో పాటు నాలుగున్నర లక్షల ఎకరా ల ఆయకట్టు స్థిరీకరణకు సంబంధించి ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టు నిధు ల కేటాయింపు లేక నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు బిఆర్‌ఎస్ తొమ్మిదివేల కోట్లు ఖర్చు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపు సరైన రీతిలో లేకపోవడంతో ప్రాజెక్టు అంచనా వ్యయం పెరుగుతూ వచ్చిందన్నారు. ఎలినినో ప్రభావం కృష్ణా పరివాహక ప్రాంతాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల రీత్యా సీతారామ సత్వర నిర్మాణానికి సరిపడ నిధులు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. ఖమ్మం మినహా అన్ని ఉమ్మడిజిల్లాల్లో యూనివర్సిటీలు ఉన్నాయని ఖమ్మంలో యూనివర్సిటీని స్థాపించాలని జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాల ని సంక్షోభంలో కూరుకుపోతున్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని వినతి ప త్రంలో పేర్కొన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షన్నర మంది ఆధారపడిన గ్రా నైట్ పరిశ్రమకు చేయూతనివ్వాలని వినతి పత్రంలో కోరారు. ఖమ్మంజిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. ఖమ్మం నగరం ఇటీవల కాలంలో బాగా విస్తరించిందని ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని ఫ్లైఓవర్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు దూసరి గోపాలరావు ఉన్నారు.

## అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ సరికాదు



- బిఎల్ఒ విధుల నుండి తక్షణమే మినహాయింపు ఇవ్వాలి
- ఎన్నికల హామీలను సిఎం నిలుపుకోవాలి
- నేటి నుండి అంగన్వాడీల సమస్యలపై పాదయాత్ర
- ఎఐటియుఎసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్

**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై పనిభారం మోపుతూ వెట్టిచాకిరీ చేయించడం సరికాదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గోనె మణితో కలిసి ఆయన మాట్లాడారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతల సంక్షేమంలో కీలకపాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీలను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అదనపు విధుల పేరుతో వేధింపులకు గురి చేయడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికార యంత్రాంగం నిర్వాకంతో అంగన్‌వాడీ వ్యవస్థ క్రమంగా కుప్పకూలుతోందన్నారు. కనీస అవసరాలు సమకూర్చకపోగా, సిబ్బందిపై పనిభారం మోపడం సరైంది కాదన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే వ్యవస్థ నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని నరాటి అభిప్రాయం వ్యక్తం చేశారు. బిఎల్ఒ విధులు అప్పగించడం ద్వారా కేంద్రాల నిర్వహణ ఇబ్బందిగా మారిందని సర్వేల పేరుతో బాధ్యతలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి క్రమంలో పౌష్టికాహారం ఎవరు అందిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీపై హామీల వర్షం కురిపించిన పాలకులు అధికారంలోకి వచ్చాక మరిచారని, ఇచ్చిన మాట నిలుపుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. నెలకు రూ.15వేల జీతం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఆదివారం నుండి రెండు రోజుల పాటు పాదయాత్ర నిర్వహించతలపెట్టామని, ఆ పాదయాత్ర ఆదివారం భద్రాచలం నుండి ప్రారంభమైన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాతో ముగుస్తుందని ఆయన చెప్పారు. ఇప్పటికైనాప్రభుత్వం నిద్రమత్తు వీడి అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్, వేల్పుల మల్లిఖార్జున రావు, మండల రాజు, రత్నకుమారి, చిన్నారి, కంభంమెట్టు శ్రీనివాస్, మారెడ్డి శివాజీ, ఎస్వీఎస్ నాయుడు, మీసాల భాస్కర్ రావు, భద్రాద్రి వెంకటేశ్వరరావు, మహేష్, గుంజ రామారావు, సత్తినేడు సాయిరామ్, రద్ర బ్రదర్స్, చింతలరామారాజు తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ భారత్ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

- ఐదు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల రూపురేఖలు మారిపోతాయ్
- ఐటి ప్రతినిధుల సమావేశంలో కేంద్రమంత్రి అశ్వనీవైష్ణవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులలో ఐదు రాష్ట్రాలకు హైదరాబాద్‌ను అనుసంధానం చేయ డం ద్వారా ఈ మహానగరాన్ని దక్షిణభారతదేశంలోనే అతిపెద్ద కేంద్రంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తీర్చిదిద్దుతున్నారని రైల్వే–ఐ.టి శాఖల మంత్రి అశ్వనీవైష్ణవ్ చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం ఐ.టి పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం సందర్భంగా దేశ రైల్వే వ్యవస్థలో రాబోయే కాలంలో పెనుమార్పులు వస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్, పుణె, చెన్నై, అమరావతి, బెంగళూరులను కలుపుతూ అతిపెద్ద బుల్లెట్ ట్రైన్ నెట్‌వర్కు విస్తరిస్తుందని చెప్పారు. దీనివల్ల దక్షిణ భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఈ బుల్లెట్ రైళ్ళ నెట్‌వర్క్ భారీ మార్పులు తీసుకురాబోతోందని తద్వారా ఈ రాష్ట్రాల రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. దేశంలో మంజూరైన బుల్లెట్ ట్రైన్ కారిడార్స్‌లో హైదరాబాద్‌కే అన్నిటికంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా బుల్లెట్ ట్రైన్లకోసం ఏడు కారిడార్లు మంజూరు చేశామని, వీటిల్లో పైన పేర్కొన్న కారిడార్లు హైదరాబాద్ నగరంతో అనుసంధానం అవుతాయని ఇది హైదరాబాద్ నగరానికి కలిగే అతి పెద్ద ప్రయోజనమన్నారు. హైదరాబాద్ నుండి పుణెకు, హైదరాబాద్ నుండి చెన్నై మహానగరానికి, హైదరాబాద్ నుండి బెంగళూరు సిలికాన్ కేంద్రానికి, హైదరాబాద్ నుండి అమరావతికి బుల్లెట్ రైళ్ళను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. బుల్లెట్ రైళ్ళను భారతదేశంలోనే సొంతంగా డిజైన్ చేసుకుని తయారు చేస్తున్నామని, దేశమే సొంతంగా వీటిని నిర్మించుకుంటున్నందువల్ల ప్రపంచవ్యాప్తగా బుల్లెట్ రైళ్ళ వ్యవస్థలో భారతదేశం కీలక పాత్ర పోషించనున్నదని చెప్పారు. దేశంలో 1000 రైల్వే స్టేషన్‌లను సరికొత్త సదుపాయాలతో తిరిగి అభివృద్ధి చేస్తూ వాటి రూపురేఖలు మార్చేస్తున్నామని చెప్పారు. త్వరలోలోనే ఈ రైళ్ళు రంగ ప్రవేశం చేస్తాయని చెప్పారు. వందేభారత్ రైళ్ళను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టామని, రైల్వే వ్యవస్థలో ఒక నూతన మార్పులు తెచ్చామని చెప్పారు. ముంబై–అహ్మదాబాద్ మధ్య వచ్చే ఏడాది మొదటి సెక్షన్ బుల్లెట్ రైలును ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. ఈ తర్వాత దశలవారీగా మిగిలిన సెక్షన్లను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

**సెమీకండక్టర్ రంగంలో 10 లక్షల ఉద్యోగావకాశాలు**

సెమీ కండక్టర్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతులకు కొరత ఏర్పడిందని,10 లక్షల ఉద్యోగావకాశాలు ఉన్నాయని, భారతదేశ ఐ.టి పరిశ్రమ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ పిలుపు ఇచ్చారు. హైదరాబాద్‌లో శనివారం ఐ.టి పరిశ్రమ ప్రతినిధులతో సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్స్, ఐ.టి రంగాలకు కొత్త కొత్త డిజైన్లు ఎలా సృష్టించాలో, సమస్యలకు ఎలా పరిష్కారాలు సాధించాలో తెలుసుకాబట్టి భారతదేశంలో ఐ.టి. పరిశ్రమ చాలా తేలికగా సులభంగా ఈ అవకాశాలను అందిపుచ్చుకోగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. "ప్రపంచవ్యాప్తంగా 10 లక్షలమంది ప్రతిభావంతుల కొరత సెమీకండక్టర్ రంగంలో ఉందని చెబుతున్నారు, దీనిని మనం అందిపుచ్చుకోవాలి, ఈ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దడం కోసం దేశంలోని 315 విశ్వవిద్యాలయాలకు అత్యంత అధునాతన, ముందుతరం సెమీకండక్టర్ డిజైన్ టూల్స్‌ను కూడా సమకూర్చాం, దీనివల్ల ఈ పరిశ్రమకు ఎంతో మద్దతుగా, ప్రయోజనకరంగా ఉంటుంది" అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీలో తెలంగాణకు భారీ ఎత్తున మద్దతు ఇస్తోందని, 104 ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీలు తెలంగాణ నుండే పనిచేస్తున్నాయని చెప్పారు. అంతేకాకుండా తెలంగాణకు నాలుగు భారీ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను మంజూరు చేశామని చెప్పారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో సెమీకండక్టర్ల రంగానికి ఎంతో పెద్ద ప్రోత్సాహం ఇస్తున్నారని, ఇప్పటికే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లు చిప్ ఉత్పత్తులు ప్రారంభించాయని, జపాన్,అమెరికా,యూరప్ దేశాలకు వీటిని ఎగుమతి చేస్తున్నాయని, ఈ విధంగా దేశంలో మొత్తం 12 ప్లాంట్లు సెమీకండక్టర్ ఇండస్ట్రీలో వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని చెప్పారు. దేశం నుండి జరుగుతున్న ఎగుమతుల్లో ఎలక్ట్రానిక్స్ విభాగం మూడవ అతిపెద్ద ఎగుమతిదారుగా అవతరించిందని, వీటిల్లో భారత్ నుండి అత్యధికంగా మొబైల్ ఫోన్లు ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. కొద్ది సంవత్సరాలక్రితం ఎగుమతుల్లో ఈ విధమైన అభివృద్ధి సాధిస్తామని అస్సలు ఊహించలేదని, ఈనాడు భారతదేశం నుండి ఎగుమతయ్యే తయారీ వస్తువులలో మొబైల్‌ఫోన్లు అగ్రస్థానంలో ఉన్నాయని చెప్పారు. "మన దేశం నుండి జరిగే ఎగుమతుల్లో ఎలక్ట్రానిక్స్ కేటగిరీ మూడవ అతి పెద్ద ఎగుమతిదారుగా స్థానం సంపాదించింది, దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమలో అభివృద్ధి రేటు ఏటేటా రెండంకెల స్థాయిలో పెరుగుతోంది, ఇది రూ.13 లక్షల కోట్లు దాటింది, ఇది త్వరలోనే రూ.20 లక్షల కోట్లుకు పెరుగుతుందని అంచనావేస్తున్నట్లు చెప్పారు.

# అడ్డగోలుగా అబద్ధాలు ఆడడం బిఆర్‌ఎస్ నేతలకు అలవాటైంది

- జర్నలిస్టులకు ఎంసిఎహెచ్‌ఆర్డీ క్యాంప్ కార్యాలయాన్ని చూపించిన సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ భవనంలో తన క్యాంపు కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జర్నలిస్టులకు చూపించారు. ఒక అంతస్తు గల భవనంలో ప్రతి గదిని ఆయన స్వయంగా జర్నలిస్టులను వెంటబెట్టుకొని తీసుకెళ్లారు. బోధి పెవిలియన్ పేరుతో నిర్మించిన ఈ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం జర్నలిస్టులను భవనంలోనే ప్రతి గదిని, టాయిలెట్స్ సహా చూపించారు. ఈ భవనానికి వందల కోట్లు ఖర్చయిందని బిఆర్‌ఎస్ నేతల విమర్శల నేపథ్యంలో దానిని అనువనువు చూపిస్తూ, దీనికి వందల కోట్లు ఎలా ఖర్చవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇనుప కంచలకే రూ.17 కోట్లు అయ్యాయని హరీష్ రావు చేసిన విమర్శలను దృష్టిలో పెట్టుకొని భవనం చుట్టూ తిరిగి చూపిస్తూ ఇనుప కంచలు ఎక్కడున్నాయో చూపించాలన్నారు. అడ్డగోలుగా అబద్ధాలు ఆడడం బిఆర్‌ఎస్ నేతలకు అలవాటైందన్నారు. తాను ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డికి చైర్మన్ అని, ఆ హోదాలోనే ఇక్కడ క్యాంపు కార్యాలయాన్ని ఎవరికి ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా నిర్మించినట్లు తెలిపారు. ఆదివారాలు సెలవు రోజుల్లో కూడా పనిచేసేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేశానని అన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు.

**నా పరిధిలో యాదగిరిగుట్ట దేవస్థానం**

ఇటీవల నియమిచ్చిన యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డుపై వచ్చిన ఆరోపణల గురించి ముఖ్యమంత్రిని ప్రశ్నించగా, అన్ని అంశాలు వర్గాల సమతూకంతోనే ఈ బోర్డును వేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బోర్డు సభ్యులు సొంతంగా నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేయగల వారున్నారని తెలిపారు. స్థానిక జిల్లా నేతలను సంప్రదించలేదనే వాదనలను ప్రస్తావించగా, యాదగిరిగుట్ట అనేది స్థానిక దేవాలయం కాదని తిరుపతి వంటి దేవాలయాల తరహాలో రాష్ట్ర మొత్తానికి సంబంధించిందని చెప్పారు. పైగా ఆ దేవస్థానం వైటిడిఎ పరిధిలో ఉన్నదని, అది మున్సిపల్ శాఖ పరిధిలో ఉండే తప్ప దేవాదాయ శాఖ పరిధిలో కాదని, ప్రస్తుతం తానే మున్సిపల్ శాఖను కూడా చూస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

**వచ్చే ఏడాది హైదరాబాదులో కేజీ టు టెన్త్ వరకు ఒకే చోట పాఠశాలలు**

పాఠశాలలను 27 వేల నుండి 4000 కుదించే అంశాన్ని ప్రశ్నించగా, తమ ప్రభుత్వం ఒకే ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలను ఒక దగ్గరికి తెచ్చి కేజీ నుండి పదవ తరగతి వరకు ఒకే ప్రాంగణంలో తీసుకువస్తున్నామని చెప్పారు. గతంలో రవాణా సౌకర్యాలు లేవని ఇప్పుడు వాటిని కూడా తాము కల్పిస్తున్నామని అలాగే అన్ని సబ్జెక్టులకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా ఉంటారని చెప్పారు. మండలాలు క్లస్టర్ గా ఈ పాఠశాలలు ఉండబోతున్నాయని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో క్యూర్ ప్రాంతంలోని హైదరాబాద్ నగరం సహా పరిసర ప్రాంతాలలో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా రాజధానిలో అత్యధికంగా 10 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని కాబట్టి ఐదారు ఎకరాలు ఉన్నచోట క్లస్టర్లలో పాఠశాలలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

# బిటెక్ విద్యార్థి హత్య కేసు దర్యాప్తు వివరాలు సమర్పించండి : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జగిత్యాల జిల్లా ఐలాపూర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి అంకం రాహుల్ అదృశ్యం, హత్య కేసు దర్యాప్తు పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తన కుమారుడిని పక్కా ప్రణాళికతో కిడ్నాప్ చేసి హత్య చేశారని, ఈ కేసును స్వతంత్ర సంస్థ అయిన సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరుతూ రాహుల్ తండ్రి అంకం రాజేశ్వర్ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్ లతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిన కోర్టు, కేసు దర్యాప్తు పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది. పిటిషనర్ తరపున న్యాయవాది మల్లుగారి సుదర్శన్ వాదనలు వినిపిస్తూ, హైదరాబాద్‌లోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న రాహుల్ గత మే 27న కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద స్నేహితుడు దింపిన తర్వాత అదృశ్యమయ్యాడని తెలిపారు. కాచిగూడ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేయగా, అనంతరం ప్రకాశం జిల్లా సింగరాయకొండ పరిధిలోని ఓ బావిలో బండరాయికి కట్టి పడేసిన గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించి అక్కడి పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేశారని వివరించారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు సంబంధించిన వివాదం నేపథ్యంలో పథకం ప్రకారం ప్రలోభపెట్టి అపహరించి హత్య చేసినట్లు ఫోన్ సంభాషణలతో సహా కీలక ఆధారాలు ఉన్నప్పటికీ, రెండు రాష్ట్రాల పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు చేయలేదని ఆరోపించారు. న్యాయం కోసం 45 రోజులుగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం లేకపోయిందని, ఏపీ పోలీసులు మృతదేహాన్ని 72 గంటల్లోనే ఖననం చేయడం అనుమానాలకు తావిస్తోందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం తరపున న్యాయవాది స్పందిస్తూ, డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాన్ని నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోందని, కాచిగూడ, సింగరాయకొండ పోలీసులు మృతుడి తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో పూర్తి వివరాలు బహిర్గతం చేస్తే విచారణపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, రెండు రాష్ట్రాలకు సంబంధించిన అత్యంత సున్నితమైన కేసు కావడంతో జాగ్రత్తగా దర్యాప్తు సాగుతోందని కోర్టుకు వివరించారు ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, బాధిత తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్న విషయాన్ని విస్మరించరాదని పేర్కొంది. కేసు డైరీ నమోదు వివరాలు, దర్యాప్తు పురోగతి, రెండు రాష్ట్రాల పోలీసుల మధ్య జరుగుతున్న అంతర్రాష్ట్ర సమన్వయ విధానం తదితర అంశాలతో కూడిన పూర్తి స్టేటస్ రిపోర్టును తదుపరి విచారణ నాటికి సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఆదేశించింది.

# కొల్లూరులో 2బీహెచ్‌కె ఇండ్లు కేటాయించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దాదాపు రెండు దశాబ్దాల క్రితం నాంపల్లిలోని భీంరావ్‌బాడ మురికివాడ వాసులను బలవంతంగా ఖాళీ చేయించిన వ్యవహారంపై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 19 సంవత్సరాలుగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి ముగింపు పలుకుతూ, నిరాశ్రయులైన కుటుంబాలకు కొల్లూరులో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్లను రెండు నెలల్లోగా కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జస్టిస్ సుద్దాల చలపతిరావు ఈ మేరకు 2008లో దాఖలైన పిటిషన్‌పై తీర్పు వెలువరించారు. భీంరావ్‌బాడను గుర్తింపు పొందిన మురికివాడల జాబితా నుంచి తొలగిస్తూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.251ను సవాలు చేస్తూ కె.భారతి సహా 70 మంది హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరపున న్యాయవాది వాదిస్తూ, భీంరావ్‌బాడలో తమ కుటుంబాలు దాదాపు 60 ఏళ్లుగా నివసిస్తున్నాయని, 1991లో ప్రభుత్వం అధికారికంగా ఈ ప్రాంతాన్ని మురికివాడగా గుర్తించి గెజిట్ జారీ చేసిందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఒక్కో కుటుంబానికి 33.33 చదరపు మీటర్ల స్థలానికి పట్టాలు మంజూరు చేసినప్పటికీ, అవి పొరపాటున జారీ అయ్యాయని పేర్కొంటూ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. 2007 జనవరి 2న అర్ధరాత్రి సమయంలో పోలీసుల సహాయంతో నివాసితులను బలవంతంగా ఖాళీ చేయించి ఇళ్లను కూల్చివేసి, ట్రక్కుల్లో తరలించి అఫ్జల్‌సాగర్ ప్రాంతంలో వదిలివేశారని, అక్కడ కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. హైకోర్టు నియమించిన అడ్వొకేట్ కమిషనర్ కూడా ఇళ్ల కూల్చివేతపై నివేదిక సమర్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం తరపున న్యాయవాది స్పందిస్తూ, చట్టప్రకారమే ఆక్రమణలను తొలగించామని, బాధితులకు మెరుగైన ప్రాంతాల్లో పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. కొల్లూరు, కీసర రాంపల్లి, అమీన్‌పూర్, శంకరపల్లి, ఏదులనాగులపల్లి ప్రాంతాల్లో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని, పిటిషనర్లు కూడా కొల్లూరులో ఇళ్లు స్వీకరించేందుకు అఫిడవిట్ దాఖలు చేసి అంగీకరించారని కోర్టుకు వివరించారు.

ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలించిన హైకోర్టు, పిటిషనర్లందరికీ కొల్లూరులోని 2బీహెచ్‌కే ఇళ్లను తీర్పు ప్రతిని అందుకున్న రెండు నెలల్లోగా కేటాయించాలని ఆదేశించింది. సాధ్యమైనంత వరకు వారందరికీ ఒకే బ్లాక్‌లో లాటరీ పద్ధతిలో ఇళ్లు ఇవ్వాలని సూచించింది. కేటాయించే ఇళ్లకు నీరు, డ్రైనేజీ, లిఫ్ట్ తదితర అన్ని మౌలిక వసతులు కల్పించాలని, పూర్తి యాజమాన్య హక్కులతో పట్టాలు మంజూరు చేయాలని పేర్కొంది. అయితే ఐదేళ్లపాటు ఆ ఇళ్లను విక్రయించకుండా షరతు విధించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే మరణించిన పిటిషనర్ల కుటుంబ సభ్యులను గుర్తించి వారికి కూడా పునరావాస ప్రయోజనం కల్పించాలని, ఒక కుటుంబంలో ఒకరికి మించిన వారసులు ఉన్నా ఒకే కుటుంబంగా పరిగణించి ఒక ఇంటినే కేటాయించాలని ఆదేశించింది. కోర్టును ఆశ్రయించని భీంరావ్‌బాడ వాసులు కూడా తగిన ఆధారాలతో జిల్లా కలెక్టర్‌ను సంప్రదిస్తే వారి అర్హతను పరిశీలించి పునరావాసంపై నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచిస్తూ 2008 నాటి పిటిషన్‌పై విచారణను ముగించింది.

# సచివాలయ భద్రతపై డిజి ఆకస్మిక తనిఖీ

- విజిటర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ, ప్రవేశ ద్వారాలు, సిసిటివి పర్యవేక్షణపై సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో భద్రతా ఏర్పాట్లను డిజి స్వాతి లక్రా శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. సచివాలయంలో అమల్లో ఉన్న భద్రతా వ్యవస్థను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సచివాలయ ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద అమల్లో ఉన్న భద్రతా ఏర్పాట్లు, సందర్శకుల ప్రవేశ నియంత్రణ విధానం, విజిటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పనితీరును పరిశీలించారు. సందర్శకుల నమోదు, గుర్తింపు ధ్రువీకరణ, ప్రవేశ అనుమతుల జారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించి, ఎలాంటి లోపాలకు తావులేకుండా కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. సిసిటివి నిఘా వ్యవస్థ, కంట్రోల్ రూమ్ పనితీరు, భద్రతా సిబ్బంది అప్రమత్తత, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయానికి వచ్చే ప్రతి సందర్శకుడిపై పూర్తి వివరాలు నమోదు చేయడంతో పాటు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. అలాగే, భద్రతా సిబ్బంది విధి నిర్వహణ, సందర్శకుల తనిఖీలు, సిబ్బంది అప్రమత్తత, ప్రవేశ నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత కీలక కార్యాలయమైన సచివాలయంలో భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదని స్పష్టం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో సంబంధిత పోలీసు అధికారులు, భద్రతా విభాగం సిబ్బంది పాల్గొన్నారు. సచివాలయ భద్రతను మరింత బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టాలని డిజి స్వాతి లక్రా ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించిన తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లారెడ్డి సతీమణి మమత భౌతికాయానికి నివాళులు అర్పించిన రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రజా గాయకురాలు విమలక్క విమలక్క మల్లారెడ్డిని ఓదార్చి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



# 404 అప్పీళ్లను మూడు నెలల్లో పరిష్కరించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒకే వ్యక్తికి చెందిన వందలాది సమాచార హక్కు అప్పీళ్లను ఒకేసారి విచారణకు తీసుకురావడం సరైన విధానం కాదని పేర్కొంటూ, పిటిషనర్‌కు చెందిన 404 పెండింగ్ అప్పీళ్లను కేసుల వారీగా విచారించి మూడు నెలల్లోగా పరిష్కరించాలని తెలంగాణ సమాచార కమిషన్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జన తెలంగాణ రైట్స్ సొసైటీ కార్యదర్శి వి.శ్యాం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద ఈ ఆదేశాలు ఇచ్చారు పిటిషనర్ గతంలో దాఖలు చేసిన 404 అప్పీళ్లన్నింటికీ ఒకే రోజు నోటీసులు జారీ చేసి ఏకకాలంలో విచారణ చేపట్టడాన్ని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. అప్పట్లో ప్రతి అప్పీల్‌ను విడివిడిగా విచారించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, సమాచార కమిషన్ వాటిని అమలు చేయలేదని పేర్కొంటూ మరోసారి కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం, ప్రతి అప్పీల్‌కు విడిగా నోటీసులు జారీ చేసి, చట్టబద్ధంగా కేసుల వారీగా విచారణ నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తిచేసి పెండింగ్‌లో ఉన్న అన్ని అప్పీళ్లపై నిర్ణయం తీసుకోవాలని సమాచార కమిషన్‌ను ఆదేశిస్తూ పిటిషన్‌ను పరిష్కరించింది.

# సివిల్స్ ఆశావహులకు ‘రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం’

- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- గత రెండేళ్లలో 346 మందికి లబ్ధి
- సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సివిల్ సర్వీసెస్ మెయిన్స్‌కు సిద్ధమవుతున్న తెలంగాణ యువతకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది కూడా ‘రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం’ పథకాన్ని కొనసాగిస్తున్నట్లు సింగరేణి సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై, మెయిన్స్‌కు అర్హత సాధించిన తెలంగాణ ప్రాంతానికి చెందిన అర్హులైన ప్రతి అభ్యర్థికి సింగరేణి సంస్థ తరపున రూ.1 లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేస్తామని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, వాటిని పరిశీలించిన అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సింగరేణి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. సింగరేణి అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని తెలంగాణ యువత మరింత మంది సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించి రాష్ట్రానికి, దేశానికి సేవలందించాలని డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి ఆకాంక్షించారు. పథకం అమలులో భాగంగా 2024లో సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన 140 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించినట్లు తెలిపారు. వారిలో 20 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారికి మరో రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక సహాయం అందించగా, చివరకు ఏడుగురు సివిల్ సర్వీసెస్‌లో ఎంపికయ్యారని వివరించారు. గత ఏడాది ఈ పథకం కింద 206 మంది అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించగా, వారిలో 50 మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారని, చివరకు 20 మంది సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించినట్లు చెప్పారు. ఈ విధంగా గత రెండేళ్లలో మొత్తం 346 మంది అభ్యర్థులకు సింగరేణి సంస్థ ‘రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం’ పథకం ద్వారా ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించినట్లు డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి తెలిపారు.

# బొగ్గు గ్యాసిఫికేషన్‌లోకి సింగరేణి అడుగులు

- భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ పైలట్ ప్రాజెక్టుకు సన్నాహాలు
- పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖలో హైడ్రోకార్బన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీకాంత్ నాగులపల్లితో సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణిని బహుముఖంగా విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి ప్రవేశించే అవకాశాలను సింగరేణి సమగ్రంగా పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. సింగరేణి భవన్‌లో పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగులపల్లి శ్రీకాంత్‌తో జరిగిన సమావేశంలో కోల్ గ్యాసిఫికేషన్‌పై సింగరేణి చేపడుతున్న చర్యలను సిఎండి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో రోజుకు 400 టన్నుల సామర్థ్యంతో అమ్మోనియం నైట్రేట్ మెల్ట్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ అధ్యయనం నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు పెట్టుబడిపై రాబడి ఆశాజనకంగా లేదని, మరింత మెరుగుపరిచేందుకు ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడం, కేంద్ర ప్రభుత్వ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ వినియోగం, స్వదేశీ సాంకేతికత వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇదే విషయంపై తాల్చేర్, ఎంసిఎల్ బిహెచ్‌ఈఎల్, జేఎస్పీఎల్ తదితర కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను అధ్యయనం చేయడానికి ఈ నెలలో సింగరేణి అధికారుల బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. భీమారం, చెన్నూరు సౌత్, నైనీ ప్రాంతాల్లో సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్ అవకాశాలపై సాంకేతిక ఆర్థిక విశ్లేషణ కొనసాగుతోందన్నారు. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ విషయంలో కూడా బెల్లంపల్లి, రామగుండం ప్రాంతాల్లోని లోతైన బొగ్గు నిల్వల్లో ఐదు బ్లాక్‌లను గుర్తించినట్లు తెలిపారు. తొలి పైలట్ ప్రాజెక్టును బెల్లంపల్లి డీప్‌డ్ బ్లాక్‌లో చేపట్టేందుకు డ్రిల్లింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయని, సిఎంఐఎఫ్‌ఆర్ శాస్త్రవేత్తల సాంకేతిక మార్గదర్శకత్వంలో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని ఆయన వెల్లడించారు. సమావేశంలో డైరెక్టర్లు ఎల్‌వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), గౌతమ్ పోట్రు (పర్సనల్, ఫైనాన్స్), ఈడి (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జిఎం (కోఆర్డినేషన్,మార్కెటింగ్)టి.శ్రీనివాస్, జిఎం(పిపి) జి.దేవేందర్, జిఎం(బిజినెస్ డెవలప్‌మెంట్) రాందాస్, జిఎం(ఆర్‌అండ్‌డి) వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలి

- తెలంగాణ రాష్ట్ర గీతా పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** రాష్ట్ర ప్రభుత్వం గీతా కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని రాష్ట్ర గీతా పనివారాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. గీతా పనివారాల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సమితి సభ్యుల ముఖ్య నాయకుల సమావేశం భువనగిరి సిపిఐ పార్టీ ఆఫీసు ధర్మం భిక్షం భవన్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర గీతా పనివారాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశంలో అమరజీవి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకుడు అఖిల భారత గీత కార్మిక కార్మిక ఉద్యమ నిర్మాత బొమ్మగాని ధర్మభిక్షం నాయకత్వంలో రాష్ట్రంలో కల్లు గీత సొసైటీలు టిఎఫ్‌టిలు ఏర్పాటు చేయడంలో గీతా కార్మికులకు చెట్టు పన్ను త్రివిధ రకాల పన్నులు రద్దు కొరకు, గీత కార్మికులకు పెన్షన్స్ సౌకర్యాలకు, ఎక్స్‌గ్రేషియా కొరకు, కార్మికుల హక్కుల కొరకు, తాటి ఈత వనములు పెంచుకొనుటకు, జీవో 560 ప్రకారంగా ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమిని ఇచ్చే విధంగా గీత వృత్తిని ఆధునీకరించి గీత పరిశ్రమలు నెలకొల్పుటకు గీతా కార్మికుడు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడినచో ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, 50 సంవత్సరాల పైబడిన గీతా కార్మికులకు వృత్తి పెన్షన్ ఇవ్వాలని, ప్రతి జిల్లాలో నీరా కేంద్రాలను ఏర్పరచి పరిశ్రమగా రూపొందించాలని డిమాండ్ చేశారు. ఆయా జిల్లాల్లో పెండింగ్లో ఉన్న ఎక్స్‌గ్రేషియాలను వెంటనే చెల్లించాలన్నారు. గీతా కార్మికుల వృత్తి పెన్షన్ రూ.2000లను ఐదువేల రూపాయలుగా పెంచి ఇవ్వాలని, తాటిచెట్టుపై నుండి కింద పడి మరణించిన వారికి పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. గీతా కార్మికులకు చనిపోయిన కార్మికుడి వృత్తి పెన్షన్ వస్తే అతడు మరణించినచో అట్టి పెన్షన్ను భార్యకు వృత్తి పెన్షన్ వర్తింపచేయాలని భువనగిరి జిల్లాలో ఉన్న నందనంలోని నీరా పరిశ్రమ కేంద్రాన్ని ఆధునికరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర గీతా పనివారల సంఘం రాష్ట కార్యదర్శి బోలగాని సత్యనారాయణ జిల్లా గీతా పనివారల సంఘం అధ్యక్ష కార్యదర్శులు చాపల అంజయ్య, పబ్బు యాదయ్య, జిల్లా నాయకులు ఎర్ర రమేష్, పందుల యాదగిరి, బాలగోని సత్యనారాయణ, గాదెగాని మాణిక్యం, గుండు వెంకటేష్, తండా యాదయ్య, పుట్ట రమేష్ పాల్గొన్నారు.

# బోటు ప్రమాదంపై సిఎం దిగ్భ్రాంతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వియత్నాం పర్యటనకు వెళ్లిన తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు పర్యాటకులు బోటు ప్రమాదంలో మరణించారనే సమాచారంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులు ప్రయాణిస్తున్న బోటు ప్రమాదానికి గురైన ఘటనపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి, పూర్తి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి సంబంధించిన తాజా పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు సహాయక చర్యలను వేగవంతం చేయడానికి కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, వియత్నాంలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. ఈ ప్రమాదంలో తెలుగు వారు ఉన్నారని ప్రాథమిక సమాచారం అందిన నేపథ్యంలో వారి వివరాలను అత్యవసరంగా సేకరించాలని, క్షతగాత్రులకు అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయ చర్యలు చేపడుతుందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సమాచారం అందించడం, సహాయక చర్యల్లో సమన్వయం కల్పించడం కోసం ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం శనివారం వెల్లడించింది. బాధితుల కుటుంబ సభ్యులు సమాచారం కోసం కింది హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

**హెల్ప్‌లైన్ నంబర్లు:** 9885371189, 7997959754, 9989654807, 7997959779



## ‘నేడు’ నకిరేకల్ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి పర్యటన

### ఏర్పాట్లను పర్యవేక్షించిన ప్రభుత్వ విప్ వీరేశం

**ప్రజాపక్షం/రామన్నపేట** : నకిరేకల్ నియోజకవర్గంలో ఆదివారం రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గ పరిధిలో పలు కీలక అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేయనున్నారు. మంత్రి పర్యటనలో భాగంగా నార్కట్‌పల్లి మండలంలో ప్రజలు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనితో పాటు, ఎంతో ప్రాధాన్యత కలిగిన చిట్యాల భువనగిరి ప్రధాన రహదారి విస్తరణ పనులకు కూడా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే ప్రాంతీయ రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమాల అనంతరం రామన్నపేటలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సభకు నియోజకవర్గ నలుమూలల నుండి ప్రజలు,ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. పర్యటన విజయవంతం చేయడానికి నియోజకవర్గంలో చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను ఆయన శనివారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## జాప్యం లేకుండా దరఖాస్తులు

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గంలో తప్పుల్లేని పరిపూర్ణ ఓటరు జాబితా రూపకల్పన కోసం బూత్ లెవెల్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామం, మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు వినోభానగర్ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు విస్తృత సవరణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై ప్రజలను, సిబ్బందిని అడిగి ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించాలన్నారు. బీఎల్‌ఓల వద్ద పెండింగ్‌లో ఉన్న ఫారాలను ఎప్పటికప్పుడు పూర్తి చేసి ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కొత్తగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునే యువతకు, మార్పులు చేర్పుల కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ మరియు రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ‘సర్’ నెల రోజుల పాటు పొడిగించాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ




**ప్రజాపక్షం/చౌటుప్పల్** : ఓటర్లను చైతన్యం చేయడంలో అధికార యంత్రాంగం విఫలం చెందుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగొని సత్యనారాయణ అన్నారు. నేడు సిపిఐ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో నిర్వహిస్తున్న సర్‌లో చాలా మందికి ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని, ఫారాలు నింపడంలో సరైన అవగాహన లేక ఓటర్లు తెలిసి తెలియక పూర్తి చేసి ఇబ్బందులు గురి అవుతున్నారని. ఓటర్లను బిఎల్‌ఓలు తమ దగ్గరికే వచ్చి ఫారాలు తీసుకోవాలని చెబుతున్నారని, ఇంటింటికి తిరిగి ఫారాలు పంపిణి చేయడం లేదన్నారు. గ్రామ స్థాయిలో గ్రామ సభలు నిర్వహించి ఓటర్లకు సరైన అవగాహనా కల్పించే విదంగా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. సర్ ప్రక్రియ అనేది పారదర్శకంగా జరగాలి తప్ప బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే కుట్రగా చేయకూడదని డిమాండ్ చేశారు.ఓటర్లను గుర్తించడం ఆలస్యం వల్ల మరో నెల రోజులు పొడిగించి న్యాయమైన ఏ ఒక్కరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మున్సిపాలిటీ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, ఉడత రామలింగం, కొండూరి వెంకటేష్, దాసరి అంజయ్య, టంగుటూరు రాములు, రోషణగారి అంజయ్య, రొండి నర్సింహా, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, నీళ్ల బిక్షపతి, కాకి పాండు,కుంటి పాపయ్య, దాసరి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పెన్‌పహాడ్ మండలం మేఘ్యా తండ గ్రామ పంచాయితి పరిధిలోని గంగలి తండలో నిర్మిస్తున్న దేవాలయంకు తనవంతు సహకారంగా ఆర్థిక సహాయంను అందజేసి మాట్లాడారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని, దేవాలయాలు సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందించే కేంద్రాలన్నారు. అనంతరం మేఘ్యా తండ సర్పంచ్ భూక్య రాజునాయక్ మాట్లాడుతూ దేవాలయ భూమి పూజకు హాజరైన సమయంలో పటేల్ రమేష్ రెడ్డి దేవాలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పి తన మాట నిలబెట్టుకున్నారని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాలోతు వరలక్ష్మి వెంకన్న, సిద్ధు, శోభన్, మురళి, రమేష్ పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్, కోదాడలను తెలంగాణ అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతాం

### ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకెళ్తాం

### మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల అభివృద్ధి తనకు రాజకీయ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసానికి ఇచ్చే జీవనాంత కృతజ్ఞత అని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు నియోజకవర్గాలను తెలంగాణలోనే అత్యుత్తమ మౌలిక వసతులు, ఆధునిక విద్య, వైద్యం, శాశ్వత సాగునీటి వసతులు కలిగిన ఆదర్శ నియోజకవర్గాలుగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదికన పనిచేస్తోందని స్పష్టం చేశారు. రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి రూ.21 కోట్ల వ్యయంతో కోదాడ లో నూతన ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి, హుజూర్‌నగర్ బస్టాండ్ ఆధునికరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. హుజూర్‌నగర్, కోదాడ ప్రజలతో తన బంధం ఎన్నికలతో ఏర్పడింది కాదని, మూడు దశాబ్దాలకు పైగా విశ్వాసం, అప్యాయత, పరస్పర నమ్మకంతో నిర్మితమైన అనుబంధమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆరుసార్లు శాసనసభకు, ఒకసారి లోక్‌సభకు తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి అభివృద్ధినే మార్గంగా ఎంచుకున్నానని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక అని పేర్కొన్న మంత్రి రెడ్లకుంట, ఆర్9, శాంతినగర్ ఎత్తిపోతల పథకాలతో పాటు నాగార్జునసాగర్ ఆయకట్టు మేజర్, మైనర్ కాలువలకు లైనిగ్ పనులు చేపట్టి ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల, 50కోట్లతో జవహర్ నవోదయ పాఠశాల, రూ.26 కోట్లతో సిటి స్కాన్ సౌకర్యంతో కూడిన 100 పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి, యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు అందించే అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోదాడ పురపాలక సంఘాన్ని ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, రోడ్లు,డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుద్యం, పట్టణ సుందరీకరణ వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. హుజూర్‌నగర్, కోదాడ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలు మాత్రమే కాదని, ప్రజాస్వామ్య విలువలకు అండగా నిలిచిన రాజకీయ చైతన్యానికి ప్రతీకలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల పవార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగుల నిరసన

**ప్రజాపక్షం/నందికొండ:** టీవీవీపీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగార్జునసాగర్ కమల నెహ్రూ ఏరియా ఆసుపత్రి ఎదుట శనివారం ఉద్యోగులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా తెలంగాణ వైద్య ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి వడపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, టీవీవీపీకి వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించి రీడిప్లాయ్‌మెంట్, ప్రమోషన్లు, రెగ్యులరైజేషన్, రీయింబర్స్‌మెంట్ బిల్లులు,సాధారణ బదిలీలకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించి కొత్తగా ఏర్పాటు చేసిన ఆసుపత్రులకు అవసరమైన క్యాడర్ నియమిస్తూ పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రిజిస్టర్లను సంబంధిత ఆసుపత్రులకు పంపించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులను ముందుగానే జారీ చేసి వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, డాక్టర్లు చక్రవర్తి, శ్రీకాంత్ రెడ్డి,శ్రీదేవి,నిర్మల,ధనలక్ష్మి, కిషోర్, శ్రావణ్, వేణు,మధు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/డిండి** : కార్మికుల సమస్యల పరిష్కారానికై ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం డిండి పట్టణంలోని ఎలకుర్తి జైపాల్ గార్డెన్‌లో జరిగిన ఏఐటీయూసీ డిండి మండల 8వ మహాసభకు హాజరైన దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, స్వాతంత్రానికి పూర్వమే కార్మిక చట్టం, ఫ్యాక్టరీల చట్టం, పారిశ్రామిక విధానాల చట్టం, కనీస వేతన చట్టం సాధించుకోవడం జరిగిందన్నారు. నాడు సామ్రాజ్య వాద పెట్టుబడిదారుల చేతుల్లో నలిగిపోయిన కార్మిక వర్గానికి దిక్కూచిగా నిలిచి అనేక ఉద్యమాల ద్వారా కార్మిక చట్టాలను హక్కులను సాధించిన ఏకైక సంఘం ఎఐటియుసి అని అన్నారు. రాష్ట్ర ఏర్పడి 12 ఏళ్లు అవుతున్నా నేటికి రాష్ట్రంలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు మారలేదని కనీస వేతనం లేక పిఎఫ్, ఈఎస్‌ఐ అమలు నోచుకోక శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రభుత్వ హాస్టల్లో వంట కార్మికులు , అవుట్‌సోర్సింగ్, మిషన్ భగీరథ, హెచ్ఎండబ్ల్యూఎస్ ఆటో డ్రైవర్స్, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు, గ్రామ పంచాయతీ, స్కావేజర్లు, కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని కార్మికులపై ప్రభుత్వాలు సవితి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. అనంతరం మండల నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి కనకాచారి, లింగమయ్య, దేవయ్య, జవహర్‌లాల్, హుస్సేన్, వినయ్, వెంకటయ్య, సాయిలు, చెన్నయ్య, భారతి, తిరుపతయ్య, అలివేలు, లాబాను, గంగమ్మ, బాలరాజు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలు పరిష్కరించకుండా పాలకుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : కార్మికుల హక్కుల పరిరక్షణకు శ్రమ చట్టాలు అమలు, కనీస వేతనాల పెంపు కోసం కార్మికుల ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఏఐటీయూసీ నాలుగవ మహాసభల అరుణ పతాకాన్ని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొలగాని సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ మండల మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలు అమలవుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచే చర్యలు ఆందోళన కరమని పేర్కొన్నారు. అదేవిధంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఇమ్రాన్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కనీస వేతనాలు, ఈఎస్‌ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాలను తగ్గించి శాశ్వత ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ సీపీఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, సర్పంచ్ ముత్యాల అంజయ్య, దుబ్బాక సంజీవ, మంచాల సైదులు, పూలమోని గిరి, జనగాం శంకర్, పాలకూర లక్ష్మ మ్మ, మంచాల గాలయ్య, లోడే యాదయ్య,మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, ట్రాక్టర్ యూనియన్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఐఎన్‌టియుసి నుండి ఎఐటియుసిలో చేరిక..**

సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో జరిగిన ఏఐటీయూసీ మండల మహాసభల సందర్భంగా ఐఎన్టీయూసీ నుండి పూలమాని శంకర్, దుర్గం ప్రభాకర్‌లు ఎఐటియుసి చేస్తున్న ఉద్యమాలకు ఆకర్షితులై చేరుతున్నట్లు ఎఐటియుసి జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో చేరారు.

## ఖరీఫ్ పంటల ప్రణాళికలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున పంటల ప్రణాళికలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జూలై మొదటి రోజుల్లో వర్షపాత ధోరణి సాధారణం కంటే చాలా తక్కువగా నమోదైందన్నారు. కాబట్టి మారుతున్న వర్షపాత పరిస్థితి, సాగునీటి లభ్యతను బట్టి రైతులు విచక్షణతో కూడిన పంట ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాకు సాగునీరు అందించే ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో ప్రస్తుత నీటి లభ్యతలో కూడా నీటి నిల్వలకు తగ్గువగా ఉన్నాయని వివరించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌లో 312.05 టిఎంసిల నీటి సామర్థ్యం కాగా 138.21 టిఎంసిల నీరు మాత్రమే ఉందన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజ్2లో నిల్వ సామర్థ్యం 24.034 టిఎంసిలు కాగా ప్రస్తుతం 5.70 టిఎంసిలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. మూసి ప్రాజెక్టుకు 3.54 టిఎంసిల సామర్థ్యం కాగా ప్రస్తుతం నిల్వ ఖరీఫ్ సాగునీటి అవసరాలను తీర్చడానికి మాత్రమే సరిపోతుందన్నారు. అక్కడక్కడ కురిసే విడివిడి వర్షాల ఆధారంగా రైతులు విత్తనాలు చల్లడం లేదా నాట్లు వేయడం వంటివి చేయవద్దని సూచించారు. తక్కువ సాగునీరు అవసరమయ్యే స్వల్పకాలిక వరి రకాలైన ఆర్ఎన్ఆర్, హెచ్ఎమ్‌టి, జెజిఎల్, జైశ్రీరామ్, డబ్ల్యుజిఎల్44, కెఎన్ఎమ్1638, కెఎన్ఎమ్7715 వంటి రకాలను సాగు చేయాలన్నారు. సాగునీటి లభ్యత అనిశ్చితంగా ఉన్న చోట వరికి బదులుగా పప్పు ధాన్యాలు, తక్కువ నీరు అవసరమయ్యే ఇతర పంటలు లేదా తగిన కూరగాయల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

## ఏసురత్నం మృతికి.. నేతల నివాళులు



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బావ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంటేపాక ఏసురత్నం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వేముల వీరేశం,మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేతతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు ఏసురత్నం భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పాడెను మోసి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏసురత్నం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జి మంజుల మాధవరెడ్డి,చామల శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందాల ప్రమీల,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజ్,వివిధ పార్టీల నేతలు, గాదగోని కొండయ్య,లింగాల వెంకన్న,పన్నాల రాఘవరెడ్డి,రాచకొండ వెంకన్న గౌడ్, వంటేపాక వెంకటేశ్వర్లు, వెంకటాద్రి పాల్గొన్నారు.



## 117 కాదు 17 స్థానాలు కూడా గెలువలేరు

### మాజీ రాజ్యసభ సభ్యులు లింగయ్య యాదవ్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో 117 కాదు ఉత్త 17 స్థానాలు కూడా గెలవలేరని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన సభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రులను ముఖ్యమంత్రి విమర్శించడం పట్ల శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు. ఏదైనా సభ జరిగితే మీరు చేసింది, చేయాల్సింది, ఇచ్చిన హామీలు అమలు చేసినవి, అమలు చేయాల్సినవి చెప్పాలి తప్ప సిఎం స్థాయిని మరచి బజారు వ్యక్తిగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అసలు కానే కానీ డిలిమిటేషన్‌లో 185 స్థానాలు అవుతాయంటూ అందులో తామే 117 గెలుస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీ దొంగ తెలివి తేటలు ప్రజలకు అర్థమయ్యాయని వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో నువ్వు పడుతున్న ఫ్రస్టేషన్ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టిన కెసిఆర్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్‌ను ఆన్‌చేసి రైతులకు నీళ్ళు ఇవ్వకుండా ఆంధ్రకు 100 టిఎంసిల నీళ్ళు మలిపావని ఆరోపించారు. బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దేవుళ్ళ మీద ఒట్టు వేయడం పరిపాటిగా మారిందని ఆయన ఒట్టు వేయని దేవుడు ఉన్నాడా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ జడ్‌పిటిసి జీడి బిక్షం పాల్గొన్నారు.

## కామ్రేడ్ ఉజ్జిని యాదమ్మ మృతి బాధాకరం



**ప్రజాపక్షం/డిండి:** సిపిఐ గొనకోల్ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి ఉజ్జిని యాదమ్మ మృతి బాధాకరం అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం గోనకోల్ గ్రామంలో యాదమ్మ పార్థివ దేహంపై సిపిఐ ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, డిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి శైలేష్, గ్రామశాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ డిండి మండల కార్యదర్శి బబ్లు, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆగని అక్రమ ఇసుక దందా...

### అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో ఇసుక తరలిస్తే చర్యలు

**ప్రజాపక్షం/డిండి:** అక్రమ సంపాదన కోసం రాత్రి వేళల్లో ట్రాక్టర్ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ఒక్కో ట్రాక్టర్ ఇసుక 5వేల నుండి 6వేల వరకు అక్రమ సంపాదన కోసం అటు ప్రజలను మోసం చేస్తూ మరో వైపు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ఎలాంటి అనుమతులు అక్కరలేకుండా దుందుబీ వాగు నుండి రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న గోనబోయినపల్లికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు డిండి ఎస్ఐ బాలకృష్ణ శనివారం తెలిపారు. మరోవైపు మండలంలోని కందుకూరు వాగు నుండి చెక్ డ్యాం పేరుతో శనివారం ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండల ప్రజలందరూ అవసరాల మేరకు ఇసుకను ప్రభుత్వం ఏర్పాటు చేసిన మన ఇసుక వాహనం యాప్‌లో మాత్రమే బుక్ చేసుకొని తక్కువ ధరకు మాత్రమే ఇసుక పొందాలన్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలుంటాయని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

## పిఆర్‌టియు సభ్యత్వ నమోదు

**ప్రజాపక్షం/మునగాల:** ఉపాధ్యాయల సమస్యల పరిష్కారం ఒక్క పిఆర్‌టియు యూనియన్‌తోనే సాధ్యమవుతుందని పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల నరేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పిఆర్‌టియు సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్‌టియు మండల అధ్యక్షులు అడిదల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల మధుబాబు ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు పప్పుల వీరబాబు, కె.వీరబాబు, ఓరుగంటి రవి, కొల్లు వెంకటేశ్వరరావు, ఊటుకూరి రవీందర్‌రెడ్డి, బజ్జూరి శ్రీకాంత్‌రెడ్డి, సతీష్, శ్రీరామ్ శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, శంకర్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు రామకృష్ణ, బిఎస్‌గౌడ్, జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూనిక్ హారర్-కామెడీ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్-ప్రొడక్షన్ చివరి దశలో ఉంది.

# రీల్

## ఆగస్టు 7న 'కొరియన్ కనకరాజు'



వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూనిక్ హారర్‌కామెడీ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'కంసరాజా' కూడా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది.చిత్ర నిర్మాతలు ఆగస్టు 7వ తేదీన ప్రపంచవ్యాప్త థియేట్రికల్ విడుదల తేదీగా అధికారికంగా ఖరారు చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్ ఆటిట్యూడ్, ఇంటెన్స్ ని ప్రజెంట్ చేస్తోంది. వరుణ్ తేజ్ ఒక చేతిలో రక్తం మరకలున్న కత్తి, మరో చేతిలో గ్రెనేడ్‌లతో కుర్చీలో హుందాగా కూర్చుని, రఫ్ అండ్ అల్ట్రా స్టైలిష్ అవతార్లో కనిపిస్తున్నారు. భయపెట్టే కొరియన్ గ్యాంగ్‌స్టర్ గ్యాంగ్ చుట్టుముట్టి ఉన్నప్పటికీ, అతను ఏమాత్రం బెదరనట్లు కనిపించారు. కత్తి చివరి నియాన్ లైటింగ్ ఫ్లేర్ డ్రాప్, గ్యాంగ్‌స్టర్ నేపథ్యం మరింత ఆసక్తిని పెంచింది. రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, కమెడియన్ సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. మనోజ్ రెడ్డి కటసాని డీవోపీగా పని చేస్తున్నారు. చిత్రానికి సంగీతం: ఎస్ థమన్, డిఓపి : మనోజ్ రెడ్డి కటసాని.



## 'ఓ.. సుకుమారి' హిలేరియస్ ట్రైలర్ రిలీజ్

తిరు వీర్, ఐశ్వర్య రాజేష్ కలిసి నటిస్తున్న ఈ చిత్రం 'ఓ.. సుకుమారి' ఇప్పుడు. రొమాన్స్, కామెడీ, పల్లెటూరి అందాలతో కంప్లీట్ వినోదభరితంగా నిర్మిస్తున్నారు. భరత్ దర్శన్ రచన, దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని, 'శివం భాజే' విజయం తర్వాత గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. అనిల్ రావిపూడి ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ చేశారు. దామిని గురించి ఊరంతా భయపడుతూ ఉంటుంది. కారణం ఏమిటంటే... ఆమెను ఎవరైనా తాకితే వారికి కరెంట్ షాక్ తగులుతుంది. ఈ విచిత్రమైన రహస్యాన్ని దాచిపెట్టి ఆమెకు హీరోతో పెళ్లి చేస్తారు. పెళ్లి తర్వాత అసలు విషయం తెలిసిన హీరో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడు? ఈ సమస్యను భార్యాభర్తలు కలిసి ఎలా ఎదుర్కొన్నారు? చివరకు వారి జీవితంలో ప్రేమ, ఆనందం ఎలా చోటుచేసుకున్నాయి? అన్నదే సినిమా ప్రధాన కథాంశం. దర్శకుడు భరత్ దర్శన్ ఈ విభిన్నమైన కాన్సెప్ట్‌ను వినోదాత్మకంగా చూపిస్తూ, ఎమోషన్స్‌ను చక్కగా మేళవించినట్లు ట్రైలర్ ప్రజెంట్ చేస్తోంది.తిరు వీర్ మరోసారి కొత్త తరహా కథను ఎంచుకుని, అమాయకమైన పల్లెటూరి యువకుడి పాత్రలో సహజంగా కనిపించారు. ఐశ్వర్య రాజేష్ కూడా తన పాత్రలో ఆకట్టుకుంటూ, అందం, నటన రెండింటితో అలరించారు. మురళీధర్ గౌడ్, విష్ణు ఓయ్, ఝాన్సీ, ఆమని, ఆనంద్కొటి జయరామ్ తదితరులు తమ పాత్రలతో వినోదాన్ని మరింత పెంచారు.సినిమాటోగ్రాఫర్ సీహెచ్ , భరత్ మంచిరాజు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, 'బలగం' ఫేమ్ తిరుమల ఎం. తిరుపతి ప్రొడక్షన్ డిజైనర్గా పని చేయగా, శ్రీ వరప్రసాద్ ఎడిటింగ్ నిర్వహించారు. అను రెడ్డి అక్కటి కాస్ట్యూమ్స్ డిజైన్ చేయగా, పూర్ణాచారి పాటలకు సాహిత్యం అందించారు.'ఓ.. సుకుమారి' ట్రైలర్ కామెడీ, ప్రేమ, భావోద్వేగాలను కలిపిన వినోదాత్మక ఫ్యామిలీ ఎంటర్టైనర్గా సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రం 17న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆర్ట్ డైరెక్టర్: తిరుమల ఎం తిరుపతి, ఎడిటర్: శ్రీ వరప్రసాద్, కాస్ట్యూమ్ డిజైనర్: అను రెడ్డి , లిరిక్ రైటర్: పూర్ణాచారి, ఫైట్స్: అంజి, కొరియోగ్రఫీ: జెడి మాస్టర్.

# ఆ తప్పు ఇప్పుడు చెయ్యను : నటనకే నా ప్రియారిటీ

**రోల్స్ అన్నీ నా ఇష్ట ప్రకారమే ఎంపిక 'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో హీరోయిన్ ఎస్తర్ నోరోన్హా**



దర్శకుడు తేజ తెరకెక్కించిన చిత్రం 'వెయ్యి అబద్ధాలు'. ఈ చిత్రం ద్వారా తెలు తెరకు పరిచయమైన హీరోయిన్ ఎస్తర్ నూరోన్హా. సెలె క్రిస్ గా తనకు నచ్చిన పాత్రలను మాత్రమే సెలక్ట్ చేసుకుని దూసుకెళ్తున్న ఎస్తర్ ముక్కు సూటిగా మాట్లాడుతుంది. ఉన్నది ఉన్నట్లు కుండా బద్దలు కొట్టి మరీ చెప్తుంది. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషలలో సినిమాలు చేసిన ఎస్తర్ మంచి గాయని కూడా. నటి, గాయని, డ్యాన్సర్ ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి ఎస్తర్ ను అభినందించడం అతిశయోక్తి కాదు. తడైనా శైలి లో సినిమాలు చేస్తున్న ఎస్తర్ ఇటీవల హైదరాబాద్ కు వచ్చిన నేపథ్యంలో ప్రజాపక్షం పలకరించింది. చక్కగా తెలుగులో మాట్లాడే ఎస్తర్ చాలా విషయాలు ప్రజాపక్షంతో పంచుకున్నారు.

**ప్రశ్న : మీ చిన్నతనంలోని విషయాలు గుర్తున్నాయా ?**

ఎస్తర్ : నేను పుట్టి పెరిగింది గోవా. నేనంటే మా ఇంట్లో చాలా ఇష్టం. నేను అందరితో కలిసి ఉండేదాన్ని కాదు. ఫ్యామిలీ ఫంక్షన్ కు వెళ్లినా కూడా నేను ఎక్కువగా పిల్లలతో కలిసేదాన్ని కాదు.నేను చిన్నప్పుడు ఆటో కూడా ఎక్కలేదు. బస్సు కూడా ఎక్కలేదు. ఎక్కడికి వెళ్లినా కారులోనే, దగ్గర అయితే నడిచి వెళ్లేదాన్ని కానీ ఏ రోజూ ఆటో బస్సు ఎక్కలేదు.

**ప్రశ్న : మల్టీ టాలెంటెడ్ కదా మీరు .... దేనికి ప్రాధాన్యత ఇస్తారు ?**

ఎస్తర్ : గోవాలో నేను సింగర్ ను. తెలుగులో యాక్టర్‌ను . సింగింగ్ , యాక్టింగ్, డ్యాన్సింగ్ ఇలా అన్ని చెయ్యగలను. కాకపోతే అనుకోకుండా వచ్చిన ఛాన్స్ యాక్టింగ్. గోవాలో నను స్టేజిమీద పిలిచినప్పుడు తెలుగులో నటిగా పిలుస్తుంటే చాలా గర్వాంగా ఉంటుంది. అయితే నేను యాక్టింగ్ మీదనే ఫోకస్ చేస్తున్నాను. ఎందుకంటే చాలా భాషల్లో నటిగా ఎస్టాబ్లిష్ అయ్యాను. తెలుగు ప్రేక్షకులు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. చాలా సినిమాలు చేస్తున్నాను కాబట్టి నేను ఖచ్చితంగా యాక్టింగ్ కే ప్రాధాన్యత ఇస్తాను. ఖచ్చితంగా సినిమాలు చేస్తూనే ఉంటాను.

**ప్రశ్న : సంస్కార్ కాలనీ , ఎల్‌జిబిటి లాంటి సినిమాలు ఒక రకమైన బ్రాండ్ మీ మీద పడుతుంది కదా ?**

లేదండి ...ఎవరు ఏం అనుకుంటారో అనేది నేను పెద్దగా పట్టించుకోను. సంస్కార్ కాలనీ , ఎల్‌జిబిటి సినిమాల్లో రోల్స్ వచ్చినప్పుడు డైరెక్టర్ సునీల్ రెడ్డి గారు నను అడిగారు. నువ్వు ఈ రోల్స్ కు ఒప్పుకోకపోతే నేను వేరే వాళ్ళను చూసుకుంటా కానీ ఫస్ట్ ప్రియార్టీ మీకే అని చెప్పి కథ నాకు చెప్పినప్పుడు నేనే ఈ రోల్స్ ఒప్పుకున్నాను. ఇక మాట్లాడేవారు రకరకాలుగా మాట్లాడుతూనే ఉంటారు . కాబట్టి నేను రూమర్స్ గురించి నేను పెద్దగా పట్టించుకోను.

మంచి , చెడు రెండు మనలోనే ఉంటాయి.

**ప్రశ్న : తెలుగు చాలా బాగా మాట్లాడుతున్నారు...నేర్చుకున్నారా?**

ఎస్తర్ : అవునండి... తెలుగు నేర్చుకున్నాను. నాకు ఇక్కడే ప్రేమ లభించింది. ఇక్కడే నాకు స్టార్ డం వచ్చింది. కాబట్టి నేను ఏ భాషలో పని చేస్తున్నానో ఆ భాషా నేర్చుకోవాలనేది నా ఆశయం. అందుకే నేర్చుకున్న. భాషా నేర్చుకుంటే నాకే మంచిది కదా. యాక్టింగ్ ఛాన్స్ అనుకోకుండా వచ్చింది కాబట్టి యాక్టింగ్ ను సీరియస్ గా తీసుకున్నాను. అందుకే బాషా నేర్చుకున్నాను. మాట్లాడుతున్నాను. తెలుగు బాషా మాట్లాడితే ఖచ్చితంగా ప్రతి అక్షరం అర్థం తెలుస్తుంది కదా. ఇక్కడ ఉప్పు తిని, ఇక్కడ సంపాదించి తెలుగు కొంచెం కొంచెం వచ్చు అని యాక్టింగ్ చేస్తూ మాట్లాడే వాళ్ళను మీరు ఎంతో మందిని చూసి ఉంటారు.

**ప్రశ్న : మీకు తెలుగు సినిమాల్లో రావలసినంత గుర్తింపు రావడం లేదని భావిస్తున్నారా ?**

ఎస్తర్ : నేను సోషల్ సైన్సెస్, సైకాలజీ చదివాను. కాబట్టి ఈ విషయాన్ని నేను పెద్దగా ఫీలింగ్ లేదు. ఎందుకంటే నేను నిజాయితీగా ఉంటాను. నిజాయితీకి ప్రాధాన్యత ఇస్తాను. నాకు రావలసినంత గుర్తింపు ఎందుకు రాలేదు...మీరందరునన్ను గుర్తిస్తున్నారుకదా. మీరందరు ఇంటర్వ్యూ తీసుకుంటున్నారు. మీతో నేను మాట్లాడుతున్న అంటే నాకు గుర్తింపు మీరు ఇస్తున్నట కదా .

కాకపోతే మన దగ్గర జెన్యూనిటీని తక్కువగా చూస్తాం. వీడు జెన్యూన్ గా ఉన్నాడు అంటే అతనితోనే ఎదో ప్రాబ్లమ్ ఉంది అనే సమాజం మనది.

**ప్రశ్న : 'యస్'' చెప్పకపోతే సినిమా ఛాన్స్ రావు అంటారు ? నిజమేనా?**

ఎస్తర్ : ఇది తప్పు... అందరి విషయంలో ఇది జరగకపోవచ్చు. నాకు కూడా ఎప్పుడు అనుభవం కాలేదు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే నేను సినిమాలు వదులుకుంటాను తప్ప యస్ అని చెప్పే ప్రసక్తే లేదు. ఇది కాకపోతే దేవుడు నాకు ఇంకో దారి చూపిస్తాడు. నేను ఇదే నమ్మి పని చేస్తాను .

**ప్రశ్న : రెండో పెళ్లి ఎప్పుడు చేసుకుంటున్నారు ?**

ఎస్తర్ : గతంలో నేను ఒక తప్పు చేశాను ...ఇప్పుడు కూడా అలాంటి తప్పు చెయ్యదలచుకోలేదు. ఇంకో రెండేళ్లలో చేసుకోవాలని ఆలోచిస్తున్నాను. తగిన వాడు దొరికితే చూద్దాం. నేను చదువుకునేతప్పుడు కొంతమంది నా ఫ్రెండ్స్ కు లవ్ అఫైర్స్ ఉండేది. ఆ గిఫ్ట్ ఇచ్చాడని, ఈ గిఫ్ట్ ఇచ్చాడని చెప్పేవారు. అయితే వీళ్లకు ఇదే పనా? అనుకునే దాన్ని. నాకు ఇరవై రెండేళ్లు ఉన్నప్పుడు ఎవరైనా దొరక్కపోతారా అని చూశాను. దొరికారు కానీ వాళ్ళ బిహేవియర్ నచ్చక నేను లవ్ కు దూరంగా ఉన్నాను. ఇరవై నాలుగు ఏళ్ళు వచ్చినప్పుడు నాకు ఇంకా ఎవరూ దొరకడం లేదు అని అనుకున్నారు. బహుశా ఆ ఆతృత, కాబట్టి అలాంటి తప్పుడు ఇప్పుడు చెయ్యను. ఎందుకంటే ఇప్పుడు నేను ఏంటనేది నాకు బాగా అర్థమైంది. అప్పుడు నాకు తెలియక చేసిన పొరపాటు. నేను ఒక అమ్మగా అవసరమైతే ఎవరినైనా దత్తత తీసుకుంటాను.

## అసూయగా ఉంది : లెనిన్ 'సక్సెస్ మీట్' లో నాగార్జున



లెనిన్ సినిమా సక్సెస్ కోసం పని చేసిన తీరు చూస్తే నాకు అసూయగా ఉందని హీరో అక్కినేని నాగార్జున వ్యాఖ్యానించారు. అన్నమయ్య సినిమా రిలీజ్ తరువాత సమయంలో కూడా నేను తిరుమల తిరుపతి శ్రీవారి వద్దకు వెళ్లి మొక్కినా, ఎప్పుడు తనకు ఫలానా కావాలని ఆడాలేదని, కానీ ఈ సారి మొదటి సారి నా కొడుక్కు బ్లాక్ బస్టర్ హిట్ ఇవ్వమని శ్రీవారిని వేడుకున్నానని చెప్పారు. శనివారం జరిగిన లెనిన్ సక్సెస్ మీట్ లో నాగార్జున మాట్లాడారు. మొన్న తండేల్ , ఇప్పుడు లెనిన్ రెండు హిట్లు రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఇద్దరు నాకు రెండు కళ్ళు అని నాగార్జున వ్యాఖ్యానించారు. లెనిన్ సినిమాను ఎంతగానో ప్రేమించి పని చేశారు. వీళ్ళు చేసిన పని తీరు చూస్తుంటే తనకు ఈర్ష్య కలుగుతోందని తెలిపారు. ఈ సినిమాకు అడిగిన వెంటనే వాయిస్ ఓవర్ ఇచ్చిన తారక్ (జూనియర్ ఎన్టీఆర్) కు ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలిపారు. డైరెక్టర్ నందును ఎక్కువ సార్లు కలిశానన్నారు. డైరెక్టర్ నందు, ఎడిటర్ ఒక సైకోలాగా పని చేశారని అన్నారు. ఇంటికొచ్చి నందు సీన్స్ గురించి చర్చించేవాళ్లమన్నారు. హిట్ రావడం లేదు అని అఖిల్ రెగ్యులర్ గా అనేవాడు ఇప్పుడు ఆ బాధ లేదని చెప్తున్నాను. ఇక నుంచి కొత్త లైఫ్ ఉంటుంది అఖిల్ కు అని చెప్పారు.

## 'జననాయగన్' సినిమాకు 'ఏ' సర్టిఫికెట్




తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన తాజా చిత్రం 'జననాయగన్'. విజయ్ ముఖ్యమంత్రి కాకముందు విడుదల కావలసిన ఈ సినిమా ఆగిపోయింది. ఇప్పుడు ఈ సినిమాకు విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సినిమాకు సంబధించిన సెన్సార్ కార్యక్రమాలు కూడా ఇటీవలే పూర్తయాయ్యి. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ లభించింది. అంటే పద్దెనిమిదేళ్లు నిండిన వారు మాత్రమే ఈ సినిమాకు వెళ్లాల్సి ఉంటుంది. విజయ్ సరసన మమిత బైజు, పూజ హెగ్డే హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇతరపత్రాల్లో బాబీ డియోల్, మోనిష బ్లేస్సి, ప్రియమణి, ప్రకాష్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పొలిటికల్ పిక్చర్ గా తెరకెక్కిన ఈ సినిమాకు హెచ్. వినోద్ దర్శకత్వం వహించారు. వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని నిర్మించారు. చిత్రానికి సంబధించిన అన్ని పనులు పూర్తి చేసి త్వరలోనే విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# రామ మందిరం కేసుపై మౌనమెందుకు?

**ప్రధాని మోదీకి సిపిఐ ప్రశ్న**



**న్యూఢిల్లీ:** అయోధ్యలోని రామ మందిరం విరాళాల చోరీ వ్యవహారంలో జ్యుడిషియల్ విచారణ జరిపించాలన్న తన డిమాండ్‌ను సీపీఐ పునరుద్ఘాటించింది. ఈ భారీ కుంభకోణంపై కేంద్రం, బీజేపీ, ప్రధాని మోదీ మౌనాన్ని ప్రశ్నించింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో అయోధ్య కుంభకోణంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. కేవలం రాజీనామాలు చేయించి చేతులు దులిపివేసుకుంటే సరిపోదని దుయ్యబట్టారు. 'విశ్వాసమే... ప్రజల్లోని నమ్మకాన్ని మోసం చేస్తున్నది. విశ్వాసాన్ని నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. ప్రధాని మోదీ మౌనం కొనసాగుతోంది. ఇప్పటివరకు ఆయన పెదవి విప్పలేదు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా ఈ అంశంపై ఒక్క మాటైనా మాట్లాడలేదు' అని డి.రాజా అన్నారు. 2024 ఒడిశా అసెంబ్లీ ఎన్నికలప్పుడు జగన్నాథ ఆలయ రత్నబంధార్‌లో చోరీపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.... ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారు అని డి.రాజా నిలదీశారు. ముందు నుంచి ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నదన్నారు. ఈ విచారణ పూర్తిస్థాయిలో పారదర్శకంగా జరగాలని, ఎవరూ తప్పించుకునే పరిస్థితి ఉండకూడదని, రాజీనామాలతో సమాధానం లభించిందని వ్యాఖ్యానించారు. కేవలం సిబ్బందిని మార్చడం వల్ల ప్రజల్లో దెబ్బతిన్న విశ్వాసాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించలేరని దుయ్యబట్టారు. పరిపాలన వైఫల్యాలకు తాజా వ్యవహారం అద్దంపడుతోందని విమర్శించారు. అదే సమయంలో పార్టీ అధ్వర్యంలో జరగబోయే దేశ వ్యాప్త పాదయాత్రలు, ప్రచారోద్యమం గురించి వెల్లడించారు. మోదీ సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఉద్దేశంగా మార్పు అనివార్యం నినాదంతో ముందుకెళుతున్నట్లు డి.రాజా చెప్పారు. జీవనోపాధి, నిరుద్యోగం, గ్రామీణ అనిశ్చితి, కార్మికులురైతులు, యువత విద్యార్థులు మహిళల సమస్యలను లేవనెత్తుతామని వెల్లడించారు. సెప్టెంబరు 1వ తేదీన ఢిల్లీ రామ్ లీలా మైదానంలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి హామీ చట్టం రద్దు వంటి అంశాలను ప్రస్తావించారు. కొత్త ఉపాధి పథకం రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని అన్నారు. దీనిని అమలు చేయడం రాష్ట్రాలకు తలకు మించిన భారమే అవుతుందన్నారు. ఎంజీఎన్ఆర్‌జీఏ పునరుద్ధరణకు డిమాండ్ చేశారు.

# ఫిన్లాండ్‌లో విషాదాంతం..

**సముద్రంలో హైదరాబాద్ విద్యార్థి మణిదీప్ రెడ్డి మృతదేహం గుర్తింపు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫిన్లాండ్‌లో గత రెండు నెలలుగా అదృశ్యమైన హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి మణిదీప్ రెడ్డి కేసు విషాదాంతమైంది. సముద్రంలో లభ్యమైన మృతదేహం మణిదీప్ రెడ్డిదేనని ఫిన్లాండ అధికారులు ధృవీకరించారు. ఈ ఘటనలో ఎలాంటి నేర అనుమానాలు లేవని అక్కడి పోలీసులు ప్రాథమికంగా వెల్లడించారు. ఈ వార్తతో హైదరాబాద్‌లోని వనస్థలిపురం వైదేహినగర్‌లో నివసిస్తున్న మణిదీప్ కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మణిదీప్ రెడ్డి 2025 ఆగస్టులో ఉన్నత విద్య కోసం ఫిన్లాండ్‌కు వెళ్లాడు. అక్కడ లప్తి నగరంలోని ఎల్‌యుటి యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఈ ఏడాది మే 5న రాజధాని హెల్సింకికి వెళ్లిన అనంతరం అతనితో కుటుంబ సభ్యులు, స్నేహితులకు సంబంధాలు తెగిపోయాయి. మరుసటి రోజు నుంచి అతని ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో స్నేహితులు మే 11న లప్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విస్తృతంగా గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. తమ కుమారుడి జాడ కోసం మణిదీప్ కుటుంబ సభ్యులు ఫిన్లాండ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని ఆశ్రయించడంతో పాటు, ఇటీవల తెలంగాణ హైకోర్టును కూడా ఆశ్రయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని అతని ఆచూకీ కనుగొనేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలువురు రోజులుగా మణిదీప్ కోసం ఆందోళన చెందుతున్న కుటుంబానికి, సముద్రంలో అతని మృతదేహం లభించిందనే సమాచారం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఘటనపై ఫిన్లాండ అధికారులు చేసినట్లు సమాచారం.

# స్పీడుబోటు బోల్తా

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరరో నలుగురు పర్యాటకులు గల్లంతైనట్లు సమాచారం. ఫూ కాక్ ద్వీపం సమీపంలో స్పీడుబోటు తలక్రిందులైనట్లు రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొంది. హోన్ మీరుట్ ద్వీపం నుండి ఆన్‌థోయ్ పోర్టుకు ప్రయాణిస్తున్న పడవ సముద్రంలో 400 కి.మీ లోతుకు వెళ్ళిన తర్వాత బోల్తాపడిందని రాయిటర్స్ పేర్కొంది. 21 మందిని కాపాడామని, మృతదేహాలన్నింటినీ ఒడ్డుకు చేర్చామని అధికారులు తెలియజేశారు. ఈ బోటులో విహారం చేస్తున్నవారిలో ఎక్కువమంది తమ మొబైల్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులేనని లావా మొబైల్ కంపెనీ ప్రకటించింది. ఈ వార్త విని తమ గుండె బద్దలైందని కంపెనీ ఒక ప్రకటనలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. మృతులంతా తమ ఛానల్ భాగస్వాములు,టీమ్ మెంబర్లేనని ప్రకటించింది. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేసినట్లు పేర్కొంది. అధికారులతో తాము సంప్రదింపులు చేస్తున్నామని, మృతుల కుటుంబాలకు పూర్తి సహాయం చేస్తామని కంపెనీ ప్రకటించింది. ఈ ఉద్యోగులలో ఎక్కువమంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. వియత్నాంలో భారత రాయబార కార్యాలయం ఈ సమాచారాన్ని ధృవీకరించింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వియత్నాం న్యూస్ పోర్టల్ వివిఎన్ ఎక్స్‌ప్రెస్ ఇంటర్నేషనల్ చెప్పిన ప్రకారం, స్పీడు బోటు వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో ఈ పడవలో 32 మంది భారతీయ పర్యాటకుల తోపాటు మరో నలుగురు బోటు సిబ్బంది ఉన్నారు. సహాయ బృందాలు మిగిలినవారిని రక్షించి ఆసుపత్రులకు తరలించాయి. ఈ ద్వీప పరిసరాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని,సహాయ చర్యల నిమిత్తం స్థానికంగా ఉన్న భారత దౌత్యకార్యాలయం కూడా ఇక్కడ ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తోందని సోషల్ మీడియా ద్వారా భారత రాయబార కార్యాలయం తెలియజేసింది. బాధిత కుటుంబాలకు సమాచారం అందించడానికి హోచిమిన్ సిటీలో ఉన్న భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో, హనోయ్ నగరంలో ఉన్న భారత రాయబార కార్యాలయంలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. +8436 281 7930+8491 552 3714– +8433 452 0414 సంబర్లకు ఎవరైనా ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చు. అదేవిధంగా హనోయ్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు +8491 308 9165 నెంబరుకు డయల్ చేయాలి. ఈ ఘటనకు సంబంధించిన ఖచ్చితమైన వివరాలను రాబట్టేందుకు స్థానిక అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. భారత్ నుండి వియత్నాంకు ఇటీవలికాలంలో గణనీయంగా పర్యాటకుల సంఖ్య పెరిగింది. కాగా ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ విషయం తెలుసుకుని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన సంతాపం తెలియజేశారు. తక్షణం పర్యాటకులకుతగిన సహాయ సహకారాలు అందజేయాలని ఉన్నతాధికారులను కోరారు. వియత్నాంలో ఉన్న దౌత్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిసున్నారని ఎక్స్‌వేదికగా మోదీ పేర్కొన్నారు. కాగా లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఈ ప్రమాద ఘటనపట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలియజేశారు. కాంగ్రెస్‌పార్టీ నాయకుడు పవన్ ఖెరా కూడా మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలియజేశారు.

# రూ.7.86 కోట్ల టోకరా

(మొదటి పేజీ తరువాయి)

ముకేష్ కుమార్ జైన్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం 2025 మార్చిలో బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన జ్యువెలరీ ప్రదర్శనలో హైదరాబాద్‌కు చెందిన నితిన్ రమేష్ గులాబానీ పరిచయం అయ్యాడు. కేవీ జ్యువెలర్స్, నితిన్ జ్యువెలర్స్ పేర్లతో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు చెప్పి, పరస్పర వ్యాపార సంబంధాలు ప్రారంభించాడు. ప్రారంభ దశలో పంపిన రెండు బంగారు ఆభరణాల సరుకులకు ఒప్పందం ప్రకారం 30 రోజుల్లో చెల్లింపులు జరపడంతో నమ్మకం పెరిగింది. ఆ విశ్వాసంతో 2026 మార్చి నుంచి జూన్ మధ్య నాలుగు విడతల్లో మొత్తం రూ.13,81,47,259 విలువైన 22 క్యారెట్ల బంగారు ఆభరణాలను హైదరాబాద్‌లోని సోమాజిగూడ బాబుఖాన్ మాల్‌లో ఉన్న కార్యాలయానికి సరఫరా చేశారు. సరుకు స్వీకరించిన తర్వాత నిర్ణయించిన గడువులో చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, మొత్తం బిల్లులో రూ.5,95,16,570 మాత్రమే చెల్లించారు. మిగిలిన రూ.7,86,30,689 బకాయిని పలుమార్లు కోరినా వాయిదాలు వేస్తూ వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బకాయి వసూలు కోసం ఫిర్యాదుదారు తరచూ తన సిబ్బందిని హైదరాబాద్‌కు పంపించగా, ప్రతి సారి త్వరలో చెల్లిస్తామని హామీలు ఇచ్చినట్లు తెలిపాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని, మరికొంత సమయం ఇవ్వాలని, ఆలస్యానికి నెలకు రెండు శాతం వడ్డీ కూడా చెల్లిస్తానని నితిన్ గులాబానీ నమ్మబలికినట్లు ఫిర్యాదులో వివరించాడు. జూన్ 17న స్వయంగా హైదరాబాద్‌కు వచ్చిన ఫిర్యాదుదారుకు మరుసటి రోజు రూ.2 కోట్లు చెల్లిస్తానని హామీ ఇచ్చినప్పటికీ, జూన్ 18న కార్యాలయానికి వెళ్లేసరికి తాళాలు వేసి కనిపించిందని పేర్కొన్నాడు. నిందితుడి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో పాటు సిబ్బంది ఫోన్లు కూడా అందుబాటులో లేకపోయాయని తెలిపాడు. నివాసానికి వెళ్లినా తాళాలు వేసి ఉండటంతో మోసపోయినట్లు గుర్తించినట్లు వెల్లడించాడు. నితిన్ రమేష్ గులాబానీతో పాటు విపిన్ రమేష్ గులాబానీ, అకౌంట్స్ మేనేజర్‌గా పరిచయం చేసుకున్న ధన్‌రాజ్ సింగ్, సేల్స్ ఇన్‌చార్జిగా ఉన్న హరీష్ కలిసి కుట్రపూరితంగా విలువైన బంగారు ఆభరణాలను దిగుమతి చేసుకుని నమ్మకద్రోహానికి పాల్పడ్డారని ఫిర్యాదులో ఆరోపించారు. ఎసిపి ఎస్. రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మోసానికి పాల్పడిన నగల వ్యాపారులు ఇదే పద్ధతిలో మరేవరినైనా మోసగించారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

# తక్షణమే డిజిటలైజేషన్

(మొదటి పేజీ తరువాయి)

చేసిన హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన సిఈఓ, బిఎల్‌ఓలు ఫారాల పంపిణి సజావుగా చేస్తున్నారా? ఓటర్లు నింపిన ఫారాలను ఎప్పటికప్పుడు తిరిగి తీసుకుంటున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ బిఎల్‌ఓలు ఓటర్ల నుంచి సేకరించిన ఫారాలను వెంట వెంటనే డిజిటలైజేషన్ చేయించాలని, ఆపరేటర్లతో ఈ ప్రక్రియను చాలా జాగ్రత్తగా, తప్పులు దొర్లకుండా చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఆ తర్వాత బాలాజీ నగర్ పరిధిలోని పలు అపార్ట్‌మెంట్‌లలో బిఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఫారాల అప్లోడింగ్, స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అందుబాటులో లేని ఓటర్ల వివరాలను ఫోన్‌ల ద్వారా సేకరించి, వారికి ఫారాలు అందించాలని, వారు దొరకని పక్షంలో ఆ వివరాలను సూపర్‌వైజర్లకు నివేదించాలని సూచించారు. 2002లో లేని వారి ఫారాలను ఏ విధంగా పూరించాలనే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కెపిహెచ్‌బి 6వ ఫేజ్‌లోని అపార్ట్‌మెంట్‌లు, ఇండో ఫార్చ్యూన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులను సిఈఓ సందర్శించారు. అక్కడ ఓటర్లతో నేరుగా మాట్లాడి, 'సర్' ప్రక్రియపై వారికున్న పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ పర్యటనలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, తహసిల్దార్ అశోక్, డిసి ఆంజనేయులు పాల్గొన్నారు.

**ముషీరాబాద్‌లో డేటా ఎంట్రీ కేంద్రాన్ని తనిఖీ**

ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో సాగుతున్న 'సర్' పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను సిఈఓ సుదర్శన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అదనపు కమిషనర్ (ఎన్నికలు) బి.సంతోష్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని వాలీబాల్ గ్రౌండ్ తళ్ళబస్తీ కమ్యూనిటీ హాల్లో జరుగుతున్న డేటా ఎంట్రీ నాణ్యత, మౌలిక సదుపాయాల లభ్యత, వినియోగిస్తున్న మానవ వనరులను ఉన్నతాధికారుల బృందం క్షుణ్ణంగా సమీక్షించింది. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, సకాలంలో దోషరహితంగా డిజిటలైజేషన్ను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

విడిచినట్టు కుటుంబ సభ్యులు నిర్ధారించారు. నైటింగేల్ ఆఫ్ ఇండియాగా పిలవబడే జానకి స్వరం మూగబోయింది. అరవై ఏళ్ళ సినిమా కెరీర్ లో నలభై ఎనిమిది వేలకు పైగా పాటలు పాడారు. దాదాపు ఇరవై భాషల్లో ఆమె పాటలు పాడారు. వందల సంఖ్యలో ఆమె అవార్డులు అందుకున్నారు. 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్, గుంటూరులోని, రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో జానకి జన్మించారు. దక్షిణ భారత కోకిలగా ఆమె పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, సంస్కృతం, ఒడియా, తులు, ఉర్దూ, పంజాబీ, బడగ, బెంగాలీ, కొంకణి వంటి 20 భారతీయ భాషల్లో , ఇంగ్లీష్, జపనీస్, జర్మన్ సింహళం వంటి విదేశీ భాషలలో కూడా పాటలు పాడారు. ఆమె తన కెరీర్‌లో అత్యధిక పాటలు పాడిన భాష కన్నడ, ఆ తర్వాత మలయాళం. ఆమె 'భావవ్యక్తీకరణ స్వర మార్పుల రాణి'గా కూడా ఆమెను పిలుస్తారు.

1957లో తమిళనాడు ప్రవేశంచారు. తెలుగులో ఎస్ పి బాలసుబ్రమణ్యంతో కలసి అనేక హిట్ పాటలు పాడారు. 4 నేషనల్ అవార్డులు, 33 ఫిలిం అవార్డులు , 10 నంది అవార్డులు, కేరళ ప్రభుత్వ నుంచి 11 అవార్డులు ,తమిళ నుంచి 6 అవార్డులు, ఒడియా నుంచి ఒక అవార్డు ఇలా అనేక అవార్డులు ఆమె సొంతం చేసుకున్నారు.

ఎస్ జానకి 1957లో ఎం ఎల్ ఎ సినిమాతో తెలుగు సినిమాల్లో తన కెరీర్‌ను ప్రారంభించింది. బావ మరదళ్లు, పూజా ఫలం, బంగారు పంజరం వంటి చిత్రాలలో ఎస్. జానకి పాటలు పాడారు. అవి చాలా ప్రజాదరణ పొందాయి. ఆమె 1960– 70లలో నిరంతర విజయాలను అందుకున్నారు. దాదాపు 90ల మధ్య వరకు ఈ పరంపరను కొనసాగించింది. 'నీ ఆశ అదియాసా' , 'ఇదేనండి ఇదేనండి భాగ్యనగరము' ఎం ఎల్ ఎ (1957), 'పొడము రావోయి బావ' కుటుంబ గౌరవం (1957), 'అనుకునాదంట' అన్న తమ్ముడు (1958) 'గాజులమ్మ గాజులు' కార్తవరాయుని కథ (1958), 'లే లే లే' శోభా (1958), 'ఆకాశమేలే అందాల రాజే' రక్త సంబంధం (1962) 'ఈ పగలు' సిరి సంపదలు (1962), 'వేణుగానమ్ము వినిపించెనే' సిరి సంపదలు (1962), 'పువ్వు నవ్వేను' సిరి సంపదలు (1962) సింహరాశిలో 'పిలిచి' (2001) అనేక హిట్ పాటలు పాడారు. ప్రముఖుల సంతాపం గాయని జానకి మరణం భారతీయ సినిమా పరిశ్రమకు తీరనిలోటని పలువురు తెలుగు సినిమా ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెపాటలు పడితే సినిమా హిట్టు అయినట్టే అని ప్రముఖ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఆమె చేత పాట పడించడం కోసం నిర్మాతలు క్యూ కట్టేవారని చెప్పారు. చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంతాపం ప్రకటించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com